
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 3-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 215 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

ప్రజా చైతన్య దీపిక
శ్రామిక ప్రజల మార్గదర్శి
సామాజిక, సాహిత్య విశ్లేషణలకు ప్రేరణ

నందిని సిధారెడ్డి.. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మెన్





తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి దారుల వెంట పురోగమింప చేయా లని అవతరించిన పత్రిక నవతెలంగాణ. పాలక సమూహాల అధికార సందోహాల నడుమ, పెట్టుబడి దారుల వ్యాపార వ్యూహాల నడుమ, మార్కెట్ల విపరీత లాభదాహాల నడుమ ఇవేవీ లేని ప్రజా చైతన్య దినపత్రిక నిలదొక్కుకొనటం బహుకష్టం. అట్లా నిలదొక్కుకొని, తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న పత్రిక నవతెలంగాణ. ట్రేడ్ యూనియన్ వార్తలు, వ్యవసాయ సమస్యల సమా చారం, సామాజిక, ఆర్థిక పరిణామాల విశ్లేషణలు, వామపక్ష కార్య కలాపాల చలనాలు ఏవి కావాలన్నా నవతెలంగాణ చదవాల్సిందే. వాటన్నిటి వేదిక నవతెలంగాణే. వర్తమాన తెలుగు సాహిత్య..15లో



నాపై దాడులకు ఈడీ కుట్ర..
విశ్వసనీయ సమాచారమందింది

లోక్‌సభలో నా 'చక్రవ్యూహం' ప్రసంగం కొందరికి నచ్చలేదు
అందుకే ఈ ప్రయత్నాలు
సోదాలకు చాయ్, బిస్కెట్లతో వెయిటింగ్ :
'ఎక్స్'లో రాహుల్ పోస్ట్

రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన వైనం

వివరాలు 15లో



ప్రజాస్వామ్యం సజావుగా సాగాలి
గవర్నర్లు సమన్వయంతో పని చేయాలి

సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి
మూడు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలో కొత్త శకం
గవర్నర్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచన

గవర్నర్ల రెండు రోజుల సదస్సు ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వివరాలు 7లో

నీట్ అవకతవకలపై
ఎన్టీఏకు సుప్రీం చీవాట్లు
పరీక్షల ప్రక్రియను పునర్వ్యవస్థీకరించాలని కేంద్రానికి ఆదేశం



న్యూఢిల్లీ : అండర్‌గ్రాడ్యుయేట్ నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్టు (నీట్) 2024లో అక్రమాలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి సుప్రీంకోర్టు శుక్రవారం చీవాట్లు పెడుతూ తీవ్రమైన తీర్పును వెల్లడించింది. అలాగే పరీక్ష ప్రక్రియను మొత్తంగా పునర్వ్యవస్థీకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వివరణాత్మక తీర్పు వెల్లడించింది. భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ (ఇస్రో) మాజీ చైర్‌పర్సన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలోని హై పవర్ కమిటీ చేసే సిఫారసులు అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. నీట్ పరీక్ష నిర్వహణ కోసం దిగువ స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకూ రాధాకృష్ణన్ కమిటీ సూచించే భద్రతా మెరుగుదలలు, డేటా రక్షణ చర్యలు, కాలానుగుణంగా ఆడిట్లు, పరీక్షా కేంద్రాల ఆకస్మిక తనిఖీలు, విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు ప్రత్యేక పరిష్కార యంత్రాంగాలు వంటి సిఫార్సులను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా నీట్ యూజీ 2024 సమయంలో కొన్ని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను ఇ-రిక్షాల ద్వారా ఎలా రవాణా చేశారని ఎన్టీఏను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్‌టిఎ 'లగ్జరీ' విద్యార్థులు భరించలేని విధంగా ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ పేర్కొన్నారు.

'హైపవర్ కమిటీ సిఫారసులు ద్వారా కేంద్రం నీట్ ప్రక్రియను మొత్తంగా పునర్నిర్మించాలి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి' అని శుక్రవారం విచారణకు కేంద్రం, ఎన్టీఏ తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. అవకతవకలను ఎన్టీఏ విడిచి పెట్టాలని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్, నిబంధనల ఉల్లంగన గురించి ఎన్టీఏ ఇచ్చిన విభిన్నమైన వివరణలను సుప్రీంకోర్టు ఖండించింది. 1563 విద్యార్థులకు వారు ఎంపిక చేసుకున్న భాష కాకుండా ఇతర భాషలో ప్రశ్నాపత్రం కేటాయించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ తప్పు తరువాత వారికి పరిహారమార్కులను ఇవ్వడాన్ని, తరువాత కమిటీ...7లో



ఫిబ్రవరిలో డీఎస్సీ
మేలో గ్రూప్ - 2 నోటిఫికేషన్
• అసెంబ్లీలో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి • జాబ్ క్యాలెండర్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది. అసెంబ్లీలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేశారు. మొత్తం 20 రకాల ఉద్యోగాలకు సంబంధించి నియామకాల వివరాలను ఇందులో పొందుపరిచారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెలతోపాటు, నియామక పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారనే వివరాలు, పరీక్ష నిర్వహించే బోర్డు, ఉద్యోగ అర్హతలు వంటి వివరాలను ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో నిరుద్యోగులకు ఇచ్చినమాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని వివరించారు. దీనికి సంబంధించి ఈనెల ఒక టిన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రతి ఏటా నిర్దిష్టమైన కాలవ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు వీలుగా జాబ్ క్యాలెండర్‌ను క్యాబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. వాస్తవానికి నోటిఫికేషన్ల జాప్యం, తరచూ వాయిదాలతో నిరుద్యోగులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో నియామక ప్రక్రియ గందరగోళంగా ఉండేదని అన్నారు. గతంలో గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దయింద న్నారు. తాము అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ తప్పిదాలు, అనాలోచిత నిర్ణయాలు, పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు చేశామని వివరించారు. అందులో భాగంగా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయడంతో పాటు పలు పరీక్షలకు కొత్త నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్-2ను వాయిదా వేశామని అన్నారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి పోస్టుల వివరాలను నోటిఫికేషన్లను విడుదల చేసినపుడు ...3లో

ఒకటో తరగతి నుంచే స్కిల్స్ ఉండాలి : ఎ. నర్సిరెడ్డి
వివరాలు 7లో

ఉభయసభలు నిరవధిక వాయిదా
65 గంటలు పని చేసిన అసెంబ్లీ

హైదరాబాద్‌లో ఆక్రమణల నివారణకే హైడ్రా


• వందేండ్ల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే ఏర్పాటు : శాసనసభలో సీఎం రేవంత్
• కేసీఆర్ కట్టిన మేడిగడ్డ.. మేడిపండైంది
• మేం ప్రజల్ని బానిసలుగా భావించం
• పాలకులుగా, సేవకులుగా ఉంటాం

వివరాలు 3లో

సుప్రీం ఆదేశాల అమలుకు
కార్యాచరణ చేపట్టాలి
రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ(ఎం) సూచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సూచించింది. ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో ఎస్సీ కేటగిరీలో మరింత వెనుకబడిన కులాలకు విడివిడిగా కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూల అంశమని తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తీర్పును అమలుపరచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనంటూ తీర్పులో స్పష్టంగా పేర్కొన్నదని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడానికి అవసరమైన అన్ని రకాల చర్యలూ రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఎస్సీల్లోని వెనుకబడిన కులాలను విధాన నిర్ణయాల పరిధిలోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల్లో కూడా అత్యంత వెనుకబడిన ...15లో

17 శాతం పెరిగిన పన్నుల రాబడి
• రెవెన్యూ రాబడుల్లో వృద్ధి నమోదు
• సొంత ఆదాయం లేని సంస్థలకు రుణాలు
• ఇష్టారాజ్యంగా సాగునీటి ప్రాజెక్టుల అంచనాలు పెంపు
• గొర్రెల పంపిణీ, డబుల్ ఇండ్లకు కేటాయింపులే తప్ప ఖర్చు సున్నా
• ఈ ఏడాది రెండో త్రైమాసిక ఆదాయం రూ. 48,790 కోట్లు, వ్యయం జూన్ వరకు రూ. 45,320 కోట్లు : 2023-24 కాగ్ నివేదిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర రెవెన్యూ రాబడులు గణనీయంగా పెరిగాయని కాగ్ నివేదిక వెల్లడించింది. 2023 మార్చితో ముగిసిన ఏడాదికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ నివేదికను ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో విడుదల చేసింది. రాష్ట్ర జీఎస్‌డీపీ 2021-22తో పోలిస్తే 2022-23లో 16 శాతం పెరిగిందని పేర్కొంది. రెవెన్యూ రాబడులు 25 శాతం పెరగగా, సొంత పన్నుల రాబడి 17 శాతం ...7లో

డీఎస్పీలుగా
మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్



మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌ను గ్రూపు-1 కేటగిరీ కింద డీఎస్పీలుగా నియమిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. చదువులోనే కాదు క్రీడల్లో రాణిస్తే కూడా ఉన్నత ఉద్యోగం వస్తుందని, ...7లో

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి
సెన్సెక్స్ 886 పాయింట్ల పతనం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులతో శుక్రవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 886 పాయింట్లు లేదా 1.08 శాతం పతనమై 80,982కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 293 పాయింట్లు లేదా 1.17 శాతం నష్టపోయి 24,718 వద్ద ముగిసింది. ఒక్క పూటలోనే ...15లో



చిన్నారులపై
దారుణాలు
నిజామాబాద్‌లో ఐదేండ్ల పాపపై లైంగికదాడి
ఉప్పల్‌లో ఓ పాఠశాలలో బాలిక పట్ల అసభ్యకర ప్రవర్తన
విద్యార్థి సంఘాల ఆందోళన

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఉప్పల్

రాష్ట్రంలో అమానుష ఘటనలు.. దారుణాల పరంపర కొనసాగుతూనే ఉంది. రోజుకొక చోట బాలికలు, మహిళ లపై లైంగికదాడులు జరుగుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వరుస ఘటనలపై ఆందోళన వెల్లడవుతుండగా...15లో

టీచర్లే బ్రాండ్ అంబాసిడర్లు


• తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర • ప్రభుత్వ బడుల్లోనే చదివి ఈస్థాయికి వచ్చా

టీచర్లతో ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేని దని గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా...7లో

నేటి డిగ్రీ.. రేపటి భవిష్యత్‌కు పునాది

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- ఘనంగా మహేంద్ర యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

విజ్ఞానం, నైపుణ్యాలతో నేడు సాధించిన డిగ్రీ రేపటి భవిష్యత్‌కు పునాది అవుతుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహదూరుపల్లిలోని మహేంద్ర యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మంత్రి మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య సమాజంలో వ్యక్తి ఉన్నతికి ఎంతో తోడ్పడు తుందన్నారు. 21వ శతాబ్దంలో ప్రపంచం చాలా వేగంగా మారుతున్నదని, అవకాశాలను అంది పుచ్చుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. అందుకు తగ్గ నైపుణ్యం, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కొన్ని దశాబ్దాలుగా పారిశ్రామిక యుగం సమాచార యుగానికి దారి తీసిందని, ఈ మార్పు ప్రపంచాన్ని అన్ని రకాల సరిహద్దుల్ని అనుసంధానించిందని అన్నారు. విజ్ఞానం, సమాచారం జాతీయ సరిహద్దులను దాటి అంతర్జాతీయ సరిహద్దులకు చేరుతుందన్నారు. అర చేతుల్లోనే ప్రపంచ స్థితిగతులు, వ్యాపార లావాదేవీలను అంతర్జాలం వల్ల తెలుసుకోగలుగుతున్నామని చెప్పారు. మన మేధో వనరులు ఈ సమాచార విస్ఫోటనానికి అనుగుణంగా లేవని, దాన్ని ఎదుర్కోవడానికి తగిన మేధో మథనం జరగాలని అన్నారు. డేటా సైన్స్ పరిశోధన సాధనంగా కీలక పాత్ర పోషిస్తోందని, ఉదాహరణకు ఖగోళ శాస్త్రంలో ఇది కొత్త నక్షత్రాలు, గెలాక్సీలను గుర్తించడంలో సహాయపడుతుందని చెప్పారు. అన్ని రంగాల్లో సైన్స్ ద్వారా విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనువైన, అతి చురుకైన జీవన విలువల గురించి దృష్టిలో పెట్టుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్స్ అత్యంత ఉత్తేజకరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారని, ప్రపంచంతో పోటీ పడటానికి భయపడాల్సిన అవసరం లేదని, ఎవరి శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు ఎందుకు ఉపయోగపడతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మార్టిన్ లూథర్ కింగ్ ప్రకారం "మీరు ఎగరలేకపోతే పరుగెత్తండి, మీరు పరుగెత్తలేకపోతే నడవండి, మీరు నడవలేకపోతే పాకండి, కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా మీ ప్రయత్నాలు ఆపకుండా ముందుకు సాగండి" అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ విలువలతో కూడిన విద్య ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థులు వారి కలలను నెరవేర్చుకోవాలని సూచించారు.

2014లో మహీంద్రా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌గా ప్రారంభమైనప్పటి నుంచి దక్షిణ భారతదేశంలో ఒక ప్రధాన క్యాంపస్‌గా స్థిరపడిందని.. ఈ విశ్వవిద్యాలయంలో ప్రసంగించడం గొప్ప విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఆనంద్ మహేంద్ర, గెస్ట్ ఆఫ్ హానర్‌గా శోభన కామినేని, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీట్, ఎన్టీఏను రద్దు చేయాలి

- రాష్ట్ర జాబితాలో విద్యను చేర్చాలి
- రాజ్యసభలో ప్రయివేట్ మెంబర్ బిల్లు
- నీట్ అంశం సుప్రీం తీర్పునకు విరుద్ధం : డీఎంకే సభ్యుడు ఎం మహమ్మద్ అబ్దుల్లా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్ర జాబితాలో చేర్చే చట్టం తీసుకు రావాలని, నీట్, ఎన్టీఏను రద్దు చేసి రాష్ట్రాలు మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ ప్రతిపక్ష సభ్యులు ప్రయివేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టారు. శుక్రవారం రాజ్యసభలో ప్రయివేట్ మెంబర్ బిజినెస్‌లో ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. తమిళనాడుకు చెందిన డీఎంకే సభ్యుడు ఎం మహమ్మద్ అబ్దుల్లా అధికార ఎంపీల వ్యతిరేకత మధ్య నీట్ అంశం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రాల విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని, వైద్య, విద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ప్రతిపత్తిపై ఉల్లంఘన ను ఎత్తిచూపారు.

రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లో విద్యారంగాన్ని ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్ర జాబితాలో తొలగించేలా చట్టాన్ని తీసుకురావాలని కోరారు. నీట్, ఎన్టీఏను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమాణాల ఆధారంగా వైద్య ప్రవేశాలను తిరిగి పొందాలని కోరారు. ఇవి ప్రత్యేక రాష్ట్రాల అవసరాలకు ప్రత్యేకంగా రూపొందించబడతాయని అన్నారు. నీట్ పరీక్షతో ప్రభావానికి గురైన బాధిత కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని తెలిపారు. అర్హతగల అభ్యర్థుల ఎంపికలో నీట్ పరీక్ష లోపభూయిష్టంగా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న నీట్ ప్రశ్నాపత్రం లీకేజీలు, బాధ్యతా రహితంగా గ్రేస్ మార్కులు ఇవ్వడం, విద్యార్థులకు నష్టం జరగకుండా పరీక్షను విజయవంతంగా నిర్వహించలేని ఎన్టీఏ అసమర్థత వంటి అంశాలను ఆయన ఉదహరించారు.

రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ అడిగిన తరువాత అబ్దుల్లా తీర్మానాన్ని ప్రవేశ పెట్టడానికి ముందే, విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి జోక్యం చేసుకుని ప్రయివేట్ మెంబర్ బిల్లు "పార్లమెంటరీ నిబంధనల"కు విరుద్ధంగా ఉందని అన్నారు. 2018లో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిందని, ఆ ఆదేశాలు, తీర్పుల తరువాత నీట్ పరీక్షను ఎన్టీఏ నిర్వహిస్తోందని ఆయన అన్నారు. అత్యున్నత న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పు తరువాత, మొత్తం పరీక్షా ప్రక్రియ సంస్కరణలను పరిశీలించడానికి, ఎన్టీఏ, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్ పనితీరును సమీక్షించడానికి ప్రభుత్వం ప్రముఖ వ్యక్తుల నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఎన్టీఏ, నీట్ రద్దుపై చర్చించడం సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని, తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. బీజేపీకి చెందిన ఘనశ్యామ్ తివారీ కేంద్ర మంత్రితో ఏకీభవించారు. ఈ అంశంపై చర్చ సుప్రీంకోర్టును ధిక్కరించినట్లేనని అన్నారు.

సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్, ఆప్‌కి చెందిన రాఘవ్ చద్దా, కాంగ్రెస్‌కు చెందిన శక్తిసిన్హ్ గోహిల్‌లతో సహ పలువురు ప్రతిపక్ష సభ్యులు చైర్మెన్ ఆమోదించిన తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టడానికి అనుమతించకపోవడం సభ్యుని హక్కు ఉల్లంఘనవుతుందని వాదించారు. అధికార, ప్రతిపక్షాల అరుపుల మధ్య, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభ్యుడిని కొనసాగడానికి అనుమతించాలని డిప్యూటీ చైర్మెన్‌ను కోరారు. అయితే తీర్మానంపై ఓటింగ్‌కు డిమాండ్ చేశారు.

"న్యాయవ్యవస్థ, శాసనసభ ఒకదానికొకటి సవాలు చేయవు. మేము ఒకరినొకరు గౌరవిస్తాము. సుప్రీంకోర్టు తీర్పు ఇస్తుంది. పార్లమెంటు చట్టాలను చేస్తుంది" అని అన్నారు. "సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ఏకీభవించి, అమలు ప్రక్రియను ప్రారంభించిన తరుణంలో ఈ అంశంపై మళ్లీ చర్చించడం సరికాదు" అని రిజిజు అన్నారు.

సభా విధి విధానాలను అనుసరిస్తామని డిప్యూటీ చైర్మెన్ రాజ్యసభకు హామీ ఇచ్చారు. బిల్లును ప్రవేశపెట్టాలని అబ్దుల్లాను కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు, తమ పార్టీ రాజకీయాలకు అతీతంగా ఉండాలని కాంగ్రెస్ ఎంపీ శక్తి సింగ్ గోహిల్ అన్నారు. టీఎంసీ ఎంపీ జవహర్ సిర్కార్ మాట్లాడుతూ నీట్ విధానం రాష్ట్ర బోర్డుల విద్యార్థులకు న్యాయం చేయదని పేర్కొన్నారు. అయితే ఎన్టీఏతో పరీక్షల నిర్వహణ అనుభవంలో విఫలమైందని, మెరుగైన వ్యవస్థను తీసుకురావడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. డీఎంకేకు చెందిన ఎన్ఆర్ ఎలాంగో నీట్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, విద్యార్థులకు వ్యతిరేకమని, దీనిని రద్దు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నుంచి మద్దతు ఇవ్వాలని అన్నారు. దేశంలో విద్య, ఉపాధికి మధ్య చాలా అంతరం ఉందని, అవినీతి వ్యవస్థ కారణంగా నీట్ ఔత్సాహికులు ఇబ్బంది పడుతున్నారని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి నీట్ వైఫల్యానికి కారణమైన వారిని శిక్షించాలని కోరారు.

ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా ఎన్టీఏ, నీట్ రెండింటినీ రద్దు చేయాలని కోరగా సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఈ విషయం మిలియన్ల మంది విద్యార్థులు, వారి కుటుంబా లను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ విషయాన్ని వివరంగా చర్చించి, పరిష్కారం ఎలా కనుగొనాలో అర్థం చేసుకోవాలని సూచించారు.

మరోవైపు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా నీట్‌ను సమర్థించారు. నీట్ రాకముందు వైద్య విద్య బహిరంగ వ్యాపారమైందని విమర్శించారు. నీట్‌ను తీసుకురాక ముందే వైద్య విద్యలో అవినీతి చోటుచేసుకుందని అన్నారు. పీజీ సీటు రూ.8 కోట్లకు అమ్మే వారని, రేడియాలజీ వంటి విభాగంలో సీటు అయితే రూ.12 నుంచి 13 కోట్లు ఉండేదని అన్నారు. నీట్ రాకముందు విద్యార్థులు వైద్య పరీక్షల కోసం దేశమంతటా వెళ్లాల్సి వచ్చేదన్నారు. డబ్బు, సమయంతో పాటు వైద్య విద్యావ్యవస్థలో భారీ అవినీతికి కూడా విద్యార్థులు పూనుకోవాల్సి వస్తోందని మంత్రి అన్నారు. బీజేపీ ఎంపీ అజిత్ మాధవరావు గోప్‌చాడే నీట్ విజయవంతమైందని, సమాజంలోని బలహీన వర్గాలు, మహిళా అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందని పేర్కొన్నారు.

ఫేక్ వీడియోలపై చర్యలు తీసుకుంటాం

- నా వీడియోని ఎడిట్ చేసి వైరల్ చేస్తున్నారు
- మక్కన్‌సింగ్‌తో మాట్లాడటాన్ని అసభ్యకరంగా చిత్రించడం దారుణం
- ఉచిత బస్సు ప్రయాణంపై అసత్య ప్రచారం తగదు : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సోషల్ వీడియోలో జరుగుతున్న దాడులు, వస్తున్న ఫేక్ వీడియోలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు మక్కన్‌సింగ్‌తో తాను మాట్లాడుతున్న వీడియోను మార్ఫింగ్‌తో అసభ్యకరంగా చిత్రీకరించి వైరల్ చేయడం దారుణమన్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. శుక్రవారం అసెంబ్లీలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడే సమయంలో మంత్రి జోక్యం చేసుకుని ప్రసంగించారు. ఇప్పటిదాకా 70 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని చెప్పారు. కొందరు కావాలనే వీడియోలు క్రియేట్ చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఊరికే బస్సులో అటూఇటూ తిరగడానికి ఎవ్వరూ ఖాళీగా ఉండరనీ, ఎవరైనా అవసరాల కోసమే బయటకు వస్తారని చెప్పారు. మహిళలను అవమానపరిచే విధంగా వీడియోలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాంటి వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భావప్రకటనా స్వేచ్ఛ గురించి కేటీఆర్ మాట్లాడటం



విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే వందల మంది మీద కేసులు పెట్టారనీ, తన కార్యకర్తలు కూడా కేసులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గిరిజనురాలు, మహిళా మంత్రి అయిన సీతక్క మీద మీమ్స్ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలిగానీ, అది ఇతర వ్యక్తులను కించపరిచేలా ఉండొద్దని అన్నారు. సభా కార్యక్రమాలను వీడియో తీసి సభ్యులను కించపరిచేలా వీడియోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు.

స్పోర్ట్స్ పాలసీ తెస్తాం

బ్యాగరి కంచెలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- బీసీసీఐతో సంప్రదింపులు పూర్తి
- త్వరలోనే భూముల కేటాయింపు
- క్రీడల ప్రోత్సాహం కోసం బడ్జెట్‌లో రూ.321 కోట్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామనీ, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దాన్ని ప్రకటిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బ్యాగరి కంచెలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించబోతున్నామని వెల్లడించారు. దీనిపై బీసీసీఐతో సంప్రదింపులు జరపగా అంగీకరించిందనీ, త్వరలో భూములు కూడా కేటాయిస్తామని తెలిపారు. యువతను వ్యసనాల నుంచి బయటపడేందుకు క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తామనీ, అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ బడ్జెట్‌లో రూ.321 కోట్లను కేటాయించామని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ రాష్ట్రాల పాలసీలు అధ్యయనం చేసి ఉత్తమ పాలసీని తీసుకొస్తామని స్పష్టం చేశారు. హర్యానాలో అత్యధికంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో క్రీడాకారులు మెడల్స్, పతకాలు సాధిస్తే నేరుగా ప్రభుత్వపరంగా దక్కాల్సినవన్నీ దక్కుతున్నాయని చెప్పారు. మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూములుంటే స్టేడియాలు నిర్మించడానికి తమకేమీ అభ్యంతరం లేదన్నారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకు వచ్చేందుకు క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ పాలసీ కోసం ఎవరు సలహాలిచ్చినా స్వీకరిస్తామని చెప్పారు. క్రీడలపై నిర్దిష్టమైన పాలసీ లేకపోవడంతో ఆఫ్రో ఆసియా గేమ్స్ కోసం నిర్మించిన గచ్చిబౌలి స్టేడియం వేడుకలు, పెండ్లీలకు, ఎల్బీ, సరూర్‌నగర్ స్టేడియాలు రాజకీయ సభలకు నేడు వేదికలుగా మారాయన్నారు. వాటన్నింటినీ ఆధునీకరించి విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు.

10.12 గంటల నిలబడటం కష్టమే..కూర్చునే హక్కు కల్పించడంపై పరిశీలిస్తాం : సీఎం

సెక్యూరిటీ గార్డులు, హోంగార్డులు, నాలుగో తరగతి ఉద్యోగులు, షాపింగ్‌మాల్స్‌లో పనిచేసేవారు విధుల సమయంలో 10 నుంచి 12 గంటల పాటు నిలబడటం కష్టమేననీ, వారికి కూర్చునే హక్కు కల్పించడంపై త్వరలో విధివిధానాలు రూపొందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. వారికి కూర్చునే సౌకర్యం కల్పించే విషయంపై ఇప్పటికే అమలు చేస్తున్న తమిళనాడు రాష్ట్రంలో అధ్యయనం చేయించి ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు.

అందరూ అంగీకరిస్తే తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు: సీఎం

సభలోని అన్ని పక్షాల వారు అంగీకరిస్తే హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడానికి తనకేం అభ్యంతరం లేదని ప్రకటించారు. సురవరం తెలుగు భాష ఉన్నతీకరించేందుకు కృషి చేశారనీ, తన సాహిత్యంతో, గోల్కొండ పత్రికతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు.



భావప్రకటనా స్వేచ్ఛపై దాడులు తీవ్రతరం

ధర్నాలకూ పోలీసుల అనుమతి కావాలా? : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలోనూ, రాష్ట్రంలోనూ భావప్రకటనా స్వేచ్ఛపై దాడులు తీవ్రమయ్యాయని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ, తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూప సవరణ, తెలంగాణ శాసనాల మార్పు సవరణ బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేయడానికి అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ధర్నాచౌక్‌ను ఎత్తేస్తే పునరుద్ధరణ కోసం అన్ని పార్టీలూ పోరాటం చేశాయనీ, హైకోర్టు ద్వారా విజయం సాధించాయని గుర్తు చేశారు. అసెంబ్లీ జరిగే సమయంలో ధర్నాలు చేస్తే సభ దృష్టికి వచ్చి సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో కార్మికులు ఉంటారన్నారు. వాళ్లేం ఉగ్రవాదులు కాదు.. అసెంబ్లీపై దాడి చేసే వారు కాదు కదా.. కేవలం సమస్యను ఎత్తిచూపాలనే ప్రయత్నంలో భాగంగానే వారు ధర్నాలు చేస్తారన్నారు. కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గత ప్రభుత్వ దారిలో పోవద్దని సూచించారు. ఉపా చట్టం రాష్ట్రంలో యథేచ్ఛగా అమలవుతున్నదన్నారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా పోయిందనీ, రచయితల సంఘాలపై దాడులు చేస్తున్నారని వాపోయారు. ఎఫ్ఐఆర్ లేకుండానే విచారణల పేరిట జైళ్లలో వేస్తున్నారన్నారు. దేశద్రోహం కేసులు పెడుతున్నారని చెప్పారు. కొత్త చట్టాల పేర్లు చదవలేని విధంగా ఉన్నాయన్నారు. ఏండ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం దిశగా దృష్టిసారించేందుకు జడ్జీలు, సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు.



కళాకారులకూ ఓ పాలసీ తీసుకురావాలి

రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కూనంనేని చెప్పారు. క్రీడల్లో యాక్టివ్‌గా ఉండే పిల్లలకు చిన్నతనంలోనే ఉచిత విద్యతో పాటు కోచింగ్ అందించాలని కోరారు. అదే సందర్భంలో కళాకారుల కోసం కూడా ఒక పాలసీ ఉండాలని అభిప్రాయపడ్డారు. వారికి హెల్త్ కార్డులు, రేషన్‌కార్డుల మంజూరు, ఇతరత్రా సదుపాయాల కల్పనపై ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే గ్రూపు-4 ఉద్యోగులు, హోంగార్డులు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే కార్మికులు రోజంతా నిలబడి ఉద్యోగం చేయలేకపోతున్నారనీ, తమిళనాడు తరహాల్లో వారికి కూర్చునే హక్కు కల్పిస్తూ ఒక చట్టం తేవాలని విన్నవించారు.

---

25 ఏండ్లలో నేనెన్నడూ చూడలేదు

- అర్ధరాత్రి తర్వాత ప్రొసీజర్ ఇవ్వడమేంటి?
- సబ్జెక్టుపై సభ్యులు ప్రిపేర్ కావొద్దా? సమగ్ర చర్చ జరగొద్దా? : అక్బరుద్దీన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సభకు సంబంధించిన కార్యక్రమాల వివరాలను, బిల్లులను అర్ధరాత్రి రెండు గంటలకు ఇవ్వడమేంటి? పొద్దుగాలనే హడావిడిగా చర్చ పెట్టి ఆమోదింపజేయడమేంటి? 25 ఏండ్లుగా తాను సభలో ఉంటున్నాను. ఎన్నడూ ఇలాంటి పద్ధతి చూడలేదు' అంటూ ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభలో బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన జోక్యం చేసుకుని మాట్లాడారు. ఒక సబ్జెక్టుపై చర్చ పెట్టే ముందు సభ్యులు సన్నద్ధం కావడానికి కొంత సమయం ఇచ్చేవారని చెప్పారు. ఇప్పుడు అదేం లేదన్నారు. చర్చకు పెట్టే సబ్జెక్టుపై సభ్యులు ప్రిపేర్ అయ్యి రావొద్దా? సమగ్ర చర్చ జరగొద్దా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇది సభకు మంచిది కాదన్నారు. ఈ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలి

- పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియెడ్‌ను తప్పనిసరి చేయాలి
- మండలిలో చైర్మెన్ సహా పలువురి సభ్యుల సూచన
- విద్యాశాఖకు తగిన ఆదేశాలిస్తాం : డిప్యూటీ సీఎం భట్టి
- శాసనమండలి నిరవధిక వాయిదా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసి వారిలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలని శాసనమండలిలో పలువురు సభ్యులు ప్రభుత్వానికి సూచించారు. శుక్రవారం శాసనమండలిలో పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియెడ్‌ను తప్పనిసరి చేయాలని కోరారు. తెలంగాణ (పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధం చేయు) సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్-1 స్థాయి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం కోసమే ఈ బిల్లును సవరిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు మధుసూదనాచారి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. క్రీడాకారులను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించాలని కోరారు. మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పాఠశాలల్లో క్రీడల పీరియెడ్ గంటపాటు తప్పనిసరిగా ఉండేదని గుర్తు చేశారు. దాన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకులాల్లో స్పోర్ట్స్ పీరియెడ్ ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ, సరైన ప్రోత్సాహం లేక, ఆర్థిక సమస్యలతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పతకాలు వచ్చిన తర్వాత కాకుండా పతకాలు తెచ్చేలా క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు తప్ప భౌతికంగా ఒత్తిడికి గురి కావడం లేదని చెప్పారు. పాఠశాలల్లో తప్పనిసరిగా క్రీడాస్థలం ఉండాలనీ, విద్యార్థులు ఆటలు ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గతంలో గంటపాటు క్రీడల పీరియెడ్ ఉండేదని గుర్తు చేశారు. సభ్యుల సూచన మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిస్తామని చెప్పారు. పాఠశాలల్లో తప్పనిసరిగా స్పోర్ట్స్ పీరియెడ్ ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆగస్టు 15, జనవరి 26న క్రీడల పోటీలు నిర్వహించేలా చర్యలు చేపడతామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తామన్నారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులను తయారు చేస్తామని చెప్పారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు కూడా స్పోర్ట్స్ మీట్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. నిరంతరం మేథోమథనం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంటు తరహాలో కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తామని వివరించారు. మంచి గ్రంథాలయం ఉంటుందని చెప్పారు. అందుకోసం రూ.30 కోట్లు కేటాయించామని అన్నారు. చట్టసభలకు దగ్గరలోనే నెలరోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం తెలంగాణ (పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధం చేయు) సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టిన తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు, తెలంగాణ శాసనముల (సంక్షిప్త పదముల మార్పు) బిల్లును ఆమోదిస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. సభ ఆరు రోజులపాటు, 20 గంటలు జరిగిందనీ, ఐదు బిల్లులకు ఆమోదం తెలిపామని వివరించారు. అనంతరం శాసనమండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

ఫిబ్రవరిలో డీఎస్సీ, మేలో గ్రూప్-2 నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఆయా నియామక సంస్థలు ప్రకటిస్తాయని వివరించారు.

జాబ్ క్యాలెండర్ 2024-25 వివరాలు

నోటిఫికేషన్ పేరు	నోటిఫికేషన్ తేదీ	పరీక్ష తేదీ	నియామక సంస్థ
1. గ్రూప్-1 (మెయిన్స్)	ఫిబ్రవరి -2024	అక్టోబర్-2024	టీజీపీఎస్సీ
2. గ్రూప్-3	డిసెంబర్-2022	నవంబర్-2024	టీజీపీఎస్సీ
3. ల్యాబ్‌టెక్నీషియన్ (గ్రేడ్-2) నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్)/ఫార్మాసిస్ట్ గ్రేడ్-2/ ఫార్మాసిస్ట్ (ఆయూష్)	సెప్టెంబర్-2024	నవంబర్-2024	ఎంహెచ్ఎస్ఆర్బీ
4. గ్రూప్-2	డిసెంబర్-2022	డిసెంబర్-2024	టీజీపీఎస్సీ
5. ఇంజినీరింగ్ ఇతర పోస్టులు, (టీజీ ట్రాన్స్‌కో, టీజీఎన్‌పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్)	అక్టోబర్-2024	జనవరి-2025	టీజీట్రాన్స్‌కో
6. గెజిటెడ్ కేటగిరీ ఇంజినీరింగ్ సర్వీసులు	అక్టోబర్-2024	జనవరి-2025	టీజీపీఎస్సీ
7. టెట్	నవంబర్-2024	జనవరి-2025	విద్యాశాఖ
8. గ్రూప్-1 (ప్రిలిమ్స్)	అక్టోబర్-2024	ఫిబ్రవరి-2025	టీజీపీఎస్సీ
9. గెజిటెడ్ స్కేల్ ఇతర ప్రొఫెషనల్ సర్వీసులు	జనవరి-2025	ఏప్రిల్-2025	టీజీపీఎస్సీ
10. డీఎస్సీ	ఫిబ్రవరి-2025	ఏప్రిల్-2025	విద్యాశాఖ
11. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	ఫిబ్రవరి-2025	మే-2025	టీజీపీఎస్సీ
12. టెట్	ఏప్రిల్-2025	జూన్-2025	విద్యాశాఖ
13. గ్రూప్-1 మెయిన్స్	--	జులై-2025	టీజీపీఎస్సీ
14. ఎస్ఐ సివిల్, ఇతర సివిల్, ఇతర పోస్టులు ప్రిలిమ్స్	ఏప్రిల్-2025	ఆగస్టు-2025	టీజీపీఆర్బీ
15. కానిస్టేబుల్ సివిల్, ఇతర పోస్టులు ప్రిలిమ్స్	ఏప్రిల్-2025	ఆగస్టు-2025	టీజీపీఆర్బీ
16. డిగ్రీ కాలేజీల్లో అకడమిక్ పోస్టులు	జూన్-2025	సెప్టెంబర్-2025	టీజీపీఎస్సీ
17. గురుకుల, డిగ్రీ లెక్చరర్లు	జూన్-2025	సెప్టెంబర్-2025	టీఆర్ఈఐబీ
18. గ్రూప్-2 (ఎఫ్ఆర్‌వో కలిపి)	మే-2025	అక్టోబర్-2025	టీజీపీఎస్సీ
19. గ్రూప్-3 (గ్రూప్-4 పోస్టులు కలిపి)	జులై-2025	నవంబర్-2025	టీజీపీఎస్సీ
20. ఎగ్జిక్యూటివ్ క్యాడర్	జులై-2025	నవంబర్-2025	సింగరేణి

హైదరాబాద్‌లో ఆక్రమణల నివారణకే హైడ్రా

వందేండ్ల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే ఏర్పాటు

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర రాజధానిలో ఆక్రమణల నివారణకే హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తి పరిరక్షణ ఏజెన్సీ (హైడ్రా)ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శరవేగంగా విస్తరిస్తోన్న నగరాన్ని, రాబోయే వందేండ్లలో దాని అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆ ఏజెన్సీని ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. శుక్రవారం శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హైడ్రాపై స్వల్పకాలిక చర్చను చేపట్టారు. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ సభ్యుడు దానం నాగేందర్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. వారు లేవనెత్తిన వివిధ అంశాలకు సీఎం రేవంత్ సమాధానమిస్తూ గంటన్నరపాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. చంద్రబాబు, వైఎస్ హయాంలో జరిగిన హైదరాబాద్ అభివృద్ధిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, వాటిలోని లోపాలను ఎత్తి చూపారు. అదే సమయంలో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనా పలుమార్లు సెటైర్లు విసిరారు. వారు గతంలో చేసిన వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు.

చారిత్రాత్మక కట్టడాలతో హైదరాబాద్ అద్భుత నగరంగా అభివృద్ధి చెందిందని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో గంటకుపైగా కురిసిన రెండు సెంటీమీటర్ల వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న విపరీతమైన మార్పుల వల్ల కుంభవృష్టి కురుస్తోందనీ, దీంతో అకస్మాత్తుగా వరదలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆయా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వీలుగా హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. మున్ముందు నాలాలను ఎవరైనా ఆక్రమించాలని భావిస్తే వారి గుండెల్లో గుబులు పుట్టిస్తామని హెచ్చరించారు. అలాంటి అద్భుతమైన వ్యవస్థను తీసుకొస్తామని వివరించారు. తద్వారా హైదరాబాద్ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఈ నగరానికి 1965లో మంజీరా జలాలను తరలించారని గుర్తు చేశారు. 1982లో సింగూరు జలాలు, 2004లో కృష్ణా ఫేజ్-1, 2008 కృష్ణా ఫేజ్-2 ద్వారా కాంగ్రెస్ హైదరాబాద్‌కు తాగునీరందించిందని వివరించారు. 2014లో కృష్ణా ఫేజ్-3కి సంబంధించి 90శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇలాంటి వాస్తవాలను మరుగుపరిచి బీఆర్ఎస్ నేతలు తామే 2015లో హైదరాబాద్‌కు తాగునీటిని తెచ్చినట్టు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు.

ఆ పార్టీకి చెందిన సభ్యులు మాట్లాడితే... రాష్ట్రంలో హత్యలు, లైంగికదాడులు జరుగుతున్నాయంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని సీఎం ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ సింగరేణి కాలనీలో గంజాయి మత్తులో ఒక ఆడబిడ్డపై లైంగికదాడి చేస్తే కనీసం ఆ కుటుంబాన్ని ప్రభుత్వం వైపు నుంచి పరామర్శించలేదని విమర్శించారు. మొయినాబాద్ దగ్గర బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి హత్యాచారం చేస్తే అతడిపై ఏం చర్యలు తీసుకున్నారంటూ ప్రశ్నించారు. ఇవన్నీ మరిచి అబద్ధాల ప్రాతిపదికన తమ ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని వాపోయారు. గతంలో రాష్ట్రంలో పాన్ డబ్బాల్లో కూడా గంజాయి దొరికే పరిస్థితి ఉంది, ఇప్పుడు ఆ దుస్థితి ఉందా..? అని ప్రశ్నించారు. 'మీ హయాంలో కాళేశ్వరం కడితే, కూలిపోయింది, కానీ మూసీ ప్రక్షాళనకు సంబంధించి మేం పని మొదలు పెట్టకముందే కేటీఆర్ డీపీఆర్ అడుగుతున్నారు..ఎందుకు అంత తొందర మీకు, కాంట్రాక్టర్లతో మాట్లాడుకుని కమీషన్లు దండుకోవటానికా? మేం 80 వేల పుస్తకాలు చదివామని చెప్పుకోవడం లేదు..80 వేల పుస్తకాల నాలెడ్జ్‌తో మీరు కట్టిన మేడిగడ్డ మేడిపండైంది.' అని రేవంత్ ఎద్దేవా చేశారు.

రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేండ్లు పాలించిందనీ, తమ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు కూడా కాకముందే ఏదో జరిగిపోయినట్టు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని సీఎం విమర్శించారు. తెలంగాణ ప్రాంతాన్ని రెండొందల ఏండ్లు పాలించిన నిజాం నవాబులే ప్రజాస్వామ్యానికి తలొగ్గారని వ్యాఖ్యానించారు. పదేండ్లు పాలించిన మీరెంత? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆమోదం ఉంటే నాయకులవుతారు తప్ప ఎదుటి వారిని అవహేళన చేస్తే కాదంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి చురకలంటించారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు గోదావరి నీటిని తరలించారనీ, అయితే మిషన్ భగీరథ వల్లే ఆ పట్టణానికి నీళ్లు వచ్చాయంటూ కేటీఆర్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌కు వచ్చే పైప్‌లైన్‌కు మధ్యలో రంధ్రం చేసి గజ్వేల్‌కు నీళ్లించింది వాస్తవం కాదా? ఈ విషయంపై చర్చకు సిద్ధమా..? అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. గత సీఎం తన విలాసవంతమైన జీవితం కోసం ప్రగతి భవన్‌ను, ఆఫీసు కోసం సచివాలయాన్ని నిర్మించారు తప్ప ప్రజల కోసం ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. పాత సచివాలయంలోని ఆలయానికి వందల ఏండ్ల చరిత్ర ఉందనీ, అయినా తన సెంటిమెంటు కోసం ప్రజల సెంటిమెంటును కేసీఆర్ ఫణంగా పెట్టారని దుయ్యబట్టారు. అందుకే ఇప్పుడు దిక్కులేని పరిస్థితిని అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాభివృద్ధికి కలిసి రావాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తాను ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ఆయన ముందుకు రావటం లేదని సీఎం ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి ప్రధాని మోడీని కలుద్దామంటూ తాను ప్రతిపాదించానని తెలిపారు. అయినా కిషన్‌రెడ్డి స్పందించటం లేదని వాపోయారు. బహుశా తన పాత మిత్రుడు (కేసీఆర్)కు కోపం వస్తుందనే కారణంతోనే ఆయన ముందుకు రావటం లేదన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, గ్రాంట్లు, అనుమతులను సాధించేందుకు ప్రభుత్వంతో కలిసి రావాలంటూ రేవంత్ ఈ సందర్భంగా బీజేపీ సభ్యులకు సూచించారు. రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని సీఎం పిలుపునిచ్చారు.

కాకతీయుల కళాతోరణం తీసేయొద్దు

- మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో రాచరిక చిహ్నాలను తొలగించాలని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ, తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూప సవరణ, తెలంగాణ శాసనాల మార్పు సవరణ బిల్లులకు మద్దతు తెలుపుతున్నా మన్నారు. రాష్ట్ర చిహ్నంలోని కాకతీయుల కళాతోరణాన్ని ప్రభుత్వం తీసేయబోతున్నట్టు తమ దృష్టికి వచ్చిందనీ, ఆ నిర్ణయం సరిగాదని చెప్పారు. రాచరికపు చిహ్నాలు తొలగించాలనీ, టీఎస్‌ను టీజీగా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయంపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశారు. సివిల్ కోర్టులు అద్దెభవనాల్లో ఇంకా కొనసాగటం ఏంటన్నారు. గత ప్రభుత్వం పదేండ్లలో వాటిని పూర్తిగా విస్మరించిందన్నారు. కొత్త కోర్టు భవనాలు కట్టాలని కోరారు. జడ్జీలను, కోర్టుల సంఖ్యను పెంచాలని సూచించారు.

స్కిల్ యూనివర్సిటీ బిల్లుకు మండలి ఆమోదం

- విపక్షాలతో పాటు చైర్మెన్ పలు సూచనలు
- పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన మంత్రి దుద్దిళ్ల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ" బిల్లుకు శాసన మండలి శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం మొదలగు సభ్యులందరూ తమ మద్దతు తెలిపారు. దాంతో బిల్లును ఆమోదిస్తున్నట్టు స్పీకర్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. బిల్లుపై జరిగిన చర్చలో స్పీకర్‌తో పాటు అన్ని పార్టీల ఎమ్మెల్సీలు పాల్గొని పలు సూచనలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను గ్రామాలకు అనుసంధానం చేయాలని రవిందర్‌రావు కోరగా, కులవృత్తులను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేయాలని తాత మధు సూచించారు. కొన్ని రంగాల్లో చదువుతో సంబంధం లేకుండా నైపుణ్యం ఉంటుందనీ, అలాంటి వాటిలో విద్యార్హతలను ప్రామాణికంగా కాకుండా వారి ఆసక్తి, స్కిల్‌ను పరిగణనలోకి తీసుకుని శిక్షణ అందించాలని భాను ప్రసాద్‌రావు విజ్ఞప్తి చేశారు.

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ కోసం 200 ఎకరాల భూమిని కేటాయించారనీ, 13 ఏండ్లు గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదని అన్నారు. అలాంటి కంపెనీలపై ఒత్తిడి తెచ్చి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అడ్మిషన్లలో పేదలకు ఫీజు రాయితీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ కోరగా, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యంలో శిక్షణ అందించాలని దేశపతి శ్రీనివాస్ సూచించారు. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయాలని కోటిరెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం మండలి చైర్మెన్ చర్చలో పాల్గొని పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని ఆగ్రో, డెయిరీతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో ఈ విద్యాసంస్థను భాగస్వామ్యం చేయాలని కోరారు. సాంకేతిక, ఇతర రంగాల్లో శిక్షణ తీసుకున్న వారు నేరుగా ప్రభుత్వ ఉద్యోగమని వెళ్లకుండా వారికి స్వయం ఉపాధి కల్పించేలా ప్రోగ్రామ్ డిజైన్ చేయాలని గుత్తా విజ్ఞప్తి చేశారు.

అనంతరం సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమాధానం చెప్పారు. అడ్మిషన్లు, ఫీజు రాయితీ, కరిక్యులం, గ్రామీణ విద్యార్థులకు ప్రాధాన్యత తదితర అంశాలపై సర్కార్ సానుకూలంగా ఉందని చెప్పారు. సభ్యులు చేసిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

సంపాదకీయం

మృత్యుఘోష

కొండలు అమాంతం కదిలొచ్చి/ ఇండ్లను కబళించాయి/ అర్థరాత్రి వానచినుకు చేసిన ప్రళయనాదానికి/ ఊళ్లకు ఊళ్లు శ్మశానాలు అయ్యాయి. ఆకాశానికి చిల్లులు పడినట్లు దంచికొట్టిన జడివాన, ముంచెత్తిన వరదలకు కొండచరియలు విరిగిపడి కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. ఇప్పటివరకు రెండువందల ఎనభై మంది మృతి చెందినట్టు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. సహాయ చర్యలను ముమ్మరం చేసింది. యాభై శిబిరాల్లో బాధితులకు సహాయ చర్యలు కొనసాగిస్తున్నది. అయితే ఈ విషాదంనుంచి తేరుకోకముందే గురు,శుక్రవారాల్లో హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లా, ఉత్తరాఖండ్, కర్నాటక, సిక్కింలలోనూ కొండచరియలు జారిపడి మరికొంతమంది ప్రాణాలు హరించాయి. మృతుల లెక్క తేలాల్సి వుంది. యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ ప్రకృతి విలయం వెనుక కారణాలున్నప్పటికీ, ఇలాంటి విపత్తు సంభవించిన సమయంలో ఆదుకోవాల్సిన కేంద్రం బాధ్యత నుంచి తప్పించు కుంటున్న వైఖరి ఏమాత్రం సరికాదు!

మృత్యు రక్కసి విరుచుకుపడిన ప్రాంతంలో 48 గంటల్లో 572 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ స్థాయి వర్షపాతం వయనాడ్ జిల్లా కనీవిని ఎరుగదు. భారత వాతావరణ పరిశోధన సంస్థ (ఐఎండి) కూడా ఈ వర్ష బీభత్సాన్ని అంచనా వేయలేకపోయింది.అరేబియా సముద్రపు ఉష్ణోగ్రతలు భారీగా పెరగడం కూడా ఉత్పాతానికి కారణంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం తెల్లవారుజాము నుండి నిరంతరంగా సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి మరి అందరి సూచనలతో సీఎం ముందుకు పోతున్నారు.

నిన్న కేరళ... నేడు ఉత్తరాఖండ్ సిక్కింలు.. పర్యావరణం పగబడితే... ఫలితమిలాగే ఉంటుంది. ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు,కోనలను విచ్చలవిడిగా తొలుస్తుంటే ఇంతటి మహా విషాదాలే చోటుచేసుకుంటాయి నిత్యం. గతేడాది చార్ ధామ్ ఆల్-వెదర్ హైవే ప్రాజెక్ట్ నిర్మాణంలోని టన్నెల్‌లో చిక్కుకున్న కూలీలు రెండురోజుల తర్వాత ప్రాణాపాయంతో బయటపడ్డారు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైన ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు యాభైరెండు మంది యాత్రికులు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక చనిపోయినట్టు సమాచారం. ఇలా ప్రకృతి ప్రకోపానికి ప్రాంతాలు, పట్టణాలే కాదు, రాష్ట్రాలూ అతలాకుతలమవుతున్నాయి. కేరళలో చోటుచేసుకున్నది మాటలకందని మహా విషాదం! సోమవారం అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా వెల్లువెత్తిన బురద, కొండరాళ్ల ధాటికి మూడు వందల మందికి పైగా నిద్రలోనే సమాధి అయ్యారు. మరెందరో గల్లంతయ్యారు. వందల ఇండ్లు పేకమేడల్లా కుప్పకూలాయి. ఆ శిథిలాల కింద నుంచి వినిపించే ఆర్తనాదాలు హృదయాన్ని మెలిపెడుతున్నాయి. చెట్టుకొకరు పుట్టకొకరుగా మిగిలిన స్థానికులను చూసి అందరి కండ్లు చెమ్మగిల్లుతున్నాయి. మరు భూములను తలపిస్తున్న వయనాడ్ గ్రామాల్లో



సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు తీరిక లేకుండా శ్రమిస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్నాయి.

2018 ఆగస్టులోనూ భీకర వర్షాలు, వరదలతో ఆ రాష్ట్రం కకావికలమైంది. కేరళకు ప్రకృతి విపత్తులు కొత్తేమీ కాదు. కొన్నేండ్లుగా అనేక విపత్తులను ఎదుర్కొంటోంది. కానీ, ఇప్పుడు వయనాడ్‌లో చోటుచేసుకున్నది ఆ రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద విపత్తులలో ఒకటి. మెప్పాడి పంచాయతీ పరిధిలోని ముండక్కై, అట్టామల, నూల్‌పూజా గ్రామాలతో పాటు, చూరాలమల పట్టణంలోనూ బీభత్స దృశ్యాలు చోటుచేసుకున్నాయి. నివాస స్థలాలు ఉండాల్సిన చోట బురదమట్టి దిబ్బలు కనపడుతున్నాయి. ముండక్కై గ్రామం స్థానంలో మట్టి, బురద, రాళ్లు నేలకూలిన చెట్లతో నిండిన నది ప్రవహిస్తోందంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతను తెలియచేస్తాయి. మరోవైపు ఘటనా స్థలానికి కిలోమీటరు దూరంలో ఉన్న చలియార్ నదిలో ఛిద్రమైన మృత దేహాలు కొట్టుకు వస్తూనే ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రదేశంలోకన్నా, ఈ నదిలోనే ఎక్కువ మృతదేహాలను రక్షణ సిబ్బంది వెలికి తీస్తున్నారు. కొండచరియలు విరిగి నదిలో పడటంతో రెండింతలైన బురద మట్టి ప్రవాహం ఊళ్లకి ఊళ్లు ముంచెత్తింది. కిలో మీటర్ల పొడవునా, కొన్ని అడుగుల మేర ఎక్కడ చూసినా బురద మట్టే కనపడుతోంది. ఇండ్లు, ఆస్పత్రులు, బడులు, ప్రార్థనాలయాలు అన్నీ ఆ మట్టి కిందే. దీంతో సహాయ చర్యలు ఎక్కడి నుండి ప్రారంభించాలో తెలియని అగమ్య పరిస్థితి. రెస్క్యూ సిబ్బందికే ఇది ఏ స్థాయిలో విపత్తో అర్థం కాని దుస్థితి.

మృత్యు రక్కసి విరుచుకుపడిన ప్రాంతంలో 48 గంటల్లో 572 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ స్థాయి వర్షపాతం వయనాడ్ జిల్లా కనీవిని ఎరుగదు. భారత వాతావరణ పరిశోధన సంస్థ (ఐఎండి) కూడా ఈ వర్ష బీభత్సాన్ని అంచనా వేయలేకపోయింది. అరేబియా సముద్రపు ఉష్ణోగ్రతలు భారీగా పెరగడం కూడా ఉత్పాతానికి కారణంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం తెల్లవారుజాము నుండి నిరంతరంగా సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి మరి అందరి సూచనలతో సీఎం ముందుకు పోతున్నారు. మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, స్థానిక ఎంపీ రాహుల్ గాంధీ ఆ ప్రాంతంలో పర్యటిస్తూ ప్రజలకు ధైర్యం చెబుతున్నారు. ఈ ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ఉదారంగా ఆదుకోవాలని సీఎం కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ దిశలో తక్షణం కేంద్రం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలనైతే పంపింది కానీ, ఈ మహా విషాదాన్ని సైతం కేంద్ర బీజేపీ రాజకీయం చేస్తోంది. కేరళ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిందా పూర్వక వ్యాఖ్యలు చేయడం తగని పని. బాధిత ప్రజానీకాన్ని ఆదుకోవడంపైనే అందరూ సర్వశక్తులను ఒడ్డి, సహకారం సమకూర్చి, ప్రకృతి విలయంలో చిక్కుకున్నవారిని సురక్షితులను చేయాలి.

గుణపాఠాలు నేర్వని మోడీ సర్కార్



జయతీ ఘోష్

భారతదేశంలో కేంద్ర బడ్జెట్ గురించి జరిగిన ప్రచారం అతిశయోక్తిగా మారింది, అయితే అందరి దృష్టిని ఆకర్షించింది. ఎందుకంటే అది కేంద్ర ప్రభుత్వ స్వభావాన్ని, ఉద్దేశ్యాల్ని తెలియజేస్తుంది. మిత్రపక్షాల మద్దతుపై ఆధారపడే మైనార్టీ ప్రభుత్వంగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఎలా పని చేస్తుంది, ఆర్థిక వ్యవస్థనెలా నడుపుతుందనే విషయం గురించి ఈ పూర్తి స్థాయి కేంద్ర బడ్జెట్ మనకు ఏమి చెపుతుంది?మొదటగా, కొన్ని సంవత్సరాల తిరస్కరణ అనంతరం చివరికి, నిరుద్యోగమే ఒక పెద్ద సమస్య అని కేంద్ర ప్రభుత్వం అంగీకరించే పరిస్థితికి వచ్చింది. అయితే ఇబ్బంది ఏమిటంటే, ఇప్పటివరకు ప్రభుత్వం ఈ సమస్యను విస్మరించింది. దానిని ఎదుర్కొనే వ్యూహం అంటూ ఒకటి ప్రభుత్వం వద్ద లేదు. కాబట్టి బడ్జెట్ ప్రసంగం, 'ఎంప్లాయ్‌మెంట్' అనే పదాన్ని ఏర్పరచడానికి పది వేరు వేరు పదబంధాల్లో దాని లక్ష్యాలను సంగ్రహించాల్సి వచ్చింది. కానీ అసలు విషయానికి సంబంధించిన అంశాలు దానిలో తక్కువగా ఉన్నాయి. నిలిచిపోయిన ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి, నిలిచిపోయిన ఉపాధి అవకాశాలకు గల కారణాలను తెలుసుకోవడం కనీస అవసరం. కానీ ఈ ప్రభుత్వానికి ఆ పనిచేయడం ఇష్టం లేదనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. అయితే వాటికి గల కారణాలు కూడా స్పష్టంగానే ఉన్నాయి.

ఉపాధి సవాలు

స్వల్ప ఉపాధికల్పన అనేది, భారతీయ అభివృద్ధి క్రమంలో ఒక దీర్ఘకాలిక సమస్య. అయితే గడిచిన దశాబ్దం అత్యంత దారుణమైన కాలం. సంఘటిత, అసంఘటిత రంగాలు రెండింటిలో ఉపాధి అవకాశాలు దాదాపుగా పెరగలేదు. కేవలం 'ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజెస్‌లో చెల్లింపుల్లేని సహాయకుల' కారణంగానే ఇటీవల కాలంలో మహిళల ఉపాధి కొద్దిగా పెరిగినట్టు నమోదైంది. వీరు, నమోదైన మహిళా 'కార్మికుల్లో' 37శాతం పైగా ఉన్నారు. గడచిన దశాబ్ద కాలానికి పైగా చాలామంది కార్మికులకు నిజ వేతనాలు కూడా నిలిచిపోయి,దాదాపు సగానికి తగ్గాయి.

దీని ఫలితంగా సామూహిక వినియోగం ఆగిపోయి, దేశీయ మార్కెట్లలో వృద్ధి లేకుండా పోయింది. ఉపాధి సృష్టిని నిలిపివేసే ఒక హానికరమైన వృత్తం ఏర్పడింది. తగినంత డిమాండ్ లేకపోవడం వల్ల ఇప్పుడు పెట్టుబడి పైన నిర్బంధం ఏర్పడింది. ఈ పెట్టుబడి,

ఈ బడ్జెట్ నుండి మనం చేసే రెండవ దురదృష్టకరమైన నిర్ధారణ ఏమంటే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బల నుండి మోడీ ప్రభుత్వం ఎలాంటి గుణపాఠాల్ని నేర్చుకోలేదు. ఇది ఇంతకుముందు అనుసరించిన విధానాలనే మూడు కీలకమైన అంశాల్లో కొనసాగిస్తుంది. ఆ మూడు: వాస్తవాన్ని దాచిపెట్టడానికి అనుసరించే నైపుణ్యమైన వ్యూహం పట్ల మితిమీరిన ప్రేమ; తీవ్ర రాజకీయ, ఆర్థిక కేంద్రీకరణ ;ధనికుల నుండి పేదలకు వ్యాపించే ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన ఉన్నత వర్గాల పైన ఆధారపడడం. ఇవి దేశానికి ప్రమాదకరమే కాక ఎలాంటి రాజకీయ ప్రయోజనాలను కూడా నెరవేర్చవు.

2007-08లో జీడీపీ లో 36శాతంగా ఉంటే 2023-24 లో 31శాతం కన్నా తక్కువగా ఉంది. ఈ క్రమంలో సాంకేతిక మార్పులు అంటే ఉత్పత్తి చేయబడిన వస్తువులు, నూతన సేవలు - ఈ రెండింటికి సంబంధించిన సంఘటిత రంగంలో భారీస్థాయి ఉత్పత్తికి చాలా నైపుణ్యం కలిగిన కార్మికుల అవసరం ఉంటుంది.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. కానీ అవి గడిచిన దశాబ్ద కాలంలో వరుసగా అనేకసార్లు దెబ్బలు తిన్నాయి. అవి: 2016లో పెద్ద నోట్ల రద్దు, 2017లో దెబ్బతిన్న జీఎస్టీ రోల్‌ఔట్, 2020-2021 కాలంలో కోవిడ్-19 కారణంగా అనాగరికమైన లాక్ డౌన్‌లు (ఎలాంటి నష్టపరిహారం లేకుండా). అయినా బతికి బయటపడడం ఆశ్చర్యమే. భారీ సంఖ్యలో ఖాళీలున్నా కనీస వేతనాలు కూడా లేని అనేకమంది మహిళా 'స్కీం కార్మికుల'తో సహా కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులపై ఎక్కువగా ఆధారపడడంతో ప్రభుత్వ ఉపాధి అవకాశాలు కూడా నిలిచిపోయాయి.ఫలితంగా స్వయం ఉపాధి పని ఈ భూభాగంలో ఆధిపత్యం చెలాయిస్తుంది. వృత్తిగా వ్యవసాయం లాభదాయకం కాకపోయినప్పటికీ ప్రజలు వ్యవసాయంలోనే ఉంటున్నారు ఎందుకంటే దానికి వెలుపల వారికి కొన్ని అవకాశాలున్నాయి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.

అయితే బడ్జెట్ ఈ సమస్యల్ని వేటినీ స్పృశించలేదు. దానికి బదులుగా యువత నిరుద్యోగ సమస్య పరిష్కారానికి గాను చిన్నచిన్న చర్యల్ని 'ఉపాధి - అనుసంధాన ప్రోత్సాహకం' ప్రధానంగా సంఘటితరంగ కార్మికులకు, వారి యజమానులకు ప్రతిపాదించారు. సంఘటితరంగ ఉపాధిలో కొత్తగా నియమితులైన వారికోసం ఒక పరిమిత కాలానికి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌కు లేదా పెన్షన్ ఫండ్‌కు చిన్న రాయితీని చెల్లించే విధంగా మూడు పథకాలు వర్తిస్తాయి. దీని ద్వారా ప్రతీ వ్యక్తికీ అందే పైకం కొద్ది మొత్తంలోనే ఉంటుంది. అధ్వాన్నమైన విషయం ఏమంటే, అవి మొత్తం ఉపాధిలో చిన్న భాగంగా ఉన్న సంఘటితరంగంలోని ఉద్యోగులకే పరిమితమయ్యాయి.

అయితే ఈ విధానాల కోసం మోడీ ప్రభుత్వం తమ స్వంత ప్రణాళికను అనుకరిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. కానీ ఈ విధానంలో విస్తృతి, సారం లోపించింది కాబట్టి అనుకరించిన వారెవరైనా వారి ప్రతిపాదిత పథకాన్ని చదవలేదు, అవగాహన చేసుకోలేదు. ఏదీ ఏమైనా దేశం ఎదుర్కొంటున్న విపరీతమైన ఉపాధి సవాలు పరిష్కారానికి ఈ విధానం చేసేది చాలా తక్కువే.

ఈ బడ్జెట్ నుండి మనం చేసే రెండవ దురదృష్టకరమైన నిర్ధారణ ఏమంటే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బల నుండి మోడీ ప్రభుత్వం ఎలాంటి గుణపాఠాల్ని నేర్చుకోలేదు. ఇది ఇంతకుముందు అనుసరించిన విధానాలనే మూడు కీలకమైన అంశాల్లో కొనసాగిస్తుంది. ఆ మూడు: వాస్తవాన్ని దాచిపెట్టడానికి అనుసరించే నైపుణ్యమైన వ్యూహం పట్ల మితిమీరిన ప్రేమ; తీవ్ర రాజకీయ, ఆర్థిక కేంద్రీకరణ ;ధనికుల నుండి పేదలకు వ్యాపించే ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన ఉన్నత వర్గాల పైన ఆధారపడడం. ఇవి దేశానికి ప్రమాదకరమే కాక ఎలాంటి రాజకీయ ప్రయోజనాలను కూడా నెరవేర్చవు.

ఆర్థిక వివరాల సమర్పణలో ప్రభుత్వం అనుకూలమైన అంశాల్ని ఎంపిక చేసుకోవడం ద్వారా మోసపూరితంగా వ్యవహరించింది. మోడీ ప్రభుత్వం యొక్క ప్రధానమైన దృష్టి మౌలిక సదుపాయాల పెట్టుబడిపై ఉంది. అందుకు ప్రభుత్వం ప్రశంసలు అందుకుంది. ఇది ఖచ్చితంగా పెరిగింది, కానీ బడ్జెట్ వ్యయాలను స్థిరంగా అతిగా అంచనా వేశారు. వాస్తవ ప్రభుత్వ పెట్టుబడి గణనీయంగా తగ్గింది.



పెద్ద కార్పొరేట్ వ్యాపారస్తులపైన ఆధారపడడం అనేది ఈ ప్రభుత్వ ప్రాథమిక ఆర్థిక విధానం. వారిలో కూడా ఆర్థిక వృద్ధిని అందించడానికి కొద్దిమంది అనుకూలురైన ఆశ్రితులపై ఆధారపడే విధానం మారలేదు. అంటే దీనర్థం, వివిధ మార్గాల ద్వారా పెద్ద కార్పోరేట్లకు సబ్సిడీలందించి, వారికి పన్ను మినహాయింపులిచ్చే విధానాన్ని కొనసాగించడం, అదే విధంగా ప్రజల జీవితాలను ప్రభావితం చేయడానికి అవసరమైన సామాజిక వ్యయానికి కోత విధించడం. చాలా హీనమైన పోషకాహార సూచికలు, పెరుగుతున్న ఆకలి సూచికలు గల దేశంలో, 80 మిలియన్ల మంది ప్రజలను ఆహార హక్కు నుండి మినహాయించినందుకు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన తరువాత కూడా అసాధారణమైన రీతిలో ఆహార సబ్సిడీకి బడ్జెట్ చాలా తక్కువగానే కేటాయించారు.

2023-24 బడ్జెట్‌లో మూలధన పెట్టుబడి కోసం 10 లక్షల కోట్లకు పైగా చేసిన ప్రకటన పతాక శీర్షికల్లో కనిపించింది, కానీ వాస్తవ ఖర్చు 52,455 కోట్ల రూపాయలు తగ్గింది. ఆఖరి మూలధన వ్యయం 1,18,656 కోట్ల రూపాయలు తగ్గింది. ఇది, ప్రస్తుత బడ్జెట్‌లో ప్రకటించిన 11 లక్షల కోట్లకు పైగా వ్యయం అవుతుందా లేదా అనే అనుమానాన్ని కలిగిస్తుంది. ఇటీవలే జరిగిన ఎన్నికలు, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీవ్ర కేంద్రీకరణ విధానంలో మార్పు తెస్తుందని చాలామంది పరిశీలకులు ఆశించారు. దురదృష్టవశాత్తు, ఈ ప్రస్తుత బడ్జెట్ ఆర్థిక సమాఖ్య వ్యవస్థ పై మరొక దాడి చేసింది. అది, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు 'నిటి ఆయోగ్' సమావేశ బహిష్కరణకు దారితీసింది. ఈ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వనరులు, ఆర్థిక నిర్ణయాధికారం, రెండింటినీ కేంద్రీకరించింది. బీజేపీ దాని మిత్రులు పాలించే రాష్ట్రాల్లో ఎక్కువ వనరుల్ని సమకూర్చడం, ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలకు మొండిచెయ్యి చూపించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుంది.

ఇది ప్రస్తుత బడ్జెట్‌లో మరింత తేటతెల్లమైంది. బీజేపీకి మద్దతుగా నిలిచిన రెండు కీలకమైన మిత్రపక్ష పార్టీలు తమ స్వంత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, బీహార్‌ల కోసం భారీ ఆర్థిక బదిలీ బహుమతులను పొందాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకునే అవసరం లేని సెస్‌లు, సర్‌చార్జీల వైపు పన్నులను మళ్లించే ప్రయత్నాన్ని కొనసాగిస్తుంది. మొత్తం కేంద్ర ప్రభుత్వ వ్యయంలో (ఫైనాన్స్ కమిషన్ అవార్డులు, ఇతర గ్రాంట్లు,రుణాలతో సహా) అన్ని బదిలీల వాటా 2022-23 లో 22.1శాతం ఉంటే 2023-24లో అది 20.7శాతానికి పడిపోయింది.

కొనసాగుతున్న ఆశ్రితవాదం

పెద్ద కార్పొరేట్ వ్యాపారస్తులపైన ఆధారపడడం అనేది ఈ ప్రభుత్వ ప్రాథమిక ఆర్థిక విధానం. వారిలో కూడా ఆర్థిక వృద్ధిని అందించడానికి కొద్దిమంది అనుకూలురైన ఆశ్రితులపై ఆధారపడే విధానం మారలేదు. అంటే దీనర్థం, వివిధ మార్గాల ద్వారా పెద్ద కార్పోరేట్లకు సబ్సిడీలందించి, వారికి పన్ను మినహాయింపులిచ్చే విధానాన్ని కొనసాగించడం, అదే విధంగా ప్రజల జీవితాలను ప్రభావితం చేయడానికి అవసరమైన సామాజిక వ్యయానికి కోత విధించడం. చాలా హీనమైన పోషకాహార సూచికలు, పెరుగుతున్న ఆకలి సూచికలు గల దేశంలో, 80 మిలియన్ల మంది ప్రజలను ఆహార హక్కు నుండి మినహాయించినందుకు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన తరువాత కూడా అసాధారణమైన రీతిలో ఆహార సబ్సిడీకి బడ్జెట్ చాలా తక్కువగానే కేటాయించారు.

పెన్షన్లను అందించే నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రాంకు సంబంధించిన డబ్బులో గత సంవత్సరం నుంచి ఎలాంటి మార్పు లేదు. కాబట్టి హాస్యాస్పదంగా ఒక పెన్షనర్‌కు నెలకు రూ.500 చొప్పున కొనసాగడం, లబ్ధిదారుల సంఖ్యలో కూడా ఎలాంటి పెరుగుదల లేకుండానే కొనసాగు తుంది. గత సంవత్సరం ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై చేసిన ఖర్చు బడ్జెట్‌లో13,020 కోట్ల రూపాయలకు తగ్గింది. ఇది జీడీపీలో కేవలం 0.25శాతం మాత్రమే. ప్రస్తుత సంవత్సరం ఖర్చు అంచనా వేసిన ద్రవ్యోల్బణం కంటే ఎక్కువగా ఉంది. ఇది జీడీపీలో మరింత తక్కువ వాటాకు క్షీణిస్తుంది. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ప్రస్తుత సంవత్సరంలో జరిగిన ఖర్చులకు సమానంగా ఉన్నాయి. కానీ వాస్తవానికి కేటాయింపులో తగ్గుదల ఉంటుంది. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అసలు పరిగణలోకే తీసుకోలేదు. సామాజిక రంగాలపై తక్కువ ఖర్చు చేయడం వల్ల భారీ అవకాశాలు కోల్పోవడం జరుగుతుంది, ఎందుకంటే ఈ రంగాలు ఉపాధి అవకాశాల్ని పెంచడానికి ఉపయోగపడతాయి. వాస్తవానికి ఎంఎస్ఎంఈలు ఉపాధి అవకాశాలు పెరగడానికి దోహదం చేస్తాయి. ఇలాంటి రంగాల్లో ప్రభుత్వ వ్యయం పెంచడం, ఉపాధిని తీవ్రతరం చేసే కార్యక్రమాల్ని పెంచడం అనేవి మెరుగైన, నాణ్యమైన పౌరజీవితానికి దారి తీయడమే కాక డిమాండ్‌ను సృష్టించి దాని ఫలితంగా ఉపాధి కల్పనకు కూడా కారణమవుతుంది. దీన్ని గుర్తించడంలో ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలో వైఫల్యం ఉందనే పెద్ద విమర్శ ఉంది. అయితే ఇది భారతీయ ప్రజలకు చాలా దురదృష్టకరమైన వార్త.

(వ్యాసకర్త జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రం ప్రొఫెసర్‌గా 35 సంవత్సరాలు పని చేశారు)

('ఫ్రంట్ లైన్' సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

అనకొండలు

మింగి బలిసిన కొండలన్నీ
ఆకాశానికి ఎత్తి చూస్తున్నాయి
మింగుడు పడని పేగులన్నీ
గుటకలు మింగుతున్నాయి
అప్పనంగా వచ్చిన నోట్లను
అనకొండలు మింగేస్తున్నాయి
అప్పులకుప్ప కింద తలలు
తాకట్టుకై వేచి చూస్తున్నాయి

ఆర్థిక లెక్కలన్నీ
తికమక పడుతున్నాయి
దిక్కుతోచని రాష్ట్ర గతులు
గతుకుల దారి ఎంచుకున్నాయి
ఎక్కడ వేసిన వాగ్దానాలన్నీ
అక్కడే సేదతీరుతున్నాయి



ఆకలిగొన్న పేద కడుపులన్నీ
ఆహా కారాలు చేస్తున్నాయి
ఈ అనకొండల వింతరాజ్యంలో
మెతుకెరుగని బతుకులన్నీ
శూన్యంలో కలిసిపోతున్నాయి

తడారిపోయిన గొంతులన్నీ
సొమ్మసిల్లి పడివున్నాయి
బాగా కలిగిన జేబులన్నీ
మెరుపుల్ని పుంజుకున్నాయి
నోటు ముఖం ఎరుగని జీవనాలు
వెలవెలబోతున్నాయి
ఈ అనకొండల పాలిత ప్రాంతంలో
గజాలు లెక్కన భూములన్నీ
చీలిపోతూ ఛిద్రమౌతున్నాయి
ఆ పొరల మధ్యలో మొక్కలన్నీ
ఇరుక్కుపోయి నశిస్తున్నాయి
హతవిధీ ఇది కదా
ఆటవిక రాజ్య పాలనంటే

- నరెద్దుల రాజారెడ్డి,
9666016636

ఎల్లంపల్లి లిఫ్టుల ద్వారా మిడ్‌మానేరు, లోయర్ మానేరు నింపాలి

కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులలో నీరు నిల్వ పెట్టరాదనే గోదావరి, ప్రాణహిత నుండి వచ్చిన నీటిని ఉన్నది ఉన్నట్లుగా దిగువకు వదిలిపెట్టాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆదేశించింది. మేడిగడ్డ కుంగుబాటుపై, అన్నారం బుంగపై విజిలెన్స్ శాఖ కూడా విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సి వుంది. రాష్ట్ర ప్రభుత్వం ఘోష్ కమిటీ వేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ సాగిస్తున్నాయి. పై మూడు కమిటీలు గోదావరి జలాలను సుందిళ్లలో, అన్నారంలో, మేడిగడ్డలో నిల్వ పెట్టరాదని ఆదేశించిన సాంకేతిక అంశం ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు తెలుసు. అయినప్పటికీ శాసనసభలోని ప్రతిపక్షం జులై 26 సందర్భించి ప్రాజెక్టులు దెబ్బతిన్నప్పటికీ ఉరికట్టలు వేసి నీటిని నిల్వపెట్టి పంపింగులు చేయాలని ప్రభుత్వానికి తప్పుడు సలహా ఇచ్చారు. ప్రభుత్వం లిఫ్టులు కొనసాగించకపోతే తామే 50వేల మంది రైతులను తీసుకొనివెళ్లి ఆగస్టు 5న పంపులు ప్రారంభిస్తామని ప్రతిపక్షం ప్రభుత్వ పక్షాన్ని హెచ్చరించింది. వాస్తవాన్ని గమనించిన ప్రతిపక్షం నీటి నిల్వ లేకున్నా మేడిగడ్డ నుండి ఎల్లంపల్లికి మూడు స్టేజీలుగా ఎగువకు ఎత్తిపోయడం సాధ్యం కాదన్న విషయం తెలిసి కూడా పంపులు కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదమే అవుతుంది.



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

శ్రీరాంసాగర్ నీటిని డైవర్ట్ చేయాలి

ప్రస్తుతం గోదావరికి వస్తున్న వరదల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి రిజర్వాయర్ మట్టం 1091అడుగులకు చేరుకుంది. దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ దిగువన ఒకేఒక ప్రాజెక్టు ఎల్లంపల్లి 20టిఎంసిల నీటి నిల్వతో వుంది. ఎల్లంపల్లి నుండి లిఫ్ట్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడారం, మోతే ద్వారా మిడ్‌మానేరు ప్రాజెక్టుకు నీళ్ల పంపుచేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 1న ప్రారంభించింది. మిడ్‌మానేరు నుండి లోయర్ మానేరు ద్వారా కాకతీయ కాలువ మొదటి, రెండవ దశలకు నీటిని ఇవ్వాలి. మిడ్‌మానేరులో 25టిఎంసిల నీటి నిల్వ లోయర్ మానేరులో 20టిఎంసిల నీటి నిల్వ చేయాలి. గోదావరిపై గల శ్రీరాం సాగర్ ద్వారా వస్తున్న నీటిని దిగువకు వెళ్లకుండా ఎల్లంపల్లికి డైవర్ట్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టుకు నీటిని పంపిణీ చేయాలి. మిడ్‌మానేరు నుండి లోయర్ మానేరుకు ఒక కాలువ వెళుతుండగా, అదే మిడ్‌మానేరు నుండి అనంతగిరి, రంగనాయక సాగర్ ద్వారా మల్లన్నసాగర్ తిప్పారం ఆనకట్ట వద్దకు నీటిని పంపు చేయాలి. తిప్పారం ఆనకట్ట నుండి కుడివైపు కొండపోచమ్మ, శామీర్‌పేట చెరువులు నింపాలి. అలాగే ఎడమ వైపు గందమళ్ల, బస్వాపురం ప్రాజెక్టులు నింపాలి.

నిల్వనీటితో పంటలకు నష్టం

ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు వరకు, అక్కడి నుండి తిప్పారం వరకు నీటిని పంపు చేయడం ద్వారా ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులలో నీటిని నిల్వ పెట్టవచ్చు. మేడిగడ్డ (16టిఎంసిలు) అన్నారం (10టిఎంసిలు), సుందిళ్ల (8టిఎంసిలు) ప్రాజెక్టులలో నీరు నిల్వ పెట్టడంతో ఈ ప్రాజెక్టుల వెనుక నీటి ద్వారా వేల ఎకరాల పంట భూమి నీట మునుగుతున్నది. గత నాలుగేండ్లుగా ఆ గ్రామాల ప్రజలు పంటలు నష్టపోయారు. నీటిని నిల్వ పెట్టి ఎగువకు ఈ రెండేండ్లలో 170 టిఎంసిలు మాత్రమే మేడిగడ్డ నుండి ఎల్లంపల్లికి పంపింగ్ చేశారు. గోదావరికి వరదలు రావడంతో ఎల్లంపల్లిలో పంపింగ్ చేసి నిల్వ పెట్టిన నీటిని గోదావరి ద్వారా దిగువకు వదిలివేశారు. వాస్తవాలు తెలిసినప్పటికీ కొందరు నాయకులు కాళేశ్వరం పంపులను ఆగస్టు 5వరకు తామే ప్రారంభిస్తామని ఎలా చెప్పగలుగుతున్నారు? రాజకీయ ప్రయోజనాలు ఆశించి ఆరోపణలు చేయడం రాష్ట్రంలో పరిపాటిగా సాగుతున్నది. వాస్తవాలను గుర్తించి భవిష్యత్తు ప్రణాళిక వేయడం, దానిని అమలుపరచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం విజ్ఞులు చేయవలసిన పని. ఈ ఏడాది కలిసివస్తున్న వర్షాల వల్ల శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి ద్వారా కాళేశ్వరం పథకానికి నీరు ఇవ్వాలి.

తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట అవసరం

అదే సందర్భంలో ప్రాణహితపై తుమ్మిడిహెట్టి వద్ద నుండి ఎల్లంపల్లికి (116కి.మి) కాలువ తీసి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ



నీటివనరు కల్పించాలి. ఈ మధ్య కేంద్ర ఇరిగేషన్ సలహాదారు వెదిరె శ్రీరాములు కూడా తుమ్మిడిహెట్టి వద్ద 160 టిఎంసిల నికర జలాల లభ్యత ఉన్నట్లు ప్రకటించారు. పెనుగంగా, వార్ధా, వెయిన్‌గంగా కలిసిన తుమ్మిడిహెట్టి ప్రాంతంలో 148మీ. ఎత్తు ఆనకట్ట కట్టడం వల్ల 2.8 టిఎంసిల నీరు నీల్వ వుంటుంది. తుమ్మిడిహెట్టి నుండి సుర్గపల్లె (28.5కి.మీ) ద్వారా మైలారం ప్రాజెక్టు వరకు (71.5కి.మి) వరకు కాలువ తీయబడింది. మైలారం నుండి ఎల్లంపల్లికి 45కి.మీ. ప్రస్తుతం కాలువ త్రవ్వాలి. ఈ కాలువతో పాటు తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట 148మీ (సముద్ర మట్టానికి) ఎత్తువరకు ఆనకట్ట నిర్మించాలి. ఎల్లంపల్లి వద్ద ఎత్తుకూడా 148 మీ. మాత్రమే ఉంది. అనగా మైలారం వద్ద 20మీ. ఎత్తు లిఫ్ట్ చేసినచో ఎల్లంపల్లికి నీరు వస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 80.80టిఎంసి లతో 12 లక్షల ఎకరాలకు సాగునీరు, 10టిఎంసిలతో వికారాబాద్, తాండూర్ జిల్లాలకు సాగునీరు, 7టిఎంసిలతో ముథోల్ (నిర్మల్)కు సాగునీరు హైదరాబాద్‌కు 30టిఎంసిల తాగునీటితో పాటు కాలువ వెంబడి గల గ్రామాలకు 10టిఎంసిలు, 16 టిఎంసిలు పరిశ్రమలకు 6.2 టిఎంసిల ఆవిరికి కేటాయింపు చూపారు. తుమ్మిడి హెట్టి నుండి ఎల్లంపల్లి - తిప్పారం ఆనకట్ట వరకు 3,375 మెగావాట్ల విద్యుత్ కావాలి. ప్రతిరోజు 138మి.యూనిట్లు అవసరం.

గోదావరికి వరదలు రావడంతో ఎల్లంపల్లిలో పంపింగ్ చేసి నిల్వ పెట్టిన నీటిని గోదావరి ద్వారా దిగువకు వదిలివేశారు. వాస్తవాలు తెలిసినప్పటికీ కొందరు నాయకులు కాళేశ్వరం పంపులను ఆగస్టు 5వరకు తామే ప్రారంభిస్తామని ఎలా చెప్పగలుగుతున్నారు? రాజకీయ ప్రయోజనాలు ఆశించి ఆరోపణలు చేయడం రాష్ట్రంలో పరిపాటిగా సాగుతున్నది. వాస్తవాలను గుర్తించి భవిష్యత్తు ప్రణాళిక వేయడం, దానిని అమలుపరచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం

'కాళేశ్వరం' వ్యయం ఎవరు భరించాలి?

పై ప్రాజెక్టుకు బదులు మేడిగడ్డ నుండి ఎల్లంపల్లి - తిప్పారం వరకు కాళేశ్వరం ప్రాజెక్టుకు 8,459 మెగా వాట్ల విద్యుత్ కావాలి. రోజుకు 203 మి.యూనిట్లు అవసరం. విద్యుత్ చార్జీల కింద రూ.10,374 కోట్లు, నిర్వహణ కింద రూ.10,647 కోట్లు కావాలి. ఎకరాకు ప్రభుత్వం చేసే వ్యయం రూ.46,364లు ఖర్చు అవుతాయని ఆధార సహితంగా కాగ్ నివేదిక స్పష్టంగా వివరించింది. ఇన్ని అనుభవాలు మన ముందున్నప్పటికీ ప్రతిష్ట కోసం ప్రతిపక్షం "ఏనుగును ఇంటిముందు కట్టేసుకున్న" విధంగా కాళేశ్వరం వ్యయాన్ని ప్రజలు భరించాల్సిందేనా? తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరుగుతున్న ప్రయోజనాన్ని ఎందుకు గుర్తించడం లేదు? ఇప్పటికే రూ.వేల కోట్లు వ్యయం చేసిన తుమ్మిడిహెట్టి-ఎల్లంపల్లి ప్రాజెక్టును ఎందుకు కొనసాగించకకూడదు? మేడిగడ్డ నుండి ఎల్లంపల్లికి 108 కి.మీ. కాగా, తుమ్మిడిహెట్టి నుండి ఎల్లంపల్లికి 116 కి.మి. మాత్రమే. తుమ్మిడిహెట్టి లెవల్, ఎల్లంపల్లి లెవల్ 148మీ. కావడం వల్ల లిఫ్ట్ వ్యయం తగ్గుతుంది. 20మి. ఎత్తు లిఫ్ట్ మైలారం వద్ద పెట్టడంతో ప్రాజెక్టు పూర్తి అవుతుంది.

నిర్వాసితుల త్యాగాలకు ఫలితమేది?

కాళేశ్వరం ప్రాజెక్టులోని మల్లన్నసాగర్‌కు గత కాంగ్రెస్ ప్రభుత్వం 1టిఎంసి నిల్వ శక్తితో ప్రాజెక్టు సూచించగా టీ(బీ)ఆర్‌ఎస్ ప్రభుత్వం 50టిఎంసిలకు పెంచింది. ఈ ప్రాజెక్టు దిగువన భూమి చీలివుందని భూ ప్రకంపనల అధ్య యన కేంద్రం ప్రకటించింది. అందువల్ల మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం తక్కువ నీటిని నిల్వ పెడుతున్నారు. అలాగే కొండపోచమ్మలో కూడా 1టిఎంసి నుండి 15 టిఎంసిలకు పెంచడం జరిగింది. గందమల్ల రిజర్వాయర్ 9.87 టిఎంసిలు, బస్వాపురం 11.39 టిఎంసిలకు పెంచడం వల్ల నిర్వాసితులకు తీవ్రంగా నష్టపోయారు. 45 గ్రామాలు ఖాళీ చేయాల్సి వచ్చింది. ఇన్ని త్యాగాలు చేసినప్పటికీ ఆ ప్రాజెక్టు వల్ల లక్ష ఎకరాలకు కూడా ఈరోజు వరకు సాగునీరు ఇవ్వలేదు.

గోదావరి నీటిని ఎల్లంపల్లి పంపుల ద్వారా మిడ్‌మానేరుకు, లోయర్ మానేరుకు పంపుచేయడం ద్వారా కాకతీయ కాలువ మొదటి దశతో పాటు రెండవ దశకు నీరివ్వడానికి అవకాశం ఉంటుంది. గోదావరికి వరదలు వచ్చినప్పటికీ ఎల్లంపల్లి పంపులను కొనసాగిస్తూనే ఉండాలి. అంతేకాని ప్రతిష్టకు పోయి, ప్రతిష్టంభన సృష్టించడం వల్ల ప్రజలకు నష్టమే తప్ప న్యాయం జరగదు. ప్రజలు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను గమనిస్తున్నారు.

అట్టహాసంగా క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

హైటెక్స్‌లో రెరా గుర్తింపు ప్రాజెక్టుల ప్రదర్శన

అందుబాటులో 800 పైగా ప్రాజెక్టులు

పాల్గొన్న 200 ఎగ్జిబిటర్లు





నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైటెక్స్‌లో క్రెడాయబిలిటీ నేపథ్యంతో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శనను ఐజీబీసి నేషనల్ వైస్ ఛైర్మన్ సి శేఖర్ రెడ్డి, క్రెడాయ్ నేషనల్ సెక్రటరీ జి రామ్ రెడ్డి, క్రెడాయ్ నేషనల్ ఇసి మెంబర్ సిహెచ్ రామచంద్రారెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఆగస్టు 2 నుండి 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో పారదర్శకత, విశ్వసనీయతను కోరుకునే విభిన్న కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా కేవలం రెరా నమోదిత ప్రాజెక్ట్‌లను మాత్రమే ప్రత్యేకంగా ప్రదర్శనకు పెట్టడం విశేషం. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి రాజశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి, సెక్రటరీ బి జగన్నాథరావుతో పాటు ఇతర క్రెడాయ్ నాయకులు, సభ్యులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, ఇతర విక్రేతలు పాల్గొన్నారు.

క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోలో 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు అందుబాటు ధరలలో ఉండే గృహాల నుండి అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఓపెన్ ప్లాట్లు, వాణిజ్య సముదాయాలు మొదలైన 800 కంటే ఎక్కువ ప్రాజెక్ట్‌లను ప్రదర్శిస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. దీనిని అనుసరించి తదుపరి రెండు ప్రాపర్టీ షోలు ఆగస్టు 9 నుండి 11 వరకు కొంపల్లిలోని శ్రీకన్వెన్షన్స్‌లో, ఆగస్టు 23 నుండి 25 వరకు నాగోల్ మెట్రో స్టేషన్‌లో జరుగుతాయి. డెవలపర్‌లు, బిల్డింగ్ మెటీరియల్ తయారీదారులు, కన్సల్టెంట్‌లు, ఆర్థిక సంస్థలతో సహా విభిన్న శ్రేణి రియల్ ఎస్టేట్ నిపుణులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

హైదరాబాద్ రియాల్టీకి డిమాండ్ : వి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో అత్యుత్తమ ఆస్తులను అన్వేషించడానికి గృహ కొనుగోలుదారులకు విశ్వసనీయమైన, సమగ్రమైన వేదికను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రాపర్టీ షోనూ ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అద్భుతమైన వేగంతో ముందుకు సాగుతుందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న 4వ నగరంగా నిలిచిందన్నారు. తాము గురువారం సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యామన్నారు. హైదరాబాద్ 2050కి సంబంధించిన విజన్‌ను సిఎం వెల్లడించారని, అది చాలా ప్రోత్సాహకరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అభివద్దిని విస్తరించడానికి ప్రాంతీయ రింగ్‌రోడ్ కోసం రూ.1,525 కోట్లు కేటాయించడం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోశించనుందన్నారు. తాము పండుగ సీజన్‌లోకి అడుగు పెట్టడానికి ముందు ఆగస్టులో మూడు ప్రధాన ప్రదేశాలలో 'క్రెడాయబిలిటీ' నేపథ్యంతో కూడిన ప్రాపర్టీ షోలను ప్రదర్శించడం పట్ల సంతోషిస్తున్నామని క్రెడాయ్ హైదరాబాద్ సెక్రటరీ బి. జగన్నాథరావు అన్నారు.

ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాలను జయప్రదం చేయండి

గోడ పత్రికను విడుదల చేసిన గిరిజన సంఘం నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 9 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాల గోడ పత్రికను శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ధర్మనాయక్, ఆర్.శ్రీరాంనాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీరాంనాయక్ మాట్లాడుతూ ఆగస్టు 9న జరుగుతున్న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవంలో రాజకీయాలకు అతీతంగా గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని సైతం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజన తెగల హక్కులను రక్షించడం, స్వయంపాలన, జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలను గౌరవించడం, గిరిజనుల అభివృద్ధి, భాషల గుర్తింపు, విద్య, ఆరోగ్యం వంటి లక్ష్యాలను సాధించే దిశగా పాలక ప్రభుత్వాలు కృషి చేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందని గుర్తుచేశారు. ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివాసి గిరిజన తెగలు తమ హక్కుల సాధన కోసం నినదించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన తెగల జీవన విధానం, సంస్కృతి, ఆచారాలు, ఆహారఅలవాట్లపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దాడి చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం రాజ్యాంగంలోని గిరిజనుల హక్కులు,చట్టాలను కాలరాస్తూ 2023లో నూతన అటవీ సంరక్షణ నియమాల చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంకుమార్, రఘు నాయక్, గోపి నాయక్, వినోద్ నాయక్, గోర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శవాలపై పేలాలు ఏరుకున్నట్టు..

కోచింగ్ సెంటర్ల నుంచి భారీగా జీఎస్టీ వసూళ్లు

- రూ.2,240 కోట్ల నుంచి రూ.5,517 కోట్లకు పెరుగుదల
- ఐదేండ్లలో రెట్టింపు : కేంద్రం



న్యూఢిల్లీ : భారత్‌లో అనుమతుల్లేకుండా కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నా..వాటిపై చర్య తీసుకోవటానికి ప్రభుత్వాలు ఆసక్తి చూపటంలేదు. ఇటీవల ఢిల్లీలో సివిల్స్ చదువుకోవటానికి వెళ్లి ముగ్గురు చనిపోయిన విషయం విదితమే. అయితే శవాలపై పేలాలు ఏరుకున్నట్టు కేంద్రం తీరు కనిపిస్తోంది. యువత చనిపోయినపుడు చూసుకుందాం.. ముందు మా ఖజానా నిండుతోందా లేదా అన్నది ముఖ్యం అన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఆ ఫలితంగానే కోచింగ్ సెంటర్ల నుంచి జీఎస్టీ వసూళ్ల భారీగా పెరిగాయి. గత ఐదేండ్లలో ఇవి రెట్టింపయ్యాయి. 2019-20లో కోచింగ్ సంస్థల నుంచి జీఎస్టీ వసూళ్ల రూ. 2,240.73 కోట్లుగా ఉండగా 2023-24లో రూ. 5,517.45 కోట్లకు పెరిగాయి. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ రెవెన్యూ విభాగం డేటాను ప్రస్తావిస్తూ విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ ఈ సమాచారాన్ని వెల్లడించారు. ఈ డేటా ప్రకారం.. కోచింగ్ సెంటర్ల నుంచి జీఎస్టీ వసూళ్ల గత ఐదేండ్లలో రెట్టింపయ్యాయి. కోచింగ్ పరిశ్రమ దేశంలో పెద్ద ఎత్తున ఉన్నదనీ, అది వేగంగా విస్తరిస్తున్నదని కేంద్ర మంత్రి తెలిపారు.

ఇటీవల ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో వరదనీరు వచ్చి ముగ్గురు యూపీఎస్సీ అభ్యర్థులు మరణించిన నేపథ్యంలో, కోచింగ్ సెంటర్లు, వాటికి సంబంధించిన సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వం స్పందిస్తూ.. కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసిందని వివరించింది. దేశంలోని ప్రయివేటు కోచింగ్ సెంటర్‌లలో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, అగ్ని ప్రమాదాలు, సౌకర్యాలు, బోధనా పద్ధతుల్లో లోపాలను ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయా, వాటి పనితీరుపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారా అనే మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ సమాధానమిచ్చారు. ఈ ఏడాది జనవరిలో జారీ చేసిన మార్గదర్శకాలను మజుందార్ ఎత్తిచూపారు.

దోహాలో ముగిసిన హనియె అంత్యక్రియలు

వేలాదిమంది కన్నీటి వీడ్కోలు

దోహా, గాజా : ఇజ్రాయిల్ మిలటరీ దాడిలో మరణించిన హమాస్ అగ్ర నేత హనియె అంత్యక్రియలు శుక్రవారం దోహాలో జరిగాయి. వేలాదిమంది ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. లూసాయ్ రాయల్ శ్మశాన వాటికలో ఆయన భౌతిక కాయాన్ని ఖననం చేశారు. ఈ కార్యక్రమానికి బయటివారిని ఎవరినీ రానివ్వలేదు. కొంతమంది ప్రభుత్వ ప్రముఖులు, ఖతార్ రాజ కుటుంబానికి చెందిన సభ్యులు కొంతమంది, హనియె కుటుంబ సభ్యులు కొద్ది మంది మాత్రమే హాజరయ్యారు. గత పది మాసాలుగా కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాడుల్లో హనియె 12మంది కుటుంబ సభ్యులను కోల్పోయారు. ఫతా, హమాస్, ఇస్లామిక్ జిహాద్ వంటి పాలస్తీనాకు చెందిన వివిధ వర్గాల నేతలు, ప్రవాసంలో వుంటున్న ముఖ్యమైన పాలస్తీనా నేతలు కొంతమంది ఈ కార్యక్రమానికి విచ్చేశారు. పాలస్తీనా ప్రతిఘటన ఉద్యమానికి కీలకంగా హనియెను భావిస్తున్నందువల్ల డజన్ల సంఖ్యలో ఎన్‌జిఒల ప్రతినిధులు కూడా వచ్చారు. పాలస్తీనియన్ల తరపున చట్టబద్ధమైన వాణిని వినిపించేది హనియె అని వీరందరూ విశ్వసిస్తున్నారు. సామాన్యుల నుండి రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తల వరకు పలు వర్గాలకు చెందినవారు వచ్చి హనియెకు నివాళి అర్పించారు. అత్యధిక ఎండలతో వాతావరణం ప్రతికూలంగా వున్నప్పటికీ వేలాదిమంది ప్రజలు దోహాలో అబ్దుల్‌అల్ వహాబ్ మసీదు వద్దకు చేరి తమ నేతకు నివాళి అర్పించారు.

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేయడం తగదు

- గాంధేయమార్గంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా?
- మానవతా దృక్పథంతో బిల్లులు చెల్లించండి
- తెలంగాణ సర్పంచుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని గాంధేయ మార్గంలో సచివాలయం ఎదుట నిరసన తెలుపుతామంటే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేయడం తగదని తెలంగాణ సర్పంచుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ విమర్శించారు. శుక్రవారం సచివాలయం ఎదుట గాంధేయ మార్గంలో నిరసన తెలపడానికి బయలు దేరిన మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా అడ్డుకున్నారు. జేఏసీ నాయకులను లక్డీకాపూల్‌లోని ద్వారకా హోటల్ సమీపంలో అరెస్టు చేశారు. వారిని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీత్ చంద్రరావు, ఉపాధ్యక్షులు గంటి మధుసూదన్‌రెడ్డి, పలు జిల్లాల అధ్యక్షులు ఉన్నారు. పోలీస్‌స్టేషన్‌లోనూ వారు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుర్వియాదయ్యగౌడ్ మాట్లాడుతూ..సచివాలయం చుట్టూ వేలాది మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధించడం సరిగాదన్నారు. ఆరు వేల మంది మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. గాంధేయ మార్గంలో నిరసన తెలిపే హక్కు కూడా తమకు లేదా అని ప్రశ్నించారు. తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులను అడిగితే గొంతులను నొక్కేయడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి మరీ పనులు చేశామనీ, ఏండ్ల తరబడి బిల్లులను పెండింగ్‌లో పెట్టడం దారుణమని విమర్శించారు. అప్పులు తీర్చలేక, వాటికి వడ్డీలు కట్టలేక తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను మాజీ సర్పంచులకు వెంటనే చెల్లించాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్స్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. శుక్రవారం శాసనమండలిలో ఈ మేరకు ఆయన పిటిషన్ సమర్పించారు. బీఆర్ఎస్ సభ్యులు మధుసూదనాచారి మాట్లాడుతూ వీఆర్వోల వారసులకు ఉద్యోగుల కల్పనకు సంబంధించి హైకోర్టు స్టే ఎత్తివేసిన నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకార సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, టీజీపీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీలో మిగిలిన 40 పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి పిటిషన్ ఇచ్చారు.

నేటి నుంచి సీఎం అమెరికా టూర్

- 12 రోజుల పాటు అక్కడే మకాం
- పెట్టుబడులను ఆకర్శించేందుకు పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం నేటి నుంచి 12 రోజుల పాటు అమెరికాలో పర్యటించనుంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్శించేందుకు వెళుతున్న ఈ బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఉన్నారు. అమెరికాలోని న్యూజెర్సీ, న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ, శాన్‌ఫ్రాన్సిస్‌కో, దక్షిణ కొరియాలోని సియోల్ తదితర ప్రాంతాల్లో సీఎం బృందం పర్యటించనుంది. ఎనిమిది రోజులపాటు అమెరికాలో, రెండు రోజులు దక్షిణ కొరియాలో పర్యటిస్తారు. తిరిగి ఈ నెల 14న హైదరాబాద్ చేరుకోనున్నారు.

పలు కంపెనీలతో ఒప్పందం

అమెరికా పర్యటనలో కొన్ని ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంపై ఒప్పందాలు చేసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వాటితో చర్చలు జరిపారు. ఇటీవల దావోస్‌లో సీఎం రేవంత్ పర్యటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ చుట్టూ నగరం విస్తరిస్తుండటంతో, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని కంపెనీలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నారు. ఈ పర్యటనలోనే వాటితో ఎంవోయూ చేసుకోనున్నట్టు సమాచారం.

కేంద్రంపై పోరాడతాం..కలిసి రండి

- బీఆర్ఎస్‌కు శ్రీధర్‌బాబు సూచన

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు కలిసి రావాలని బీఆర్ఎస్‌కు విజ్ఞప్తి చేశారు. శాసనసభ, మండలి సమావేశాల్లో అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. 59 మంది ఎమ్మెల్యేలు మాట్లాడినట్టు చెప్పారు. సభలో కాంగ్రెస్ 8:43 గంటలు, బీఆర్ఎస్ 8:41 గంటలు, బీజేపీ 3.:48 గంటలు, ఎంఐఎం 5 గంటలు, సీపీఐ 2.55 గంటలు మాట్లాడారని చెప్పారు. చరిత్రలో నిలిచేలా చర్చలు జరిగాయన్నారు. కృష్ణా జలాలపై హక్కును వదిలుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. సాగునీటి హక్కులను కాపాడటంలో కేసీఆర్ సర్కారు విఫలమైందన్నారు.బీసీల సర్వే చేస్తామన్నారు. యువత కోసం జాబ్‌క్యాలెండర్ విడుదల చేసినట్టు చెప్పారు.

సాగర్‌లా దృఢంగా కాంగ్రెస్ కట్టే డ్యాంలు

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

- ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల





నవతెలంగాణ-నాగార్జునసాగర్

కాంగ్రెస్ ప్రభుత్వం కట్టే డ్యాంలు నాగార్జున సాగర్‌లా దృఢంగా ఉంటాయని, బీఆర్ఎస్ వాళ్ల కట్టే ప్రాజెక్టులు కాళేశ్వరం ప్రాజెక్టులా కుంగిపోతాయని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన సాగునీటిని విడుదల చేశారు. లో లెవల్ కెనాల్ దగ్గర పూజలు నిర్వహించిన అనంతరం నాగార్జునసాగర్ విజయ విహార్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. రాష్ట్రంలో 30 నుంచి 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దశాబ్ద కాలంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇంత త్వరగా సాగునీటిని విడుదల చేసింది తామేనని అన్నారు. పూర్తి సామర్థ్యంతో నీటిని వదిలామని, దారిపొడవునా సాగునీటికి, తాగునీటికీ చెరువులు నింపుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రతి సంవత్సరం ఆరు నుంచి ఆరున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు కల్పించాలని ప్రభుత్వం సంకల్పంతో ఉందని చెప్పారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల పది సంవత్సరాలుగా నీటిపారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్ర ఆయకట్టుకు సాగునీరిచ్చారని, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ద్వారా కూడా సాగునీరు ఇవ్వలేదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజ్ నాసిరకం పనులతో చేయడం, నిర్వహణ సైతం లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, ముఖ్యంగా ఎస్ఎల్బీసీ, డిండి, బ్రాహ్మణ వెల్లెంల, పిల్లాయిపల్లిని పూర్తి చేస్తామని తెలిపారు. నల్లగొండ, మిర్యాలగూడ తదితర అన్ని నియోజకవర్గాల్లో కొత్త ప్రాజెక్టులతోపాటు పాత ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు రూ.22,500 కోట్లు కేటాయించి నట్టు తెలిపారు. ఇందులో రూ.10,828 కోట్లు ఆగిపోయిన ప్రాజెక్టుల పనులకు, రూ.11 వేల కోట్లు ఎస్టాబ్లిష్‌మెంట్ వ్యయం కింద తీసుకున్నట్టు వివరించారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా 11,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పారు.

ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో నీరు ఇస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అన్ని చెరువులను నింపుతామన్నారు. ఎస్ఎల్బీసీ పూర్తికి తమ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, దీని ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు, తాగునీరు అందుతుందని అన్నారు. పెండింగ్ ప్రాజెకులన్నీ పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. మూడేండ్లలో అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మంత్రులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఇరిగేషన్ సీఈ నాగేశ్వర్‌రావు, ఇంజినీరింగ్ అధికారులతో పాటు, పలువురు ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, ఎస్ఈ, ఈఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'భూమాత' ముసాయిదాను వెబ్‌సైట్‌లో ఉంచాం

- మూడు వారాల్లో అభిప్రాయాలు చెప్పాలి
- ధరణి పోర్టల్ అనేది గడీల కుట్ర, మోసం
- పేదల భూములు లాక్కున్నారు
- లక్షల దరఖాస్తులొచ్చినా బీఆర్ఎస్ పట్టించుకోలేదు
- వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ ధ్వంసం పై అధికారులకు ఆప్షన్లు ఇవ్వలేదు
- సమస్యలు పరిష్కారం కాక రైతుల ఆత్మహత్యలు
- శాసనసభలో భూమి హక్కులు, సంస్కరణలపై స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భూమాత ముసాయిదా (డ్రాఫ్ట్) చట్టాన్ని శుక్రవారం నుంచి వెబ్‌సైట్‌లో ఉంచామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆ చట్టంపై మూడు వారాల్లో రైతులు, మేధావులు, ప్రజాసంఘాలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. పలువురి సూచనలు, సలహాలమేరకే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో భూమాత చట్టాన్ని తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో ధరణిపై ప్రయోగాత్మకంగా రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించామని మంత్రి తెలిపారు. 'తెలంగాణ భూమి హక్కులు, సంస్కరణలు' అనే అంశంపై శుక్రవారం శాసనసభలో స్వల్పకాలిక చర్చను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు ఆ చట్టాన్ని సమర్థవంతంగా తీసుకొస్తామన్నారు. అన్యాక్రాంతమైన సామాన్యుల భూములను తిరిగి ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్ గడీల్లో సిద్ధమైందనీ, కుట్రపూరితంగా, మోసపూరితంగా జరిగిందని ఆరోపించారు. అపరమేధావిగా, అనుభవజ్ఞుడిగా పేరొందిన ఓ పెద్ద మనిషి ధరణి పేరుతో రైతులను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల ధృతరాష్ట్ర కౌగిలి నుంచి రైతులు విముక్తి చెందారని అన్నారు. ధరణితో రైతులు ఎంత నష్టపోయారో ఆ కోపాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో చూపించారని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, చివరకు సీసీఎల్ఏ స్థాయిలో కూడా భూ సమస్యలు పరిష్కారం కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎల్ఎఫ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరు మార్చి సింగపూర్‌కు చెందిన కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోటి యాభై లక్షల ఎకరాలకు సంబంధించిన వివరాలను విదేశి కంపెనీ చేతుల్లో పెట్టారని వివరించారు. ఇతర దేశాల్లో డిఫాల్టర్ అయిన ఆ కంపెనీకి ఆ పోర్టల్‌ను ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సాదాబైనామాలను పట్టించుకోలేదనీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొమ్మిది లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో కొన్నింటిని పరిష్కరించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం సామాన్యుల భూములను నిషేధిత జాబితాలో పొందుపరిచిందని విమర్శించారు. రైతులు తమ అవసరాల కోసం సొంత భూమిని కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 18 లక్షల ఎకరాల భూమిని పార్ట్ బీలో పెట్టారని తెలిపారు. చివరకు అసైన్డ్ ల్యాండ్స్‌ను కూడా లాక్కున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నాటికి 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనీ, అందులో కొన్నింటిని పరిష్కరించామనీ, త్వరలో మిగతా వాటిని క్లియర్ చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను అకారణంగా తిరస్కరించిందనీ, కనీసం కారణాలు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలనీ, తిరస్కరిస్తే అందుకు తగిన కారణం కూడా చెప్పాలని అధికారులను ఆదేశించామన్నారు. నాలుగు గోడల మధ్య చట్టాలను చేయబోమనీ, ప్రజల అభిప్రాయాల మేరకే భూమాతను తీసుకొస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. ఇదే అంశంపై కాంగ్రెస్ సభ్యులు సంజీవరెడ్డి తన అభిప్రాయాలను చెప్పారు.

ఉద్యోగాల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండరా?

- గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన
- రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌పై బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేసింది. ఉద్యోగాల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండర్ ఎందుకని ప్రశ్నించింది. శనివారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. అందులో ఉద్యోగుల సంఖ్య లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గవన్‌పార్కు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు, కేటీఆర్ మధ్య వాగ్వాదం నెలకొంది. వారిని పోలీసులు అరెస్టు చేసి వాహనాల్లో తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపే హక్కు లేదా? ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ఆయన చెప్పారనీ, అవి కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. సీఎంకు దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి ఆ జాబ్ క్యాలెండర్ కరెక్టే అని చెప్పాలని సవాల్ విసిరారు. ఎనిమిది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగమైనా ఇచ్చినట్టు అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే మేమందరం తమ పదవులకు రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. జాబ్ క్యాలెండర్ కాస్త జోక్ క్యాలెండర్‌గా అయిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి లేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. వడ్లకు రూ.500 బోనస్, 10 శాతం పండే సన్నరకానికి ఇస్తామని చెప్పి ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, వృద్ధులకు రూ. 4వేల పింఛన్ అని మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేలను శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసభ్యపదజాలంతో దూషించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగ్గు, శరం ఉంటే దానం నాగేందర్ రాజీనామా చేయాలని కోవా లక్ష్మి డిమాండ్ చేశారు. ఆయన భాష సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధరణిపై విచారణ జరిపించాలి

- దానివల్ల నయా భూస్వాములు తయారయ్యారు
- అసెంబ్లీలో సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'ధరణి'పై విచారణ జరిపించాలని సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ పోర్టల్ పూర్తిగా అవకతవకలతో కూడి ఉందనీ, దీనివల్ల రాష్ట్రంలో నయా భూస్వాములు తయారయ్యారని అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో 'తెలంగాణ భూమి హక్కులు-సంస్కరణలు' అంశంపై జరిగిన లఘుచర్చలో ఆయన మాట్లాడారు. ధరణి వల్ల గ్రామాల్లో అప్రకటిత అల్లకల్లోలం ఏర్పడిందనీ, అప్పటి సీఎం కేసీఆర్ అందరి సలహాలు తీసుకొని, ఐఏఎస్ అధికారి సోమేష్‌కుమార్ మాట మాత్రమే విన్నారని, ఆయన మాయలో ఎలా పడ్డారో అర్థంకావట్లేదన్నారు. ధరణి కేసీఆర్ ప్రభుత్వానికి బూమ్‌రాంగ్ అయ్యిందని చెప్పారు. ధరణిలో కాస్తు కాలమ్ తీసేయడంతో రైతుబంధు, రైతుబీమా వంటి ప్రయోజనాలన్నీ పాత భూస్వాములకే వెళ్లాయని తెలిపారు. ధరణి వల్ల అవినీతి పెరిగిందన్నారు. భూముల సర్వేలోనూ గందరగోళమే ఏర్పడిందనీ, ధరణి పుణ్యాన పేద రైతులు ఉన్న భూములు కోల్పోయి ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని అన్నారు. సమగ్ర భూ సర్వే చేయనందువల్ల అనేక అవస్థలు ఎదురయ్యాయనీ, రాష్ట్ర ప్రజల ఆస్తుల వివరాలన్నింటినీ ఐఎఫ్ఎల్ఎస్ అనే ప్రయివేటు సంస్థ చేతికి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సీసీఎల్ఏ తలుచుకుంటే ఏమైనా చేసే పరిస్థితులు కల్పించారనీ, దీనిపై 15 కోట్లకు పైగా సైట్ విజిట్స్ జరిగాయని వివరించారు. ధరణి పూర్తిగా ఫెయిల్ అయ్యిందనీ, ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా స్వల్ప సమస్యల్ని పరిష్కరించగలిగిందే తప్ప, మూలాల్లోకి వెళ్లలేకపోయిందన్నారు. ఐఎఫ్ఎస్ఎస్ ఒప్పందాన్ని రద్దు చేయాలనీ, మాన్యువల్‌గా భూసర్వేచేయాలని కోరారు. సాదాబైనమా సమస్యలు పరిష్కరించాలని, అప్పిలేట్ అధికారం కల్పించాలని, కౌలు రైతులకు కౌలు పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాలయ భూములు సాగు చేస్తున్న రైతులకు కౌలు పట్టా ఇవ్వాలనీ, వారికి రైతుబీమా, రైతుబంధు వర్తింప చేయాలని కోరారు. 58, 59 జీవోలు పునరుద్ధరించాలని, సింగరేణి ఏరియాకు పరిమితమైన జీవో నెంబర్ 76ను నిలిపివేయాలని చెప్పారు.

వీఆర్ఏల వారసత్వ ఉద్యోగాలు భర్తీ చేయండి



ఇదే అంశంపై మాట్లాడిన బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి 3,790 మంది వీఆర్ఏలకు 65 ఏండ్లు పూర్తయ్యాయనీ, వారి వారసులకు ఉద్యో గాలు ఇవ్వాలని కోరారు. దీనికి సంబం ధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 85, 86పై కోర్టు స్టే విధించిందనీ, తాజాగా దాన్ని ఎత్తివేశారని సభ దృష్టికి తీసుకొచ్చారు. మాజీ సర్పంచులకు పెండింగ్ ఇవ్వాలని కోరారు.

సీబీఐ విచారణ జరిపించండి



బీజేపీ శాసన సభాపక్షనేత మహేశ్వరరెడ్డి మాట్లా డుతూ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరడానికి భూ ఆక్రమణలే కారణమని అన్నారు. భూ ఆక్రమిత నేతల పేర్లు బయట పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరణిలో అక్రమాలు జరిగితే దానిపై సీబీఐ విచారణ ఎందుకు కోరట్లేదని అడిగారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ వంటి నేతలు అక్రమాలు పాల్ప డ్డారనీ, ఆ సమాచారం తమవద్ద ఉన్నదని అన్నారు.

వక్ఫ్ ఆక్రమణలు తొలగించండి



ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ వక్ఫ్ భూముల అక్రమణలపై ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు రెండూ ఈ అక్రమణలను కట్టడిచే యడంలో ఫెయిల్ అయ్యాయన్నారు. భూ ఆక్రమణదారులపై కేసులు పెట్టి, జైళ్లకు పంపాలని డిమాండ్ చేశారు. ధరణి లోపాలను సవరించి, మెరుగైన సేవల్ని ప్రజలకు అందించాలని కోరారు.

గుత్తికోయల్ని బట్టలిప్పి తన్నారు...

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎల్మ బజ్జు మాట్లాడుతూ మహిళలను అవమానించారని రెండ్రోజులుగా ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, తాము అధి కారంలో ఉన్నప్పుడు గిరిజన మహిళలు, గుత్తికోయల్ని బట్టలిప్పి తన్నిం చారని ప్రత్యా రోపణ చేశారు. వారు మహిళల గౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంద న్నారు. అంత కుముందు కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శంకరయ్య మాట్లాడారు.



ఎస్సీ జాబితాలో చేర్చాలి

- శీతాకాల పార్లమెంటు సమావేశంలో బిల్లు పెట్టాలి
- దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య ఇజ్రాయేల్ అధ్యక్షతన రాష్ట్ర నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లు పెట్టించి చట్టబద్ధత కల్పించే బాధ్యత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమిదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఎం.వీ.జాన్సన్, అంద్రూస్ జేవియర్, బి.కిష్టయ్య లూకాస్, ప్రకాష్, భాస్కర్, భూమమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో 2.53 శాతం నుంచి 3.47 శాతమే ఖర్చు

- ఎన్‌హెచ్ఎంకు నిధులు విడుదల చేయని వైనం
- ఆరోగ్యరంగంపై కాగ్ నివేదిక విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2016-17 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఆరోగ్య రంగానికి సంబంధించి 2.53 శాతం నుంచి 3.47 శాతం మాత్రమే ఖర్చు చేసిందని కాగ్ నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల నిర్వహణ (2022 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన) కాగ్ నివేదికను శుక్రవారం రాష్ట్ర శాసనసభకు సమర్పించారు. ఆరోగ్య రంగానికి నిర్దేశించిన దానిలో 50 శాతం కంటే తక్కువే వ్యయం చేసినట్టు పేర్కొంది.

జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద రాష్ట్ర వాటా అందించకపోవడంతో 2017 -22 మధ్య కాలంలో గ్రామీణ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార సమితుల సభ్యులకు అవసరమైన తప్పనిసరి శిక్షణలు నిలిచిపోయాయి. కోవిడ్-19 నిర్వహణ కోసం 2020 డిసెంబర్ - 2021 సెప్టెంబర్ మధ్య కాలంలో ఎన్‌హెచ్ఎం నిధుల నుంచి తీసుకున్న రూ.144.17 కోట్ల తిరిగి భర్తీ చేయలేదు. రాష్ట్రంలో సి-సెక్షన్ ప్రసవాలు 2017-18 నుంచి 2021-22 మధ్య కాలంలో 56 నుంచి 62 శాతానికి పెరిగాయి.

ఆరోగ్య నిపుణుల కొరత

రాష్ట్రంలో ఆరోగ్యంపై నెలవారీ ఖర్చు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉంది. ప్రతి 10 వేల మంది జనాభాకు 45 మంది ఆరోగ్య నిపుణులు ఉండాలనే లక్ష్యం ఉండగా కేవలం 10 మందితో రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది.

సంప్రదింపులతోనే ధరణి రూపకల్పన

- బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆనాటి ప్రభుత్వం సంప్రదింపులతోనే ధరణి వెబ్ పోర్టల్‌ను రూపకల్పన చేసిందని బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి గుర్తు చేశారు. నాలుగు గోడల మధ్య ధరణి పేరు పెట్టలేదనీ, ఎన్నో సమీక్షలు, సలహాలు, సూచనలు తీసుకుని చేసిందన్నారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ భూమి హక్కులు, సంస్కరణలు' అనే అంశంపై స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. ధరణితో రైతులు సంతోషంగానే ఉన్నారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. రెవెన్యూ చట్టాలను మార్చేందుకు నిర్వహించిన పలు సమావేశాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా నాటి సీఎం కేసీఆర్‌తో ఉన్నారని గుర్తు చేశారు. పటేల్, పట్వారీల తరహాలోనే వీఆర్ఏ, వీఆర్వోలు తయారై రైతులను ఇబ్బందులకు గురి చేశారనీ, అందుకే ఆ వ్యవస్థను రద్దు చేశామన్నారు. రకరకాల కారణాలతోనే 18 లక్షల ఎకరాల భూమిని పార్ట్-బీలో పెట్టారని చెప్పారు.

ధరణి బాగా లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వినియోగిస్తున్నదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి అని నిర్ధారించిన తర్వాతనే దాన్ని ప్రొహిబిటెడ్ ల్యాండ్‌లో పెట్టారని ఆయన వివరించారు. అందులో లోపాలుంటే సవరించి, చట్టాన్ని సమర్థవంతంగా తీసుకరావాలన్నారు. అంతేగానీ ఆ చట్టమే బాగాలేదనడం సరైందికాదని చెప్పారు.

స్థానికసంస్థల్లో బీసీల వర్గీకరణ అమలు చేయాలి

- టీఆర్ వీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీలను వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకుందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించి అమలు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం (టీఆర్‌వీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం టీఆర్‌వీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లను వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

వెనుకబడిన కులాల్లో అనేక ఎంబీసీ కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. ఇప్పటికీ 80, 90 కులాలు గ్రామ పంచాయతీ మెట్లు కూడా ఎక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో ఇప్పటికీ ఐదారు కులాలే రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు. అనేక కమిషన్లు వందలాది కులాలు సామాజిక, ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మెన్లు ,మున్సిపల్ చైర్మన్, మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా అయ్యే అవకాశం వర్గీకరణతోనే సాధ్యమవుతుందని తెలిపారు.

ఒకటో తరగతి నుంచే స్కిల్స్ ఉండాలి

● అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థులకు ఒకటో తరగతి నుంచే నైపుణ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. శుక్రవారం శాసనమండలిలో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడారు. జపాన్, చైనా లాంటి దేశాలు పూర్వ ప్రాథమిక విద్య నుంచే నైపుణ్యం పెంచే చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు సరైన సమయంలో సరైన నిర్ణయమంటూ ప్రభుత్వాన్ని అభినందించారు. ప్రపంచం వేగంగా మారుతున్నదనీ, నేటి నైపుణ్యం రేపటికి కాలం చెల్లిపోతున్నదని తెలిపారు. ఇంజినీరింగ్ చదివిన వారు కూడా ఉపాధి కోసం సర్టిఫికెట్ కోర్సులు చేస్తున్నారని తెలిపారు. చదువు మొదలు పెట్టే నాటికి అప్‌డేట గా ఉన్న నైపుణ్యం చదువు ముగిసే నాటికి అవుట్‌డేటెడ్‌గా మారిపోతున్నదని చెప్పారు. పిల్లలకు సమిష్టి జీవనం, అందరూ బాగుండాలి - అందులో నేనుండాలి అనేవి నేర్పాలని సూచించారు.

బీజేపీ సర్కారు తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ప్రపంచంలో పని వారలను తయారు చేసేందుకేనని ఆయన విమర్శించారు. అందులో చాలా లోపాలున్నాయని చెప్పారు. ఈ విధానాన్ని తిరస్కరించాలని కోరారు. 1968లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మొదటి జాతీయ విద్యా విధానంలో జాతి అభివృద్ధికి ఉపయోగపడే విద్యను ప్రోత్సహించాలని ఉందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సభ్యులు మధుసూదనాచారి మాట్లాడుతూ రాబోయే పరిణామాలను గమనించి ఆ దిశగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీలో తెలంగాణ వారికే వంద శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. స్కిల్ యూనివర్సిటీ ఉన్నత చదువులు చదివిన వారికే ఉపయోగపడేలా ఉందనీ, పదవ తరగతి, అంతా కన్నా తక్కువ చదివిన వారికీ నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఏ.వీ.ఎస్.రెడ్డి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ బిల్లుకు తమ పార్టీ బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీలో రిజర్వేషన్లు, ఫీజు రీఎంబర్స్ మెంట్ అమలు చేయాలని కోరారు.

కొత్తచట్టాలతో పోలీసు రాజ్యం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రం తీసుకొచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాలతో రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడిచే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్ర వారం శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లు, తెలంగాణ శాసనముల మార్పు బిల్లులను శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వామపక్ష, ప్రజా సంఘాల ఉద్యమాలు క్రియాశీలకంగా ఉన్న తెలంగాణలో ఆ చట్టాల అమలు సరిగా దన్నారు. భావ వ్యక్తీకరణను హరించేలా కొత్త చట్టాలున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఆ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కూడా నేరమని చెప్పారు. గతంలో కాంగ్రెస్ సభ్యులతో పాటు సీఎం కూడా పలుమార్లు ధర్నాలు చేశారని గుర్తుచేశారు. భవిష్యత్తులో ధర్నాలు చేయడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షంలో ఎవరున్నా ప్రజల తరఫున నిరసనలు చేయడం పరిపాటేనన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం వాళ్లు సభ పెట్టుకుంటామంటే అనుమతి తీసుకోలేదని నిరాకరించడం ఏంటని ప్రశ్నించారు. ఏ చట్టం ఉపయోగించి నిరాకరించారో తెలియడం లేదన్నారు. అలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చూడాలని కోరారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే డిలీట్ చేయాలని ఒత్తిడి చేయడం శ్రేయస్కరం కాదన్నారు. చట్టాలను దుర్వినియోగం చేయొద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాల విషయంలో తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల సీఎంలు సవరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. కాబట్టి సవరణలు తీసుకోస్తారో లేదో చెప్పాలని ప్రశ్నించారు. లైంగికదాడులను నిరోధించడానికి, సైబర్ క్రైమ్ నేరాలను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని కోరారు. సభలోని కెమెరాలన్నీ స్పీకర్ ఆధీనంలోనే ఉంటాయనీ, కావాలంటే స్పీకర్ ఒకసారి మొత్తం పరిశీలించాలని కోరారు. తమ వల్ల జరిగిందా? ఇక్కడున్న కెమెరాలు నడుపుతున్న ఏజెన్సీ వల్ల జరిగిందా? పరిశీలించాలని సూచించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చునన్నారు. ప్రధాని నుంచి సీఎంలు, మాజీ సీఎంలు, ఎమ్మెల్యేలు, స్పీకర్ల మీద వ్యక్తిత్వ హననం చేసే కార్యక్రమం జరుగుతూనే వస్తున్నదన్నారు. సభలో సభ్యులతో సహా సీఎం కూడా మాట్లాడే సమయంలో నియంత్రణ కలిగి ఉండాలని కోరారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హైకోర్టు కట్టొద్దు : కేటీఆర్

నూతన హైకోర్టు భవనాన్ని కడుతామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ చెప్పారు.

ఉభయసభలు నిరవధిక వాయిదా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి నిరవధికంగా వాయిదా పడ్డాయి. తొమ్మిది రోజులపాటు ప్రభుత్వ ప్రతిపక్షాల మధ్య హోరాహోరీ కొనసాగింది. 32 ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఎనిమిది ప్రశ్నలకు సమాధానం రాలేదని స్పీకర్ తెలిపారు. ఎమ్మెల్యేలకు పంపిస్తామని సర్కారు తెలియజేసింది. జులై 23 నుంచి ఆగస్టు రెండు వరకు శాసనసభ జరగ్గా, జులై 24 నుంచి ఆగస్టు రెండు వరకు శాసనమండలి నడిచింది. అసెంబ్లీ 65 గంటల 33 నిమిషాల పాటు కొనసాగింది. ఎమ్మెల్యేలు 132 ప్రసంగాలు చేసినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. ప్రభుత్వం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మరొక స్టేట్‌మెంటు సైతం ఇచ్చింది. ఐదు బిల్లులను సభ ఆమోదించింది. రెండు లఘు చర్చలు, మూడు మోషన్లపై చర్చ జరిగినట్టు చెప్పారు. ఇకపోతే శుక్రవారం శాసనమండలి సాయంత్రం 5:30 గంటలకు, అసెంబ్లీ రాత్రి 8.30 గంటలకు నిరవధిక వాయిదా పడ్డాయి.

ప్రజాస్వామ్యం సజావుగా సాగాలి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యం సజావుగా సాగడమే కీలకమని, అందుకు గవర్నర్లు సమన్వయంతో పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. గత దశాబ్దంలో జరిగిన సామాజిక సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించే రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. శుక్రవారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో గవర్నర్ల సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేయడమే కాక సామాన్య ప్రజల సంక్షేమ పథకాలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ఈ సదస్సుకు సంబంధించిన ఎజెండాలో జాతీయ లక్ష్యాలను సాధించడంలో కీలక అంశాలను పొందుపరిచినట్టు తెలిపారు. ఈ చర్చల్లో పాల్గొనే వారందరికీ మంచి అనుభూతిని కలిగిస్తాయని, వారి పనితీరులో సహాయపడతాయని అన్నారు.

గవర్నర్లు ఉన్నత విద్యా సంస్కరణలకు సహకరించాలి

నాణ్యమైన ఉన్నత విద్య, వ్యక్తిగత అభివృద్ధి, సామాజిక మార్పుతో పాటు ఆవిష్కరణ, ఆర్థిక పురోగతిని ప్రోత్సహిస్తున్నందున అది కనిపించని ఆస్తి అని రాష్ట్రపతి అన్నారు. జాతీయ విద్యా విధానంలో విద్యాసంస్థల అక్రిడిటేషన్, అసెస్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టిపెట్టినట్టు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ల హోదాలో గవర్నర్లు ఈ సంస్కరణ ప్రక్రియకు సహకరించాలని ఆమె కోరారు. నేర న్యాయానికి సంబంధించి మూడు కొత్త చట్టాలను అమలు చేయడంతో దేశంలో న్యాయ వ్యవస్థలో కొత్త శకం ప్రారంభమైందని అన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ



సాక్ష్యా అధినియం అనే చట్టాల పేర్లను బట్టి మన ఆలోచనలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం సజావుగా సాగేందుకు, అన్ని రాష్ట్రాలలో వివిధ కేంద్ర సంస్థలు మెరుగైన సమన్వయంతో పనిచేయడం చాలా కీలకమని అన్నారు. ఆయా రాష్ట్రాల రాజ్యాంగ అధిపతులుగా ఈ సమన్వయాన్ని ఏ విధంగా ప్రోత్సహిస్తారో ఆలోచించాలని గవర్నర్లకు సూచించారు.

సహజ వ్యవసాయంతోనే రైతుల ఆదాయం పెంచొచ్చు

సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో భూసారాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని పెంచవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాజ్‌భవన్‌లు ఆదర్శంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. పేదలు, సరిహద్దు ప్రాంతాలు, అణగారిన వర్గాలు, ప్రాంతాలు, వెనుకబడిన ప్రజల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. గిరిజన జనాభాలో ఎక్కువ భాగం షెడ్యూల్డ్, గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్నారని, ఈ ప్రాంతాల ప్రజల సమగ్ర అభివృద్ధిని సాధించడానికి మార్గాలను సూచించాలని ఆమె గవర్నర్లను కోరారు. ఐక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసేందుకు గవర్నర్లు సహకరించాలని అన్నారు. యువతలోని శక్తిని సానుకూలంగా, నిర్మాణాత్మకంగా మార్చగలిగితే 'యువాభివృద్ధి', 'యువత నేతృత్వంలోని అభివృద్ధి' మరింత ఊపందు కుంటాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. గవర్నర్లందరూ తమ ప్రమాణానికి న్యాయం చేస్తూ ప్రజల సేవకు, సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తారన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్రాల మధ్య వారధి గవర్నర్లు : ప్రధాని మోడీ

గవర్నర్లు కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా వ్యవహరిస్తారని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అన్నారు. రాజ్యాంగ పరిధిలోని రాష్ట్ర ప్రజల సంక్షేమంలో వారి పదవి ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో కీలకపాత్ర పోషించగలదని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని నింపేందుకు, గ్రామాలు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఆ ప్రాంతాలను సందర్శించాలని గవర్నర్లను కోరారు.

రుణమాఫీ కోసం తిప్పలు

● అర్హులమైనా రుణమాఫీ కాలే

● వ్యవసాయ కార్యాలయం ఎదుట అన్నదాతల బారులు

● బ్యాంకుల ఎదుట ఆందోళనలు



నవతెలంగాణ-రెంజల్/మాక్లూర్/పుల్కల్

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులందరికీ రుణమాఫీ చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. అన్ని అర్హతలు ఉండి కూడా అధికారుల నిర్లక్ష్యంతో మాఫీ కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాని సంగారెడ్డి జిల్లా రైతులు వ్యవసాయ కార్యాలయం ఎదుట బారులు తీరారు. నిజామాబాద్ జిల్లాలో బ్యాంకులు, సొసైటీల ఎదుట బైటాయించి ఆందోళనలు చేపట్టారు.

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో అధికారుల తప్పిదం వల్లనే తమకు రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్యాంకు ఎదుట రైతులు శుక్రవారం బైటాయించారు. అర్హులైన సన్న, చిన్న కారు రైతులకు రుణమాఫీ రాకపోవడానికి అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం మొత్తంలో కెనరా బ్యాంకులో మాత్రమే ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్ఎం వచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తి లేదని, అవసరమైతే అధికారులను నిర్బంధిస్తామని భీష్మించి కూర్చున్నారు. రైతన్నలు లేకపోతే బ్యాంకులు ఎలా పనిచేస్తాయని వారు ప్రశ్నించారు. బ్యాంకు మేనేజర్ నాగనాథ్ రైతుల వద్దకు వచ్చి రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేయగా.. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులను రప్పించాలని రైతులు పట్టుపట్టారు. ప్రతి రైతుకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకునే వరకు తాము ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. త్వరలోనే బ్యాంకుల్లో జరిగిన తప్పిదాల గురించి సరిచేసి ప్రతి రైతుకు రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటామని బ్యాంకు మేనేజర్ నాగనాథ్ హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు.

సొసైటీ అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీ వర్తించలే

శుక్రవారం 'నవతెలంగాణ' పత్రికలో 'సొసైటీ అధికారుల నిర్లక్ష్యం' అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందనగా రుణమాఫీ కాని రైతులు ప్రాథమిక సహకార సంఘం వద్దకు వచ్చి ఆందోళన చేశారు. సొసైటీ కార్యదర్శి సంతోష్‌ను రైతులు నిలదీశారు. 'ఏం చేయమంటారు' అంటూ కార్యదర్శి దబాయించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ లోన్ కార్యదర్శి కట్టాలంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపటికి సొసైటీ ప్రస్తుత ఇన్‌ఛార్జి చైర్మెన్ అశోక్ కలుగజేసుకొని రుణమాఫీ రాని రైతుల లిస్ట్ ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని రైతులను శాంతింపజేశారు. తాము రుణమాఫీకి అర్హులమైనప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన రైతులకు న్యాయం చేయకుంటే సంబంధిత మంత్రిని, సీఎంను కలవడానికైనా సిద్ధంగా ఉన్నామని రైతులు అంటున్నారు.

వ్యవసాయ కార్యాలయం ఎదుట బారులు

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలో రెండో విడతలోనూ రుణమాఫీ జరగని రైతులు శుక్రవారం వ్యవసాయ అధికారి కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంబంధిత శాఖ అధికారి మాత్రం రైతులకు అందుబాటులో లేరని, ఇదేంటని అడిగితే జిల్లా కేంద్రంలో సమావేశంలో ఉన్నానంటూ చెబుతున్నారని పుల్కల్ గ్రామానికి చెందిన రైతు బెస్త రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఆరేండ్ల నుంచి తనకు రైతుబంధు కూడా రావడం లేదని రైతు రాజు వాపోయాడు. ఈ విషయాన్ని పలుమార్లు వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటాం

● సభను అప్రతిష్టపాలు చేసే వారిపై కఠిన చర్యలు : శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

● శాసనసభలో శుక్రవారం మూడు బిల్లులకు ఆమోదం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాంతి భద్రతల విషయంలో తమ ప్రభుత్వం కటువుగా ఉంటుందని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సభను అప్రతిష్ట చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లును ఆయన సభలో ప్రతిపాదించారు. సభ్యులు లేవనెత్తిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్ర ఖ్యాతిని దెబ్బతీస్తే ఉపేక్షించబోమన్నారు. రాష్ట్రంలో సత్వర న్యాయం అందించేందుకు 30 ఫాస్ట్ ట్రాక్ కోర్టులుంటాయని చెప్పారు. కొత్త న్యాయ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. వాటికి సవరణలు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ ఒక పరిమితి వరకు బాగుంటుందనీ, శృతి మించకూడదని సూచించారు. సైబర్‌క్రైమ్ కేసుల్లో లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్న బాధితులకు సత్వర న్యాయం అందించేందుకుగానూ కొత్త చట్టాలను తీసుకొచ్చి అమలు చేస్తామన్నారు. శాసనసభ లైవ్ ప్రోసీడింగ్స్ వీడియోను మార్ఫింగ్ చేసి వాడిన విషయాన్ని మంత్రి పొన్నం సభ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై విచారణ జరుపుతామనీ, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లో హైకోర్టు కొత్త బిల్డింగ్‌కు వందెకరాల స్థలం, వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. కొత్తగా జిల్లా, సబ్ మెజిస్ట్రేట్ భవనాలను నిర్మిస్తామన్నారు. ఖాళీల భర్తీపై కసరత్తు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 8,91,598 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసులు ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందనీ, అలాంటివి జరగకుండా చూస్తామని హామీనిచ్చారు.

న్యాయపరమైన పోరాటాలు చేసేవారికి ఇబ్బందులు కలిగించబోమన్నారు. అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాసనసభలో అన్ని పక్షాల మద్దతుతో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ, తెలంగాణ శాసనముల, తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ బిల్లులు ఆమోదం పొందాయి.

నీట్ అవకతవకలపై ఎన్టీఏకు సుప్రీం చీవాట్లు

(మొదటిపేజీ తరువాయి)

సలహా మేరకు ఎన్‌టిఎ వీరికి మరోసారి పరీక్షను నిర్వహించడాన్ని తప్పు పట్టింది. అలాగే ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు రెండు సమాధానాలకు మార్కులు ఇవ్వాలని ఎన్టీఏ నిర్ణయించిన సంఘటనను తీర్పు ప్రస్తావించింది. తరువాత ఐఐటి (ఢిల్లీ) బృందం ఈ ప్రశ్నకు ఒక్క సమాధాన్నే గుర్తించింది. ఎన్టీఏ గ్రేస్ మార్కుల ఫలితంగా 44 మంది విద్యార్థులు 720 మార్కులకు 720 మార్కులు పొందిన విషయాన్ని కూడా తీర్పు గమనించింది. ఎన్టీఏ నిర్మాణ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని ఈ లోపాలను సరిదిద్దాలని తెలిపింది. పరీక్షా కేంద్రాలు పూర్తిగా సీసీటీవీ నిఘా, సమయ పర్యవేక్షణ, కార్యకలాపాల రికార్డింగ్ ఆవశ్యకతను కోర్టు ముఖ్యంగా ప్రస్తావించింది. వీటి ద్వారా అవకతవకలను గుర్తించడం, అరికట్టడం, సంఘటనలకు సంబంధించిన సాక్ష్యాలను అందించడంలను సాధించవచ్చునని తీర్పు తెలిపింది. నీట్ అక్రమాలపై దాఖలైన 40 వేరు వేరు పిటీషన్ల విచారణలో సుప్రీంకోర్టు ఈ తీర్పు వెల్లడించింది. 'వ్యవస్థాగత ఉల్లంఘన' లేదనే కారణంతో నీట్ యుజి-2024ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు ఇప్పటికే తిరస్కరించింది. నీట్‌తో సహా వివిధ పరీక్షల్లో లోపాలను గుర్తించడానికి జూన్‌లో కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో నిపుణులతో కూడిన హై పవర్ కమిటీని కేంద్ర విద్యా శాఖ ఏర్పాటు చేసింది.

డీఎస్పీలుగా మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ గౌరవం పెరుగుతుందని విద్యార్థులకు తెలిసేలా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రాడ్యుయేట్ అయిన నిఖత్‌కు గ్రూపు-1 ఉద్యోగం ఇవ్వడానికి ఎలాంటి ఆటంకాలు లేవన్నారు. ఇంటర్మీడియట్ వరకే చదువుకున్న సిరాజ్ విషయంలో అది ఆటంకంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో టీఎస్‌పీఎస్సీలో క్రీడాకారుల విషయంలో మినహాయింపులు ఇచ్చేలా ప్రత్యేక చట్టసవరణ తీసుకొచ్చామన్నారు. నిఖత్‌జరీన్‌కు 600 గజాల ప్లాట్ ఇచ్చామనీ, సిరాజ్‌కు కూడా కేటాయిస్తామని తెలిపారు.

17 శాతం పెరిగిన పన్నుల రాబడి

(మొదటిపేజీ తరువాయి)

పెరిగాయని నివేదిక వెల్లడించింది. సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగిందని పేర్కొంది. రూ.2,749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారని పేర్కొంది. 2022-23లో ప్రభుత్వ రుణాలు, అడ్వాన్స్‌లు 150 శాతం మేర పెరిగినట్లు పేర్కొంది. సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు తీసుకోవడం వల్ల రీపేమెంట్

కష్టంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బడ్జెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా వేసింది. ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించిందని వెల్లడించింది. ఏపీ నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు రాలేదని తెలిపింది. ఇండ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌పామ్ పథకాల నిధులు ఖర్చు కాలేదని పేర్కొంది. దళితబంధు, రుణమాఫీ పథకాలకు కేటాయింపులే తప్ప ఖర్చు కాలేదని అని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

రుణాల సేకరణలో నిబంధనలకు తూట్లు

రాష్ట్ర ప్రభుత్వం సొంత రాబడి లేని సంస్థలు, ప్రాజెక్టుల పేర ఇష్టారాజ్యంగా రుణాలు తీసుకున్నదని కాగ్ వెల్లడించింది. కాళేశ్వరం, మిషన్ భగీరథకు తీసుకున్న రుణాలు రాష్ట్రానికి భారంగా మారాయని పేర్కొంది. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన పరిమితి కన్నా 6 శాతం ఎక్కువ రుణాలను గత ప్రభుత్వం తీసుకున్నట్టు వెల్లడించింది. ఎస్సీ అభివృద్ధి నిధుల్లో 58శాతం, ఎస్టీ డెవలప్‌మెంట్ నిధుల్లో 38శాతం వినియోగం కాలేదని వెల్లడించింది. వాటిని ఇతర ఖర్చులకు దారి మళ్లించారని తెలిపింది. సొంత ఆదాయం కంటే, రుణాలపైనే ఎక్కువగా గత ప్రభుత్వం ఆధారపడిందని పేర్కొంది.. ఇప్పుడున్న రుణాలు తీర్చేందుకు రానున్న పదేండ్లలో రూ. 2.86 లక్షల కోట్లు సమీకరించాల్సి ఉందని కాగ్ స్పష్టం చేసింది.

గుదిబండగా మారిన కాళేశ్వరం

రాష్ట్ర ఆర్థిక రంగానికి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పెనుభారంగా మారనుందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. 2022 మార్చి వరకు ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.96,064 కోట్ల రుణం తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిందనీ, ఇందులో 2022 మార్చి నాటికి రూ.87,449.15 కోట్లు తీసుకుందని పేర్కొంది. 2035-36 నాటికి వడ్డీతో కలిపి రూ.1,41,544.59 కోట్లు తిరిగి చెల్లించాలని వివరించింది.

కాళేశ్వరం పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభమై అనుకున్న ప్రకారం నీటిని ఎత్తిపోస్తే కరెంటు చార్జీల కింద ప్రభుత్వం ఏటా రూ.10,374.56 కోట్ల చొప్పున రాబోయే పదేండ్లలో దాదాపు రూ.1,24,495 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని కాగ్ తెలిపింది. సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగిందని వివరించింది.

తొలి త్రైమాసికంలో పన్ను ఆదాయం

"రాష్ట్ర పన్ను ఆదాయం తొలి త్రైమాసికంలో దాదాపు రూ.3వేల కోట్లు పెరిగింది. మొదటి 3నెలల్లో పన్నుల ద్వారా రూ.34వేల కోట్లకుపైగా ఆదాయం రాగా మొత్తం రెవెన్యూ రాబడులు రూ.35వేల కోట్లకుపైగా ఉన్నాయి. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఒక్క పైసా కూడా రాలేదు. జూన్ నెలాఖరు వరకు ప్రభుత్వం రుణాల ద్వారా రూ.13 వేల కోట్లు సమీకరించుకుంది. ఆర్థిక సంవత్సరం మొదటి 3 నెలల్లో ప్రభుత్వం రూ.45వేల కోట్లకుపైగా ఖర్చు చేసింది" అని కాగ్ పేర్కొంది.

గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రాష్ట్రానికి పన్నులరూపంలో వచ్చే ఆదాయం పెరిగిందని వెల్లడించింది. తెలంగాణ వాటాగా కేంద్ర పన్నుల నుంచి రూ.3,635 కోట్లు, ఇతర పన్నుల ద్వారా మరో రూ.1,998 కోట్లు సమకూరాయని పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎఫ్ఆర్బీఎం పరిధికి లోబడి ప్రభుత్వం రూ. 13,180 కోట్ల రుణాలు తీసుకొందని వెల్లడించింది. దీంతో ఖజానాకు మొత్తం రూ. 48,790 కోట్లు చేరగా, జూన్ నెలాఖరు వరకు రూ. 45,320 కోట్లు ఖర్చు చేసిందని కాగ్ తన నివేదికలో చెప్పింది.

నిధుల ఖర్చులో జాప్యం

2022-23లో కొన్ని పథకాలకు పైసా ఖర్చు చేయలేదని కాగ్ వెల్లడించింది. రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం కోసం రూ. 11,000 కోట్లు, గొర్రెలు, మేకల పథకానికి రూ. 1,000 కోట్లు, ఆయిల్ పామ్ సాగుకు రూ. 1,000 కోట్ల కేటాయించినా, వాటిని ఖర్చు చేయలేదని పేర్కొంది. దళిత బంధు వంటి ప్రధాన పథకాలపై భారీ కేటాయింపులు చేసినా అందులో 10 శాతం కూడా ఖర్చు చేయలేదని వెల్లడించింది. రైతులకు రుణమాఫీ కోసం కేటాయించిన రూ. 3,964 కోట్లలో మొత్తం నిధులు అలాగే ఉన్నాయని తెలిపింది. వార్షిక ఖాతాల సమర్పణలో కొన్ని సంస్థలు వెనకబడ్డాయనీ, 29 అటానమస్ బాడీలు తమ వార్షిక ఖాతాలను సమర్పించలేదని తెలిపింది. దీనిపై వివరణ కోరినట్లు కాగ్ తన రిపోర్ట్‌లో స్పష్టం పేర్కొంది.

టీచర్లే బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటిపేజీ తరువాయి)

సీఎం మాట్లాడుతూ 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారనీ, తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందని అనుకున్నామనీ, ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందని భావించామని చెప్పారు. కోదం దరాం, చుక్కా రామయ్య హరగోపాల్ లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని ఆశించామని

చెప్పారు. కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు ఉపాధ్యాయులను ఏ విధంగా అవమానించారో చూశామని సీఎం వ్యాఖ్యానించారు.

బడ్జెట్‌లో 7.3 శాతం నిధులు

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించామనీ, కానీ ప్రభుత్వ హామీలు, ఇతర శాఖల పనుల దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా ఇచ్చినట్టు సీఎం చెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారనీ, 10వేల ప్రయివేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ప్రయివేటు పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. నేను టీచర్లనే తప్పుబట్టలేను..మా ప్రభుత్వ లోపాలు కూడా ఉండొచ్చనీ, విద్యార్థులు, మహిళా టీచర్లకు కనీసం టాయిలెట్స్ కూడా అందుబాటులో లేని స్కూళ్లు ఉన్నాయని అన్నారు.

తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజమన్నారు. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తేనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.



పదిహేనేండ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించామనీ, మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు.

తెలంగాణ భవిష్యత్ మీ చేతుల్లో..

తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు, మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం పెట్టామనీ, అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ చెప్పారు. టీచర్లంతా 90శాతంపైగా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు విద్యనందించాలనీ, గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని సూచించారు. పేద విద్యార్థులను డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దాలనీ, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లుగా మార్చాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. 20 ఏండ్లుగా భాషా పండితులకు పదోన్నతులు లేవన్నారు. ఈసారీ 25 వేల మందికి ప్రమోషన్లు, 35 వేల మందిని ట్రాన్స్‌ఫర్లు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించామని ముఖ్యమంత్రి చెప్పారు. మీ జీతాలను స్కూళ్ల కోసం ఖర్చుపెట్టొదనీ, ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, నరోత్తంరెడ్డి, ఏవీఎన్ రెడ్డితోపాటు మోహన్‌రెడ్డి కూడా ఉపాధ్యాయుల సమస్యలపై తనతో ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటారని అన్నారు. ఒకనాడు చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య కిరణ్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయ నాయకులకు విలువనిచ్చేవారనీ, గత పదేండ్ల కాలంలో అది లేదన్నారు.

అసెంబ్లీలో ఒకాయన..

అసెంబ్లీలో ఒకాయన నన్ను ఏడ చదివారంటూ వెటకారం చేశారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈస్థాయికి వచ్చానని సీఎం అన్నారు. నేను కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో, తాండ్ర హైస్కూల్, వనపర్తి జెడ్పీ హైస్కూల్‌లో, గవర్నమెంటు జూనియర్ కాలేజీలో చదువుకున్నానని సమాధానం చెప్పినట్టు తెలిపారు. ప్రభుత్వ టీచర్లు చెప్పిన చదువుతోనే జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యానని అన్నారు. మీ మీద నమ్మకం లేక గుంటూరు పోయి వాళ్ల చదువు కోవచ్చు..నాకు మీ మీద పూర్తినమ్మకముందన్నారు.

. దశాబ్దం తర్వాత టీచర్లకు ప్రమోషన్లు పొన్నం ప్రభాకర్ గౌడ్

దాదాపు దశాబ్ద కాలం తర్వాత టీచర్లకు ప్రమోషన్లు వచ్చాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పేదలకు చదువుకునే అవకాశం కలిగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచాలని కోరారు.

పండుగరోజు :కోదండరామ్

టీచర్లకు భారీస్థాయిలో ప్రమోషన్లు ఇవ్వడంతో పండుగ వాతావరణం నెలకొందని కోదండరామ్ అన్నారు. జీవితకాలంలో ఒక్క ప్రమోషనైనా పొందాలని ఆశించడం తప్పుకాదన్నారు. 2014 నుంచి ఎదురుచూస్తున్నామని చెప్పారు. హెల్త్‌కార్డులు అవసరం ఉందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత టీచర్లదేననీ, తద్వారా మెరుగైన ఫలితాలు తీసుకురా వాలన్నారు. ఇది మన కర్తవ్యమన్నారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వాగతోపన్యాసం చేస్తూ అన్ని వృత్తులోకెల్లా ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇవి నరసింహ్మారెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు , ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కార్యదీక్షతో పనిచేయాలి..

అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పని చేయాలనీ, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రగ్స్‌ను నిరోధించేందుకు విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహిం చేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తామనీ, మీరు నేర్పే విద్యే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలనీ, అందుకు ఇక్కడ ప్రతిజ్ఞ చేయాలని సీఎం సూచించారు.

ఈహెచ్‌ఎస్ రేట్లను పెంచాలి

అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) రేట్లను పెంచాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. శుక్రవారం శాసనమండలిలో నర్సిరెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కోసం అమలు చేస్తున్న ఈహెచ్‌ఎస్ సమస్య లపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఈహెచ్‌ఎస్ రేట్లు 15 ఏండ్ల క్రితం నిర్ణయించినవని గుర్తుచేశారు. ఈహెచ్‌ఎస్‌లో అత్యధికంగా రూ.2 లక్షలిస్తే, కార్పొరేట్ ఆస్పత్రులు ఐదారు లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగం కంటే ప్రయివేటు వైద్యరంగం ఎక్కువగా విస్తరించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ వ్యవస్థ నియంత్రించడం, చికిత్సల ధరలను ప్రభుత్వమే నిర్ణయించడం అవసరమని అభిప్రాయపడ్డారు. 2010 క్లినికల్ ఎస్టాబ్లిష్ చట్టం రాష్ట్రంలో అమలు చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. పీసీపీఎన్‌డీటీ, ఏఆర్టీ, ఫుడ్‌సేఫ్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పోలీసులందరినీ ఒకే వేదికగా ఏకరూపకంగా తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం ఏఆర్ఆర్, సివిల్ తదితర పేర్లతో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ, వక్ఫ్‌బోర్డు ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు. లేకపోతే అన్యాక్రాంతమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. బీఆర్ఎస్ సభ్యురాలు వాణిదేవి మాట్లాడుతూ, బాలికలపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే విలువలతో కూడిన విద్య బోధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వాలు మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ సభ్యులు తాత మధు మాట్లాడుతూ, అవివాహిత గర్భిణుల గర్భవిచ్ఛిత్తి (అబార్షన్స్) పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టవిరుద్ధంగా జరుగుతున్న వీటిపై వైఖరి మారాలని కోరారు.

సీఎం సభ్యత్వం ఉంటుందో.. ఊడుతుందో

- సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలి : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లి వచ్చేసరికి ఆయన సభ్యత్వం ఉంటుందో ఊడుతుందో చూసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించిన సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు అవుతుందో.. లేదో కానీ, సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లి వచ్చే వరకు ఆయన సభ్యత్వం రద్దయ్యేలా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల మంత్రులు.. రేవంత్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేసేలా ఉన్నారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీలో తనకు మైక్ ఇవ్వడం లేదన్నారు. సీఎం బెదిరిస్తే భయపడే వారెవరూ లేరన్నారు. హుజురాబాద్ ప్రజలకు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలన్నారు. హుజురాబాద్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగితే ప్రభుత్వం స్పందించలేదన్నారు. తన వేతనం నుంచి రూ.4లక్షలు వారికి ఇచ్చినట్టు తెలిపారు. హుజురాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా వారిని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్సీ స్థానాల భర్తీ అంశంపై...

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ గవర్నర్
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ అంశంపై రాష్ట్ర గవర్నర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణల నామినేషన్లను తిరస్కరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు గత గవర్నర్ రాధాకృష్ణన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత నెల 29వ తేదీ సాయంత్రం గవర్నర్ ఆఫీసు తరపు అడ్వకేట్ డి మహేశ్ బాబు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేశారు. ఇందులో ఐదుగురిని ప్రతివాదులుగా చేర్చారు.

దాసోజు శ్రవణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కోదండ రాం, అమిర్ అలీఖాన్‌లను రెస్పాండెంట్ లుగా మెన్షన్ చేశారు. కాగా బీఆర్ఎస్ సర్కార్ హయాంలో దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేసింది. అయితే ప్రభుత్వం సిఫారసు చేసిన ఈ ఇద్దరు నేతలకు రాజకీయ నేపథ్యం ఉన్నదంటూ ఆనాటి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరించారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

సీఎం రేవంత్ రెడ్డి క్యాబినేట్ ఖాళీగా ఉన్న ఈ స్థానాలకు కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను ప్రతిపాదించి, గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఈ సిఫారసును గవర్నర్ వెంటనే ఆమోదించడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ అంశంపై మరోసారి దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్ల పై రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుదీర్ఘ వాదనలను పరిగణనలోకి తీసుకొని దాసోజు, కుర్ర సత్యనారాయణకు సానుకూలంగా తీర్పును వెలువరించింది.

దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణల నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. అలాగే.. కొత్తగా ఎమ్మెల్సీగా కోదండరాం, అలీఖాన్లను నియమించాలనే తీర్మానంతోపాటు వాళ్లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది.

ఇదిలా ఉంటే... సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన గవర్నర్ రాధాకష్ణన్ వేరే రాష్ట్రానికి వెళ్లగా.. తెలంగాణకు కొత్త గవర్నర్ గా జిష్ణు దేవ్ వర్మ వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ కేసు వ్యవహారం ఎటువైపు వెళ్తుందో వేచి చూడాలి. పాత గవర్నర్ పిటిషన్‌ను... కొత్త గవర్నర్ కొనసాగిస్తారా? అన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

రచ్చ.. రచ్చ...

రెచ్చగొట్టిన కౌశిక్.. రెచ్చిపోయిన దానం

- సభలో దుర్భాషల పర్వం
- రాయలేని భాషలో తిట్టుకున్న సభ్యులు
- ముక్కున వేలేసుకున్న పాత్రికేయులు, సందర్శకులు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రచ్చ.. రచ్చ.. అరాచకం.. గందరగోళం... బీఆర్ఎస్ సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి రెచ్చగొట్టిన వేళ, కాంగ్రెస్ సభ్యుడు దానం నాగేందర్ రెచ్చిపోయిన సందర్భంలో రాష్ట్ర శాసనసభలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనలివి. మనం వినలేని భాషలో, రాయలేని భాషలో వారు బూతులు తిట్టుకుంటుంటే... 'హవ్వా... వీరా మన ప్రజా ప్రతినిధులు...' అనుకోవాల్సిన దుస్థితి. సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేసిన అనంతరం, దానిపై చర్చకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పట్టుబట్టింది. ప్రతిగా డిప్యూటీ సీఎం స్పందిస్తూ... 'ఒక మంత్రి ప్రకటన చేసిన తర్వాత దానిపై చర్చ ఉండబోదనీ, కావాలంటే అసెంబ్లీ రూల్ పొజీషన్ చూసుకోవచ్చని' సూచించారు. అనంతరం ఆయన శాసన మండలికి వెళ్లిపోయారు. అయినా పట్టువీడని బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, పల్లా రాజేశ్వరరెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద తదితరులు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి, ఆయనతో వాగ్వాదానికి దిగారు. జాబ్ క్యాలెండర్‌పై మాట్లాడేందుకు తమకు అవకాశమివ్వాలంటూ కోరారు. దీనికి స్పీకర్ నిరాకరించటంతో వారు వెల్‌లోనే నిలబడి నినాదాలు చేయటం ప్రారంభించారు. ఈ దశలోనే



స్పీకర్... హైదరాబాద్ నగర అభివృద్ధిపై చర్చను చేపట్టారు. ఈ అంశంపై మాట్లాడాల్సిందిగా దానం నాగేందర్‌కు సూచించారు. ఆయన మాట్లాడుతున్న క్రమంలో స్పీకర్ పోడియం వద్దనున్న పాడి కౌశిక్ రెడ్డి...దానం నాగేందర్ వైపు తిరిగి దుర్భాషలాడారు. 'ఏ పార్టీ నుంచి గెలిచి, ఏ పార్టీకి అనుకూలంగా మాట్లాడుతున్నవ్... బయటకు రా చూసుకుందాం...' అంటూ రాయలేని భాషలో బూతుపురాణం లంకించుకున్నారు. స్పీకర్ ఆయన్ను వారించేందుకు ప్రయత్నించినా కౌశిక్ ఆగలేదు. పక్కనున్న కేటీఆర్, ఇతర సభ్యులు వద్దని చెప్పినా వినకుండా అదే పనిగా దానంను ఉద్దేశించి కామెంట్లు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన దానం కూడా...'తనదైన శైలిలో' బూతులు అందుకున్నారు. దీంతో మరింత దూకుడును ప్రదర్శించిన కౌశిక్ రెడ్డి, సీరియస్‌గా స్పీకర్ పోడియం వద్ద నుంచి దానం స్థానం వైపునకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు.

దానం కూడా తన సీటు నుంచి ముందుకు కదిలారు. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ సభ్యులు... కౌశిక్ రెడ్డిని గట్టిగా పట్టుకుని నిలువరించారు. మరోవైపు పలువురు కాంగ్రెస్ సభ్యులు దానం వద్దకు చేరుకుని ఆయన్ను ముందుకు



కదలకుండా ఆపేశారు. ఓ ఐదు నిమిషాలపాటు ఈ రభస కొనసాగిన అనంతరం ప్రధాన ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బయటకు వెళ్లిపోయారు. అనంతరం జోక్యం చేసుకున్న ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ... దానం మాట్లాడిన మాటలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయనీ, ఆయన వాడిన భాష ఆక్షేపణీయమని అన్నారు. అవన్నీ రికార్డయ్యాయనీ, టీవీల్లో లైవ్ టెలికాస్ట్ అయ్యిందని తెలిపారు. ఇలాంటి చర్యల ద్వారా బయట ఉన్న ప్రజలకు శాసనసభ్యులుగా ఏం సందేశం పంపుతున్నారని నిలదీశారు. దానం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలనీ, సభకు క్షమాపణలు చెప్పాలని కోరారు. దానం మాట్లాడుతూ... 'ఎవ్వరినీ కించపరిచే ఉద్దేశం నాకు లేదు, హైదరాబాద్‌లో సాధారణంగా వాడే భాషనే, పదాలనే నేను వాడా. వాటి వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే మన్నించండి...' అని అన్నారు. అసెంబ్లీ గ్యాలరీ నుంచి ఈ తతంగాన్నంతటినీ వీక్షించిన పాత్రికేయులు, సందర్శకులు సభ్యుల ప్రవర్తనను చూసి ముక్కున వేలేసుకున్నారు.

ముందస్తు హెచ్చరికలు తూచ్..

అమిత్ షా మాటలన్నీ అసత్యాలే

- ఐఎండీ డేటా విశ్లేషణతో బయటపడ్డ మోడీ సర్కార్ బండారం
- జాతీయ విపత్తుగా ప్రకటించకుండా మోసం

న్యూఢిల్లీ : కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలాది మంది సజీవ సమాధి అయిన విషాద ఘటన నేపథ్యంలో కొండచరియల విపత్తుల గురించి ముందుగానే కేరళను హెచ్చరించామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ నేతలు పార్లమెంటు లోపల, వెలుపలా చెబుతున్నవన్నీ అసత్యాలేనని తేలిపోయింది. ఇటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశాలపై ముందుగానే హెచ్చరించే వ్యవస్థలు దేశంలో ఎలా పనిచేస్తున్నాయో అవి కేరళ ప్రభుత్వాన్ని ఎలా అప్రమత్తం చేశాయో షా వివరించినతీరు ఆసాంతం పచ్చి బూటకమని స్పష్టమైంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డేటా విశ్లేషణలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపత్తు సమయంలోనూ ఎంతటి మోసానికి తెగబడిందో ఇట్టే అర్థమవుతుంది. విపత్తు ముందు, తర్వాత ఐఎండీ జారీ చేసిన హెచ్చరికలు ఏమిటీ? అమిత్ షా చెబుతున్న మాటల్లో నిజమెంత? అనే అంశాలను నిగ్గు తేల్చుతూ వాతావరణ రంగ నిపుణుల విశ్లేషణలతో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ద హిందూ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ వివరాలు..

అమిత్ షా చెప్పిందేమిటీ?

"కేరళ పశ్చిమ తీర ప్రాంతంలో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం పడుతుందని జులై 18న హెచ్చరికలు జారీ అయ్యాయి. జులై 23న భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని మళ్లీ హెచ్చరికలు వెలువడ్డాయి. జులై 25న మరింత నిర్దిష్టంగా ఈ హెచ్చరిక జారీ అయింది." అని షా లోక్‌సభలో చెప్పారు.

సాక్ష్యాధారాలతో తిప్పికొట్టిన కేరళ ముఖ్యమంత్రి

షా వ్యాఖ్యల నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ, కొండచరియలు విరిగిపడే అవకాశాల గురించి అలర్ట్‌లు జారీ చేసే బాధ్యత కలిగిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నదుల వరదలకు సంబంధించి అలర్ట్‌లు జారీ చేసే కేంద్ర జల సంఘం, ఐఎండి ఇవేవీ కూడా ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని స్పష్టం చేశారు. పైగా వయనాడ్ జిల్లాకు ఎక్స్‌పెరిమెంటల్ రెయిన్‌ఫాల్ ఇండ్యూస్డ్ లాండ్‌స్లైడ్ ఫోర్‌కాస్ట్ బులెటిన్" అన్న టైటిల్‌ను కూడా ఆయన షేర్ చేశారు. రెండు రోజుల కోసం దీన్ని జులై 29న జారీ చేశారు. కొండచరియలు విరిగిపడే అవకాశాలు చాలా తక్కువగా వున్నాయని ఆ బులెటిన్ అంచనా వేసింది.



అమిత్ షా ప్రకటన నేపథ్యంలో ఈ సమాచారాన్ని ప్రస్తుతం పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో లేకుండా



చేశారు.

పైగా లోక్‌సభలో అమిత్ షా మాట్లాడుతూ, 2014కు ముందు, ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు, సహాయక, పునరావాస చర్యలకు స్పందించేందుకు ఒకే ఒక వ్యవస్థ వుండేదని చెప్పారు. కానీ అది నిజం కాదు. భారతదేశం 2012లో నేషనల్ మాన్‌సూన్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. దేశ రుతుపవనాలకు సంబంధించిన అంచనాలను మరింత మెరుగైన రీతిలో ఇచ్చేందుకు దీన్ని రూపొందించారు. 2017లో ఈ మాన్‌సూన్ మిషన్ మొదటి దశ పూర్తయింది. రెండో దశ కూడా ప్రారంభమైంది. వ్యవసాయం, ఇంధన,. జల వనరుల రంగాల్లో రుతుపవనాల అంచనాల ఆధారంగా వాతావరణ తీవ్రతలను అంచనా వేసేందుకు రెండో దశ ను కూడా 2017లో ప్రారంభించారు.

ఐఎండీ చెప్పిందేమిటీ?

జులై 19 ఉదయం 11.30గంటల లోపు కేరళలోని ఉత్తర ప్రాంతాల్లో ఆకస్మిక వరద ముప్పు అవకాశం వుందంటూ జులై 18న భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒక ప్రకటన జారీ చేసింది. అదే రోజు మరో హెచ్చరిక జారీ చేస్తూ జులై 18 నుండి 31 వరకు మరిన్ని ప్రాంతాలకు ఈ ముప్పు పొంచి వుందని పేర్కొన్నారు. అయితే అందులో ఎక్కడా కూడా కేరళ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.

- కేరళలో 25వ తేదీన అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందంటూ (చర్యలకు సూచిస్తూ) జులై 23న ఐఎండీ మరో పత్రికా ప్రకటన జారీ చేసింది. జులై 23-27 మధ్య కాలంలో కేరళ, మహే (పుదుచ్చేరి)ల్లో కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొంది. ఈ ముందస్తు హెచ్చరికల పేరుతో సబ్ డివిజన్‌ల వారీగా వాతావరణ హెచ్చరికలు చేస్తూ కేరళకు జులై 25కి ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు.

- జులై 23, 24, 26, 27 తేదీల్లో ఎల్లో వాచ్ అలర్ట్ జారీ చేశారు. ఎల్లో అలర్ట్ జారీ చేయడమంటే నిర్దిష్టంగా కార్యచరణ చేపట్టాలని పిలుపివ్వడం కాదు.

"చెదురు మదురుగా నుంచి విస్తృతంగా, తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షపాతం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం రాబోయే ఐదు రోజుల్లో కేరళ, మహే, ఇతర ప్రాంతాల్లో పడే అవకాశం వుంది. జులై 25-29 మధ్య కాలంలో కేరళ, మహేల్లో అక్కడక్కడా భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందని హెచ్చరిస్తూ జులై 25న జారీ చేసిన పత్రికా ప్రకటన పేర్కొంది. దృశ్యరూపంలో జారీ చేసిన హెచ్చరికల్లో కూడా కేరళకు ఎల్లో అలర్ట్ చూపించారు. జులై 25 నుండి ఆగస్టు 7 వరకు ఇదే తరహాలో పరిస్థితి వుండవచ్చని కూడా హెచ్చరించారు.

- జులై 29న కేరళ, మహేల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందంటూ ఐఎండి ఆరంజ్ అలర్ట్ జారీ చేసింది. జులై 30 తెల్లవారు జామునే కొండచరియలు విరిగి పడి వందలాదిమంది మరణించారు.

- కొండచరియలు విరిగిపడిన తర్వాతే, జులై 30కి రెడ్ అలర్ట్ జారీ చేస్తూ 1.10గంటల సమయంలో పత్రికా ప్రకటన చేశారు. ఈ పత్రికా ప్రకటనలో కూడా జులై 31, ఆగస్టు 1వ తేదీలకు కేరళ, మహేలకు ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు.

- భారీ వర్షాలు పడి, కొండచరియలు విరిగిపడిన రోజు జులై 30న వాయనాడ్ జిల్లాలో 15మిల్లీమీటర్ల వర్షపాతం పడుతుందని పేర్కొంటూ జులై 23న ఒక ఫోర్‌కాస్ట్ జారీ చేశారు. ఐఎండీ పూనే వ్యవసాయ వాతావరణ విభాగం ఈ అంచనాలను జారీ చేసింది. ఐఎండి వర్గీకరణ ప్రకారం 15మి.మీ వర్షపాతం అంటే అది ఆందోళన చెందే అంశమే కాదు.

- కేరళకు సాధారణ వర్షపాతాన్ని మించి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందని తిరువనంతపురంలోని ఐఎండి కేంద్రం జులై 25న మరో హెచ్చరిక జారీ చేసింది. జులై 26 నుండి ఆగస్టు 1 మధ్యలో ఈ పరిస్థితి సంభవించే అవకాశం వుందని పేర్కొంది. అంతేకానీ ఆందోళనలు చెందే అవకాశాల గురించి హెచ్చరించలేదు. ఆగస్టు 2 నుంచి 8 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని కూడా అంచనా వేసింది.

- జులై 26న తిరువనంతపురం వాతావరణ కేంద్రం జారీ చేసిన అంచనాల ప్రకారం జులై 30న వాయనాడ్ జిల్లాలో తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షపాతం నమోదువుతుందని పేర్కొంది.

- కానీ 20సెంటిమీటర్లకు మించి వర్షపాతం, కొండచరియలు విరిగిపడే అవకాశం వుందని జులై 26నే కేరళకు హెచ్చరికలు జారీ చేశామని అమిత్ షా రాజ్యసభలో చెప్పారు. కానీ ఐఎండి ఆ రోజు జారీ చేసిన ప్రకటనలో అటువంటి హెచ్చరికలేమీ లేవు.

సీఎంకు అభినందనల వెల్లువ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ఆయనకు పలువురు ఎమ్మెల్యేలు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంకు గల్ఫ్ కార్మికుల వినతి

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలంటూ టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ గల్ఫ్ కన్వీనర్ బీఎం వినోద్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ సీఎంకు వినతిపత్రం సమర్పించారు. డిసెంబర్ 7, 2023 తర్వాత గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంను కలిసిన ఆనంద్ మహీంద్రా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మహీంద్రా గ్రూప్, మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్, టెక్ మహీంద్రా లిమిటెడ్ చైర్మెన్ ఆనంద్ మహీంద్రా మర్యాదపూర్వక భేటీ అయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో మహీంద్రా గ్రూప్ పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని అడాప్ట్ చేసుకునేందుకు అంగీకరించారు.

ఆర్డినెన్స్‌కు అంత తొందరెందుకు?

ముందు జనాభా లెక్కలు తేల్చండి

ఎస్సీ వర్గీకరణ న్యాయమే

మాలలకు అన్యాయం చేయొద్దు : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ కోసం అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకుందని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మాట్లాడాలని చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చర్చకు అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ముందుగా ఎస్సీల జనాభా లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీల వర్గీకరణ న్యాయమైనదేననీ, అయితే ఆ పేరుతో మాలలకు అన్యాయం చేయొద్దని కోరారు. తెలుగుదేశం పార్టీ వర్గీకరణ పేరుతో గతంలో మాలల జనాభా కన్నా తక్కువ శాతం రిజర్వేషన్ ఇచ్చి అన్యాయం చేసిందని విమర్శించారు. మాలలను, వారి ఉప కులాల నుంచి వేరుగా చూపించి తక్కువ శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. రాష్ట్రంలో మాదిగలు 40 లక్షల మంది ఉంటే, మాలలు 30 లక్షల మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మాల, మాదిగల జనాభాలో ఐదు శాతమే తేడా ఉందనీ, ఈ విషయంలో దళిత మేధావి విశారదన్ లాంటి వారు బాగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఎస్సీల వర్గీకరణ సంక్లిష్టమైనదనీ, అయితే న్యాయమైందని అభిప్రాయపడ్డారు.

మూడు వేల ఏండ్ల నుంచి భారత సమాజం వర్ణవ్యవస్థ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థతో నిండి ఉందని గుర్తుచేశారు. చుండూరు, లక్ష్మీపేట, కారంచేడులో ఏం జరిగిందో ఇప్పటికీ తెలియదనీ, దోషులకు ఎందుకు శిక్ష పడలేదని ప్రశ్నించారు. వీటికి సమాధానం చెప్పకుండా పీడిత కులాల మధ్య సమస్య వచ్చే సరికి సహా అందరూ చప్పట్లు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలు అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు.

రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు సంతోషకరమైన వార్త అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాదిని ఏర్పాటు చేసి సహకరించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురైనా త్యాగాలకు వెరవక పోరాడిన వర్గీకరణవాదుల డిమాండ్‌లోని హేతుబద్ధతను సుప్రీంకోర్టు అర్థం చేసుకుందని తెలిపారు. తాను శాసనసభ స్పీకర్‌గా ఉన్న సమయంలో వర్గీకరణ కోసం అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మాదిగలకు ఊరటనిచ్చిందని చెప్పారు. వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అభినందనలు తెలిపారు. ఎంఐఎం సభ్యులు మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి సుప్రీం తీర్పును స్వాగతించారు.

ఐక్యంగా ముందుకు రావాలి : అలుగుబెల్లి నర్సిరెడ్డి

అట్టడుగు కులాల మధ్య కొన్ని వ్యత్యాసాలున్నాయనీ, దానితో ఉద్యమాలు జరిగాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఆ వర్గాలు ఘర్షణ పడకుండా సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలకు వ్యతిరేకంగా పోరాటంలో ముందుకు రావాలని సూచించారు. వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు.

రికార్డ్స్ ఆఫ్ రైట్స్- 2024లో కీలకాంశాలు

- భూమాతగా పేరు మారనున్న ధరణి
- రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో భూ సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు ఏర్పాటు చేసిన ధరణి కమిటీ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రికార్డ్స్ ఆఫ్ రైట్స్- 2024 పేరిట ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. ఈ నెల 2 నుంచి 23 వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు సేకరించేందుకు సీసీఎల్ఏ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించిన తర్వాత ఇందులో మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తారు. అనంతరం రానున్న శాసన సభ సమావేశాల వరకు ఈ ముసాయిదా భూ మాతగా చట్ట రూపం దాల్చనుందని సమాచారం.

ధరణి తర్వాత పెరిగిన సమస్యలు

ధరణి పోర్టల్‌లో పస్తుతం 1 నుంచి 33 వరకు టెక్నికల్ మాడ్యూల్స్ (టీఎం) ఉన్నాయి. ఈ పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, ధరణి వచ్చాక ఆ సమస్యల సంఖ్య 130కి పెరిగిందని భూ సమస్యల పరిశీలకులు పేర్కొంటున్నారు ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక కాగితాలపై ఉన్న రికార్డులు కంప్యూటర్‌కు ఎక్కాయి. కాగితాల్లో ఉన్నప్పుడు తప్పుల సవరణ గ్రామ, మండల స్థాయిలో జరిగేది. ధరణి వచ్చాక సవరణలు జిల్లా, రాష్ట్ర స్థాయికి చేరాయి. భూ రికార్డుల నిర్వాహణ ప్రయివేటీకరణ అయ్యింది. గతంలో భూ రికార్డులు ప్రభుత్వం దగ్గర, పట్టాదారుని దగ్గర మాత్రమే ఉండేవి. ఇప్పుడవి ప్రయివేట్ వ్యక్తులు, కంపెనీల చేతుల్లోకి వెళ్లాయి. భూ రికార్డుల్లో ఏ మార్పు చెయ్యాలన్నా నోటీసులు, విచారణ చేసేవారు. కాని ఇప్పుడు మాత్రం ఏ ఉత్తర్వులు లేకుండానే మార్పులు జరుగుతున్నాయి. కోర్టులు చెప్పినా కూడా ఉత్తర్వులు ఇవ్వకుండానే మార్పులు చేస్తున్నారు. వీటన్నింటికి ముసాయిదా బిల్లులో పరిష్కారాలు పేర్కొన్నారు.

రికార్డ్స్ ఆఫ్ రైట్స్- 2024 ముసాయిదా కీలకాంశాలు

1).రికార్డుల తయారీ, దిద్దుబాటు, నిర్వహణ అన్ని భూముల్లో హక్కులు
5. అమ్మకం, బహుమతి, తనఖా, మార్పిడి సందర్భాల్లో మ్యుటేషన్
6. నమోదుకాని లావాదేవీల క్రమబద్ధీకరణ
7. విభజన, వారసత్వం విషయంలో మ్యుటేషన్
8. ఇతర సందర్భాలలో మ్యుటేషన్
9. భూధార్
10. పట్టాదార్ పాస్ బుక్ కమ్ టైటిల్ డీడ్
11. హక్కుల రికార్డుల్లో ఎంట్రీల ఖచ్చితత్వం
12. హక్కుల రికార్డు కాపీలు
13. గ్రామ ఖాతాల్లో నమోదు ప్రక్రియ
14. భూ సమస్యలపై అప్పీల్
15. సమస్యలపై పునర్విచారణ, నిర్ణయాలు
16. అప్పీల్, రివిజన్ అధికారుల అధికారాలు
17. ట్రిబ్యునళ్ల అధికార పరిధి
18. నియమాలను రూపొందించే అధికారం

జాబ్ క్యాలండర్ ప్రకటించడం దేశంలోనే రికార్డు

- కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి నూరి కృష్ణ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ కేలండర్ ప్రకటించడం దేశంలోనే రికార్డు అని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులు గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మోసానికి, దగాకు గురయ్యారన్నారు. గత ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క ప్రకటించారని అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదలతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పుపై నల్గొండ నరేందర్ హర్షం



నవతెలంగాణ-అంబర్‌పేట

దీర్ఘకాలిక పోరాటం వేలాది మంది ఆరాటం వందలాది మంది బలిదానాలు దశాబ్దాలుగా సాగిన ఉద్యమం వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అట్టడుగున ఉన్న దళిత వర్గాలలో ఒక ఆశా కిరణంగా వెలిగిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ అంబర్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకులు నల్గొండ నరేందర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో స్వీట్స్ పంచి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల యాదగిరి,వంగూరి ఉపేందర్,భూపతి కుమార్ సంజీవ, తదితర నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

- నగరంలో జానాభాకు అనుగుణంగా బస్సులు పెంచాలని డిమాండ్



నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ జనాభాకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఐ(ఎం) ముషీరాబాద్ కార్యదర్శి ఎం దశరథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి బస్ స్టాప్ దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదని, నగర ప్రజలు నిత్యం ట్రాఫిక్ రద్దీతో, కాలుష్య సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్నారని తెలిపారు. రోడ్ల వెడల్పు ఫ్లైఓవర్‌లు నిర్మించినప్పటికీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. నగరంలో ప్రయాణికుల సంఖ్య కనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేవని వెంటనే బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత నగర జనాభాకు అనుగుణంగా నగరంలో 7000 బస్సులు ఉండాల్సిన చోట 2800 బస్సులు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ హాయంలో 3800 బస్సులు ఉండగా ప్రస్తుతం వెయ్యి బస్సులను తగ్గించారని తెలిపారు. మహిళలకు ఉచితం ప్రయాణం అని చెప్పి బస్సులు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు పి.మహేందర్, కె. రమేష్ , కె.వీరయ్య , శ్రీనివాస్, మల్లయ్య ,రాజు , శ్రీరాములు ,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైలు బోగీలను పెంచండి

- హెచ్ఎంఆర్ఎల్ ఎండీకి సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో రైలులో పెరిగిన రద్దీ రీత్యా బోగీలను 3 నుంచి 6కు పెంచాలని సీపీఐ(ఎం) కోరింది. ఈ మేరకు శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ రావు, ఎం. మహేందర్, ఎం. దశరథ్ హెచ్ఎంఆర్ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.రాజేశ్వర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ మెట్రో రైల్‌లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రయాణం చాలా ఇబ్బందిగా మారిందని, బ్లూలైన్, రెడ్ లైన్‌లలో పీక్ టైంలో రైలు ఎక్కడం, దిగడమూ కష్టంగా మారిందన్నారు. రైలు లోపల నిలబడలేని పరిస్థితి ఏర్పడుతుందని, కొన్ని సందర్భాల్లో ఏసీ సరిపోక ఊపిరాడని పరిస్థితి ఉంటుందన్నారు. ప్రస్తుతం మెట్రో రైల్ మూడు భోగిలతో మాత్రమే నడుస్తున్నందున.. వీటిని ఆరు భోగిలకు పెంచాలని కోరారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరగా భోగిల పెంపుదల చేయాలని సీపీఐ(ఎం) తరపున ఎం.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బోగీలు పెంచే విషయంలో హెచ్ఎంఆర్ఎల్ ఎల్అండ్‌టీ కాంట్రాక్ట్ సంస్థతో పాటు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తుందని సానుకూలంగా స్పందన వ్యక్తం చేసినట్టు ఆయన చెప్పారు.



ప్రభుత్వ రంగంలోనే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

- పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ - ముషీరాబాద్

స్కిల్ యూనివర్సిటీని ప్రయివేటు, పబ్లిక్ పార్ట్‌నర్ షిప్ లో కాకుండా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రయివేటు, పబ్లిక్ పార్ట్నర్ షిప్ వల్ల యూనివర్సిటీలో పూర్తి చేసే కోర్సులకు విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాంతో విద్యార్థులకు స్కిల్స్ ను ఉచితంగా అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకున్నట్టేనన్నారు. ఇది విద్య ప్రయివేటీకరణకు మరొక కొత్త రూపం మాత్రమే అన్నారు. స్కిల్ యూనివర్సిటీలో అందించే కోర్సులు, వాటి కాలవ్యవధినీ, విధివిధానాలను ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే రూపొందించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయన్నారు. వీటి ద్వారా ఏటా లక్షల కోట్లల్లో విద్యా వ్యాపారం జరుగుతున్నదని.. దీనిని అరికట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ వైపుగా చర్యలు తీసుకోకపోగా ప్రయివేటు పబ్లిక్ పార్ట్ నర్ షిప్ లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం తీవ్రమైన అభ్యంతరకరం అన్నారు. ఈ నిర్ణయాన్ని పునర్ ఆలోచించుకొని ప్రభుత్వమే పూర్తిస్థాయిలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి ఉద్యోగస్తులుగా తయారు చేయాలని డిమాండ్ చేశారు.



అమరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ

బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి. యాదగిరి

- నవతెలంగాణ - ధూల్ పేట్

మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటం, ఉద్యమకారుల, అమరుల త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి. యాదగిరి అన్నారు. తూర్పు బజార్ చౌరస్తా దగ్గర ఉన్న వర్గీకరణకు అమరులైన పొన్నాల సురేందర్ మాదిగ, దామోదర్ మాదిగ, ములుగు మహేష్ మాదిగ, భారతి మాదిగల విగ్రహాలకు నియోజక వర్గంలోని కుల సంఘాలు నాయకులతో కలిసి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జడ్జి చంద్ర చూడ్, ఏడుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం వర్గీకరణ తీర్పు చారిత్రాత్మకమైనదన్నారు.గోషామహల్ నియో జకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు సీమా శంకర్ మాదిగ, శివ మాదిగ, రవి మాదిగ, లక్ష్మణ్ మాదిగ, శీను మాదిగ, వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ - ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని చిక్కడపల్లి హెచ్ఎండబ్ల్యూ ఎస్ అండ్ ఎస్ బీ లో బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హాజరై శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ , సీజీఎంలు ప్రభు, సి.వి.శ్రీధర్, డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, పి.నర్సింగ్ రావు,ఆకుల సురేందర్,ఉమేష్, సాయి కుమార్,ఆనంద్ రావు,ప్రశాంత్ పాల్గొన్నారు.

యడవల్లి సైదులుకు ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఓయూ



ఓయూ ,తెలుగు శాఖ లో పీహెచ్డీ పూర్తి చేసిన యడవల్లి సైదులు కు డాక్టరేట్ ప్రకటించారు. " రాళ్ళబండి కవితాప్రసాద్ రచనలు పరిశీలన " అనే విషయాన్ని పరిశోధన అంశంగా తీసుకొని పరిశోధన గ్రంథాన్ని తెలుగు శాఖ సీనియర్ ప్రొఫెసర్ డి. సూర్యా ధనంజయ్ పర్యవేక్షణలో (గైడ్ షిప్) లో పరిశోధన చేశారు. రాళ్ళబండి కవితాప్రసాద్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. వీరు పద్య కవిత్వం,వచన కవిత్వం,గేయ కవిత్వం లలో అనేక ఉత్తమ శ్రేణి రచనలు రచించారు.తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ లోని పలు ప్రముఖ ప్రాంతాల్లో అవధానంలు నిర్వహించారు. సైదులు తల్లిదండ్రులు కూలి పని చేసుకునే నీరుపేదవారు. అయినప్పటికీ తనని ఎంతో కష్టపడి చదివించారని తెలిపాడు. తన తండ్రి ఒక చిన్న పాఠశాలలో చప్రాసిగా పని చేస్తూ తనని డాక్టరేట్ వరకు ప్రోత్సాహించారన్నారని సైదులు తెలిపాడు. తెలుగు సాహిత్యంలో సైదులుకు డాక్టరేట్ రావడం పట్ల కవులు,పరిశోధక విద్యార్థి మిత్రులు,అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

దోమలను అరికట్టెందుకు ప్రత్యేక డ్రైవ్



- సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్
- దోమ కాటు నివారణ పై అవగాహన

నవతెలంగాణ-ధూల్ పేట్

వర్షాకాలంలో విజంభించే దోమలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ తెలిపారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న ఆదేశాల మేరకు ఎంటమలాజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చాంద్రాయణ గుట్ట ఇందిరానగర్ కాలనీలో దోమ కాటు వ్యాధుల నివారణ పై మహిళల స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్, జోనల్ కమిషనర్ల ఆదేశాల మేరకు ప్రజలకు దోమకాటుతో వచ్చే వ్యాధులను, నీటి తో వ్యాపించే అంటూవ్యాధులపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామన్నారు. ప్రజలందరూ వ్యక్తిగత, ఇంటి పరిసరల పరిశుభ్రత పై ప్రత్యేక దష్టి కేంద్రికరించాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించి ఇంట్లోని నీటి నిల్వలను శుభ్రపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్థానిక ప్రాంతాలలో ప్రజలకు నివారణ చర్యలపై వివరించాలని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పాఠశాలల విద్యార్థులు, మహిళ సంఘాల సభ్యులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేష భగస్వాములను చేస్తు అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ చాంద్రాయణ గుట్ట సర్కిల్ యూసీడీ కమ్యూనిటీ ఆర్గనైజర్ రాములు, మలేరియా సూపర్వైజర్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం

- ఎస్సై శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-మెహిదీపట్నం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును సాధించడానికి కృషి చేయాలని హుమాయున్ నగర్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజానాట్యమండలి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో విజయనగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మన ఇంటి చుట్టూ పక్కల, రోడ్డు మీద ఎవరైనా డ్రగ్స్, గంజాయి వాడుతున్నారని తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాల న్నారు. మత్తు పదార్థాలు వాడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న విద్యార్థులకు యువతకి అవగాహన కల్పించే బాధ్యత తల్లిదండ్రులది, టీచర్లది అని తెలిపారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు కష్ణమూర్తి మాటాడుతూ ప్రతి విద్యార్థికీ జీవితంలో ఉన్నతమైన స్థితికి వెళ్లడానికి లక్ష్యం ఉండాలని ఆ లక్ష్యం చేరుకోవడానికి కష్టపడి చదవాలన్నారు. మత్తు పదార్థాలు వాడితే జైలుకు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ప్రజానాట్యమండలి నగర ప్రధాన కార్యదర్శి మారన్న మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోయి అరవడం, కేకలు వేయడం, డిప్రెషన్ లోకి వెళ్లడం జరుగుతుందన్నారు. విద్యార్థులందరూ చదువుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని కోరారు. మంచి వాళ్ళతో స్నేహం చేయాలని చెడు దారిలో వెళ్లి జైలు పాలు కావద్దని సూచించారు. కార్యక్రమానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కళ్యాణ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర ఉపాధ్యక్షులు రఘు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి



- అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలి
- ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్
- ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులు తమ చదువులతో పాటు సమాజంలో అసమానతలు, ఆర్థిక అంతరాలు రూపుమాపేందుకు సమాజాన్ని మార్చేందుకు అధ్యయనం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతుల ప్రారంభ సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లెనిన్ అధ్యక్షతన జరిగిన ఈసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఆధిపత్య వర్గాల భావజాలం.. అధికార భావజాలంగా ఉందని, దేశంలో బలహీన వర్గాలు, పేదలకు అందాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. ఒక వర్గంపై పనిగట్టుకుని మరి విషప్రచారం చేస్తున్నారన్నారు. ప్రశ్నించడం అనేది కీలకమని.. ప్రశ్నతోనే సమాజం ముందుకు వెళ్తుందన్నారు. దేశంలో పాలిస్తున్న పాలకులు తమ భావ జాలం వ్యాప్తి చేసేందుకు, విద్య, చరిత్ర, అన్ని అంశాలను వాడుకుంటున్నారని ఆయన తెలిపారు. అందుకే సమసమాజం రావడానికి విద్యార్థులు తమ అకడమిక్ చదువులతో పాటు సమాజంలో జరిగే దోపిడీ, అసమానతలు, ఆధిపత్య ధోరణలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో సమసమాజ స్థాపన కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని, భవిష్యత్తులో బలమైన పోరాటాల నిర్వహణకు ఈ తరగతుల్లో అవగాహన కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. తరగతులలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య, రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్, శ్రీమన్, స్టాలిన్, చరణ్‌శ్రీ , విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



- సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ - ముషీరాబాద్

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన వేరు చేసి అమలు జరపాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ. దాదాపు 30 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితం రాజకీయ పార్టీలు ప్రజాస్వామిక సంస్థలు అన్నీ ఈ వర్గీకరణ న్యాయమైనదని అంగీకరించాయని తెలిపారు. ఈ పోరాటానికి సుదీర్ఘకాలం పట్టడం శోచనీయమన్నారు. దీని ఫలితంగా ఆయా వర్గాలలో సామాజిక అసమానత, అంతరాలు గతంలో ఉన్నవని.. నేడు మరింత వైరుధ్యాలు ఏర్పడ్డాయన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తీర్పునకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వారి జనాభా ప్రాతిపదికన వేరుగా చేసి తక్షణమే అమలు చేయాలన్నారు. అదే విధంగా రాష్ట్ర సర్వీసులు, ఉద్యోగాలు, విద్యా సౌకర్యాలలోనే గాకుండా, కేంద్ర స్థాయి సర్వీసులలో కూడా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగు చట్టపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు ఆగస్టు 21న చలో హైదరాబాద్ నిర్వహిస్తామని తెలిపారు. రైతు భరోసాను కూడా సాగు భూములకు 10 ఎకరాల వరకు రూ.15 వేల చొప్పున ఇవ్వాలని, కౌలు రైతులకు కూడా అమలు చేయాలన్నారు. పాలస్తీనా జాతిని నిర్మూలించాలని ఇజ్రాయెల్ చేస్తున్న దురాక్రమణ, దుర్మార్గ యుద్ధాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. తక్షణమే ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు నిరసించాలని, భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ తో ఉన్న అన్ని రకాల సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె.జి. రాంచందర్, రమ, కెచ్చెల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, హన్మేశ్, ఎస్.ఎల్. పద్మ, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి గిరిజన హక్కుల దినోత్సవాలు



- రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్
- గోడ పత్రిక విడుదల

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 15 వరకు జరుగు గిరిజన హక్కుల దినోత్సవాలు జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాల గోడ పత్రికను శుక్రవారం భాగలింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్ ఆగస్టు 9న జరుగుతున్న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాలలో రాజకీయాలకు అతీతంగా గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని సైతం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజన తెగల హక్కులను రక్షించడం, స్వయంపాలన, జీవన విధానం, సంస్కతి,ఆచార వ్యవహారాలను గౌరవించడం, గిరిజనుల అభివద్ధి, భాషల గుర్తింపు, విద్య,ఆరోగ్యం వంటి లక్ష్యాలను సాధించే దిశగా పాలక ప్రభుత్వాలు కషిచేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందన్నారు. ప్రపంచ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివాసి గిరిజన తెగలు తమ హక్కుల సాధన కోసం నినదించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు వి రాంకుమార్,రఘు నాయక్,గోపి నాయక్,వినోద్ నాయక్, గోర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మేరు సంఘం రాష్ట్ర ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ..

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల ప్రక్రియ మొదలైంది. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభంతో శుక్రవారం కీర్తీ రాజ్ గోపాల్ కు చెందిన ప్యానల్ సభ్యులు అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ప్యానల్‌కు చెందిన 34 మంది సభ్యులు ఉదయం చాదర్ ఘాట్ శ్రీ దర్బార్ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాండు మేళలతో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన మేరు సంఘం నాయకులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి దారుషిఫాలోని మేరు సంఘం భవనానికి చేరుకొన్నారు. అక్కడ రాష్ట్ర ఎన్నికల అధికారి పి.సురేష్ కుమార్ కు నామినేషన్ల పత్రాలు అందజేశారు. రాష్ట్ర మేరు సంఘం అధ్యక్షునిగా కీర్తీ రాజ్ గోపాల్, ప్రధాన కార్యదర్శి గా దీకొండ నర్సింగ్ రావు, కోశాధికారి గా తాళ్ల వేంకటేశ్వర రావు తదితర ప్యానల్ కు చెందిన సభ్యులు నామినేషన్ పత్రాలు అందజేతలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మాజీ అధ్యక్షులు కొవ్వూరు భాస్కర రావు, కీర్తీ ప్రభాకర్, సంఘం నాయకులు ఎస్.బి.సంగే వార్, దీకొండ శ్రీనివాస్, కె.వెంకటేష్, ఓదెల సత్యనారాయణ, కొండూరు చంద్ర శేఖర్, కె.సురేష్ బాబు, రావర్తి రవి కుమార్, ఓదెల శేఖర్, కె.సంజీవ్ తో పాటు రాష్ట్రంలోని మేరు సంఘం జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com

డివిజన్ సమస్యలపై కార్పోరేటర్ సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు.. సెలవుపై పోవడంతో ఇన్‌చార్జి ఇంజనీర్‌గా వచ్చిన స్రవంతితో డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జనశేఖర్ డివిజన్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా నాచారం ఓల్డ్ విలేజ్‌లో ఇదివరకు మంజూరైన రూ.30 లక్షల 50 వేలు ఫండ్స్ రెన్యువల్ చేయాలని అలాగే ఇదివరకే మంజూరైన ఎస్డీఎఫ్ ఫండ్స్ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని తెలిపారు. అలాగే రైతు బజార్ పక్కన ప్రతిపాదించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు కావలసిన సాయిల్ టెస్ట్ తక్షణమే చేయించాలని సూచించారు. అలాగే నాలా డీసిల్టింగ్, మ్యాన్యువల్ డేస్ ఎడిటింగ్ పనులు జరగటం లేదని తక్షణమే పనులు జరిగేలా చూడాలని కార్పొరేటర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బారాస నాయకులు, సాయి జన్ శేకర్, వర్క్ ఇన్స్పెక్టర్, విజయకుమార్ పాల్గొన్నారు.



సాయిరాం నగర్ కాలనీవాసుల ఆహ్వానం మేరకు.. కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణ రాజు కాలనీ సందర్శించారు. కాలనీలోని వివిధ సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్ దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రయినేజీ, వాటర్, వీధిలైట్లు, రోడ్లు, శానిటేషన్‌లకు గల సమస్యలను కార్పొరేటర్ పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్, డీజీఎం సతీష్, ఏఈ రోహిత్ ఇంజనీరింగ్ సెక్షన్, జీహెచ్‌ఎంసీ ఏఈ అభిషేక్ , వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, కాలనీ ప్రజలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

లిటిల్ ఫ్లవర్ పాఠశాలను రద్దు చేయాలి



- పిల్లలకు రక్షణ లేని పాఠశాలపై, కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో చిన్నారిపై అసభ్యకర ప్రవర్తనకు వ్యతిరేకంగా పాఠశాల ముందు సీపీఐ(ఎం) ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం పాఠశాల యజమాన్యం సమాధానం చెప్పకుండా అరెస్టు చేయించడం సిగ్గుచేటు వారు అన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, సీపీఐ(ఎం) ఉప్పల్ జోన్ కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశా లలో చిన్నారిపై వేధింపులు జరగడం దుర్మార్గమన్నారు. పాఠాలు బోధించవలసిన పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థి, రెండవ తరగతి చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులు చదువుతున్నారా లేదా అని విద్యార్థులపై దృష్టి పెట్టకపోవడం ఏంటన్ని ప్రశ్నించారు. పాఠశాలలో జెల్ గేట్ లాగా గేట్లు పెట్టుకొని గొప్పగా చదువు చెప్తామని విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులతో చెప్పి అడ్మిషన్ తీసుకొని లైంగిక వేధింపులు జరుగుతున్నా యజమాన్యం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. పైన పటారం లోన లొటారం ఉన్నట్టు లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఉందన్నారు. ఫీజుల మీదున్న దృష్టి విద్యార్థుల చదువులపై, క్రమశిక్షణపై లేకపోవడం దుర్మార్గమన్నారు. గతంలోనే లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులు డ్రగ్స్ తీసుకుంటున్నారని వార్తలు కూడా వినబడ్డాయన్నారు. ఈ పాఠశాలపై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర, జిల్లా విద్యాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని లిటిల్ ఫ్లవర్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పాఠశాలపై చర్యలు తీసుకునేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) మండల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, సాయి తేజ, శ్రీమన్, శీను, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల కార్యదర్శి వినయ్, నాయకులు ఆకాష్, ప్రశాంత్, సాగర్ ఐద్వా మహిళా సంఘం నాయకులు ఉప్పల్ మండల అధ్యక్షురాలు జయలలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి శుక్రవారం డ్రై డేను ఖచ్చితంగా పాటించి పారిశుధ్యం, పరిశుభ్రత పాటించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికాగుప్తా ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఎంఅండ్‌హెచ్‌ఓ టి.రఘునాథస్వామి అధ్యక్షతన శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారుల సమావేశంలో వారు మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణ దష్ట్యా ఆరోగ్య సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు సమగ్ర జ్వర సర్వేలు నిర్వహించాలన్నారు. లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో చురుకైన వ్యూహాల ద్వారా వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నివారణా చర్యలు, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఆరోగ్య అవగాహనా శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. వైద్యాధికారులందరూ మెడికల్ స్టాక్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చూసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ టి.రఘునాథ్ స్వామి మాట్లాడుతూ రోగి భద్రతను నిర్ధారించడానికి అన్ని మందుల గడువు తేదీల కోసం ప్రతిరోజూ తనిఖీ చేయాలన్నారు. ఎన్‌సీడీ (నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్) నిర్వహణ కోసం మందులు 24/7 అందుబాటులో ఉండాలన్నారు. వచ్చే వారంలోగా ఖాళీగా ఉన్న ఆరు స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. డెంగ్యూ రిపోర్టులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రస్తుత డెంగ్యూ పాజిటివిటీ రేటు జనాభా విభాగంలో 6.7 కేసులుగా ఉందని తెలిపారు. ఒక్కో శిబిరంలో కనీసం 100 మంది రోగులకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. రెండు ఔట్ పేషెంట్ రిజిస్టర్లు, రెండు రెఫరల్ రిజిస్టర్లు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య శిబిరాలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటాయని తెలిపారు. గరిష్ట కవరేజీని నిర్ధారించడానికి అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి ఏఎన్ఎం వారి నిర్దేశిత ప్రాంతాల్లో 50 ఇండ్ల సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ నెల 6వ తదేనీ జవహర్‌నగర్ పీహెచ్‌సీ, 8న బాలానగర్ పీహెచ్‌సీ, 13న మల్కాజిగిరి పీహెచ్‌సీ, అండ్ షాపూర్‌నగర్ పీహెచ్‌సీలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-కాప్రా

జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ ఆదేశాల మేరకు.. ఎంటామాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ఎంటామాలజీ విభాగంతోపాటు శానిటేషన్ విభాగం సిబ్బందిచే దోమలు అభివృద్ధి చెందుటకు అనుకూల పరిస్థితులు వాటి వృద్ధి నిరోధించుటకు కావలసిన చర్యలు గురించి సూచించారు. దోమల వలన వ్యాపించే వ్యాధులు, దోమ కాటు భారీ నుంచి రక్షించుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై జీహెచ్‌ఎంసీ హీరోస్ వాలంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దోమ జీవిత చరిత్ర ఫ్లెక్సీలు సంబంధిత అవగాహన వస్తువులను, ఎగ్జిబిషన్‌లో దోమల లార్వా, ప్యూపాలతో పాటు గంభూసియ చేపలను ఎగ్జిబిషన్ లో ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటి పరిసరాలలో వర్షపు నీరు లేదా ఇతర నీరు నిలవకుండా టైర్లు,పగిలిన కుండలు,పగిలిన బకెట్లు, కొబ్బరి చిప్పలు, తదితర వాటిలో వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉంది. కావున రెండు మూడు రోజులకు ఒకసారి నీటిని తొలగిస్తూ ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడేగా పాటిస్తూ దోమతెరలు వాడవలసినదిగా పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనము సంరక్షించుకొంటూ ఈ విషయాన్ని ఇరుగుపొరుగు వారికి స్నేహితులకు కూడా తెలియజేయవలసిందిగా ఎంటమాలజీ ఎఈ డి.రమేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం ఏఎంఓహెచ్, వెంకటరమణ, డీపీఓ దామోదర్ రెడ్డి, సానిటరీ సూపర్ వైజార్ సుదర్శన్, ఎంటమాలజీ సూపర్ వైజార్ లు కనకయ్య,పరమేష్, నరేందర్ రెడ్డి,నరసింహ గౌడ్, ఈ.ఎఫ్.ఏ అనిల్, స్థానిక కళాశాలు అనీష్ డిగ్రీ కాలేజ్, మెగా జూనియర్ కాలేజ్, సాయి సుధీర్ డిగ్రీ కాలేజ్, గౌతమి జూనియర్ కాలేజ్, ఆక్స్ ఫర్డ్ జూనియర్ కాలేజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్నేహ బిల్డింగ్‌లోకి మార్చాలి



- సీపీఐ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు డీజీ సాయిల్ గౌడ్

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రజల సౌకర్యం కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల తహశీల్దార్ కార్యాలయం ప్రక్కనున్న స్నేహ బిల్డింగ్ లోకి మార్చాలని సీపీఐ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు డీజీ సాయిలు గౌడ్ అన్నారు. శుక్రవారం అలియబాద్ చౌరస్తాలో పిస్తా హౌస్ వద్ద విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994 నుంచి అద్దె బిల్డింగ్‌లో శామీర్ పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతోందన్నారు. ఓ వ్యక్తి తన ఇంటికి సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మిస్తే తన ఇంటికి కిరాయిలు వస్తాయని స్వార్థంతో మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని తప్పుదోవ పట్టించి, రాజీవ్ రహదారి ప్రక్కన దర్గా దగ్గర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భవనం నిర్మాణం చేస్తే అనుకూలంగా ఉంటుందని చెప్పడంతో అక్కడ నిర్మాణం చేపట్టారని తెలిపారు. అయితే రాజీవ్ రహదారికి దగ్గర ఉండడంతో అక్కడ పలు మార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందారని పేర్కొన్నారు. అంతేగాక వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం లేదని అన్నారు. శామీర్ పేట తహశీల్దార్ కార్యాలయం ప్రక్కనున్న స్నేహ బిల్డింగ్‌లోకి లేదా శామీర్ పేట గ్రామపంచాయతీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్‌లోకి యాకుబ్ రిజిస్టర్ కార్యాలయం మార్చాలని ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుడు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పల్లె సీతారాములు గౌడ్, సీనియర్ నాయకుడు గాదె వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-నేరేడ్ మెట్

వినాయక నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఓల్డ్ సఫిల్ గూడ ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా దీన్ దయాల్ నగర్, దినకర్ నగర్, వినాయక నగర్, వివి గార్డెన్, సుధా నగర్ తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు వసంతపురి సబ్ స్టేషన్ పరిధిలోని భవాని నగర్, సాయిరాం ఫీడర్ మరమతుల కారణంగా ఓల్డ్ మల్కాజిగిరి, యాదవ నగర్, గీతా నగర్, సంతోష్ నగర్, సాయి నగర్, సంజయ్ నగర్, భవాని నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఆనంద్ బాగ్ సబ్ స్టేషన్ పరిధిలోని శివపురి ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుండి 11:30 గంటల వరకు, సంతోషిమానగర్ ఫీడర్ 10 గంటల నుండి 12 గంటలకు,ఎన్ఎండిసి ఫీడర్ 10 గంటల నుంచి 12 గంటలకు, ఆర్ కె నగర్ ఫీడర్ 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించా లని ఆపరేషన్ ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన..



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీకి అమృత్ 2.0పథకంలో భాగంగా మంజూరైన రూ.38 కోట్ల నిధుల వ్యయంతో నిర్మించనున్న 5 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శుక్రవారం చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహరెడ్డి, ప్రజా ఆరోగ్య డిప్యూటీ ఇంజనీర్ యాదయ్యతో కలసి స్థలా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని 6,8,10,11,14 వార్డులలో స్థలా పరిశీలన చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ నిర్మాణాలకు అనుకూలంగా ఉన్నటువంటి స్థలాలను పరిశీలించినట్లుగా తెలిపారు. ప్రజా ఆరోగ్య డిప్యూటీ ఇంజనీర్ యాదయ్యకు పలు సూచనాలు చేసి నిర్మాణాలను వీలైనంత త్వరగా మొదలుపెట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. మౌలిక సధుపాయల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రగతి పథంలో మేడ్చల్ పట్టణాన్ని అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతో ముందుకు సాగుతునట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మణికంఠ గౌడ్, నాగరాజు, శివకుమార్ యాదవ్, సుహాసిని, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ డీఈ విజయ లక్ష్మీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా..



- ఐదు లక్షలతో డ్రయినేజీ పనులుప్రారంభం
- కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్ నగర్

డివిజన్ అభివృద్యే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మూడవ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడవ డివిజన్‌లో అయిదు లక్షల రూపాయల జనరల్ నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్‌లు ముఖ్య అతిథిలుగా హయజరయ్యారు. అనంతరం బల్లి రోజా శ్రీనివాస్‌తో కలిసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మనోధర్ రెడ్డి, శాగంటి వెంకటేష్, మాను పాటి వెంకటేశం, అశోక్ గుప్తా, సుధాకర్ గౌడ్, కటకం శ్రీనివాస్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకుశాపూర్‌లో పర్యటించిన డీఆర్‌డీఓ



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

ఘట్కేసర్ రూరల్‌లో అంకుశాపూర్ గ్రామపంచాయితీలో శుక్రవారం డిఆర్ డిఓ సాంబశివరావు పర్యటించారు. అంగన్ వాడి కేంద్రం, రేషన్ దుకాణంలోని రికార్డులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాల ప్రాథమిక పాఠశాల, నర్సరీని పరిశీలించారు. రేషన్ దుకాణంలోని రికార్డులు పరిశీలించి లబ్ధిదారులు ఎంత మంది, రేషన్ కార్డులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్ వాడి కేంద్రం చిన్నారులు ఎంతమంది ఉన్నారు. పౌష్టికాహారం అందించే విషయాన్ని అడిగి రికార్డులు తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో మౌళిక సాదుపాయలు కల్పన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కలశాలలో హాస్టల్ సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ గీతారెడ్డి, ఏపీఎం తౌర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూపులోకి మార్చాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనకబడిన ముదిరాజ్‌లను గ్రూపు డి నుంచి బీసీ ఏ. గ్రూపులోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కందుల కుమారముదిరాజ్ అన్నారు. ముదిరాజ్‌లను గ్రూపు డి నుంచి గ్రూపు" ఏ" లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్ ముదిరాజ్ అధ్యక్షతన తహసీల్దారు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల జనాభాలో 10 శాతం, మొత్తం జనాభాలో 14 శాతం ఉన్న ముదిరాజులను దుర్భరంగా జీవిస్తున్నారన్నారు. 2023 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వు 15 ప్రకారం గ్రూపులోకి మార్చడానికి తెలంగాణ బీసీ కమిషనర్‌ను ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రవికాంత్ ముదిరాజ్, వెంకటేశ్ ముదిరాజ్, జై.లింగంము దిరాజ్, శ్రీనాథ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, ఎస్.లింగంముదిరాజ్, నరేశముదిరాజ్, రాజుముదిరాజ్ తదితరులున్నారు.

9నెలల నుంచి 15 ఏండ్లలోపు పిల్లలకు.. జేఈ వ్యాక్సిన్ వేయించాలి

- కౌన్సిలర్ కొడే మహేష్



నవతెలంగాణ-మేడ్చల్

9నెలల నుంచి 15 ఏండ్లలోపు ఉన్న చిన్నారులందరికీ జేఈ వ్యాక్సిన్ వేయించాలని కౌన్సిలర్ కొడే మహేష్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 23 వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన జేఈ వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ మాట్లాడుతూ దోమకాటు వల్ల సంక్రమించే మెదడు వాపు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ప్రతి ఒక్కరూ తల్లి పాల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక తల్లిపాలేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎం రజని, అంగన్ వాడీ టీచర్లు ఇందిరా, ధనలక్ష్మి, ఆశా వర్కర్లు సునీత, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్డ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



నవతెలంగాణ-నేరేడ్ మెట్

రాచకొండ ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్‌లో పనిచేస్తూ 2024 మార్చిలో అనారోగ్యం తో మరణించిన ఆర్మ్డ్ హెడ్ కానిస్టేబుల్ జి.రాజు భార్య తిరుపతమ్మకు శుక్రవారం నేరేడ్ మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ జి.సుధీర్ బాబు, ఐపీఎస్ రూ.7,99,685 (ఏడు లక్షల తొంబై తొమ్మిది వేల ఆరు వందల ఎనభై ఐదు రూపాయల) భద్రత చెక్కును అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రా రెడ్డి, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తాం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెం.08 ఎస్వి నగర్ కాలనీలో పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.6.50 లక్షలతో చేపట్టుతున్న డ్రయినేజీ నిర్మాణ పనికి చైర్ పర్సన్ కౌకుట్ల చంద్రా రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కౌకుంట్ల మమత కృష్ణ రెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువులకు ఆరోగ్యకరం



- మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్

నవతెలంగాణ-జవహర్ నగర్

తల్లిపాలు శిశువులకు అత్యంత ఆరోగ్యకరమైన ఆహారమని, తల్లిపాలు శిశువులకు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తాయని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం శుక్రవారం జవహర్ మున్సిపల్ పరిధిలోని గబ్బిలాల పేటలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జవహర్ నగర్ శాంతి కోటేష్ గౌడ్ పాల్గొని, పిల్లలకు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్నటువంటి పౌష్టిక ఆహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటో తారీకు నుంచి 7వ తారీకు వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయని, తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అనురాధ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com

పూడికతీత పనుల పరిశీలన..



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మౌలాలి డివిజన్‌లోని సంతోషి మాత గుడి వద్ద శుక్రవారం జరుగుతున్న నాలా పూడికతీత పనులను ఏఈ మధురిమతో కలిసి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో వర్షపు నీరు, డ్రయినేజీ నీరు జామ్ కాకుండా ఎప్పటికప్పుడు, డ్రయిజీలను పర్యవేక్షిస్తూ క్లీన్ చేయించాలని అధికారులకు సూచించారు.

మనస్తాపానికి గురై బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ- జవహర్ నగర్

మనస్థాపానికి గురైన ఓ మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ నగర్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన మైనర్ బాలిక అదే కాలనీకి చెందిన శివతో ప్రేమ పేరుతో వేధించబడి మనస్థాపం చెంది గురువారం రాత్రి అమ్మాయి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. సభ్యులు ఇంటికొచ్చి చూసేసరికి ఇంటికి లోపలి నుంచి తాళం వేసి ఉండటాన్ని గమనించి, కూతురి కోసం ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూసేసరికి హాలులో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో వేలాడుతూ ఉంది. 18 సంవత్సరాలు కూడా నిండని తన కుమార్తెను ప్రేమిస్తున్నానని నమ్మించి, ప్రేమ పట్ల ఆసక్తి కలగజేసి, తన కుమార్తె మనస్థాపం చెందేలా చేసి, ఆత్మహత్యకు ప్రేరేపించిన శివపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు శుక్రవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని కుషాయిగూడ ఏసీపీ మహేష్, జవహర్ నగర్ సిఐ నాగరాజు, పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజుకాలనీలో వీధి కుక్కలు కుక్కల స్వైర విహారం చేస్తున్నాయని, ఈ విషయంలో సర్కిల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి 24 మంది పిల్లలను, వృదులను గాయపరిచిన వారి బాధిత కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదారాబాద్ నగరంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, అధికారులు మాత్రం అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రోజు ఎక్కడో ఒకచోట పిల్లలు, వృద్దులు, మహిళలపై కుక్కలు దాడులు చేసి, గాయపరుస్తున్నాయ అన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వెటర్నరీ ఆస్పత్రికి కుక్కలను తీసుకు వెళ్లి.. తిరిగి అక్కడే వదిలేస్తున్నారని, వాటిని చూర ప్రాంతాలకు తీసుకెళ్లి వదిలేయాలని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు పట్టించు కోకపోవడంతో బస్తీలలో ప్రజలపై కుక్కల దాడులు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. వాటిని నియంత్రించాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు సైతం హైదారాబాద్ కుక్కలపై కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్పటల్‌కు తీసుకెళ్లిన కుక్కలకు ట్రీట్మెంట్ చేసి తీసుకురావాలి, లేకుంటే ప్రజలు ఇబ్బందులు పడుతారని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం..

నవతెలంగాణ-మేడ్చల్

కిష్టాపూర్ గ్రామ ఫీడర్ సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33/11 కె.వి ఫీడర్‌లో మరమ్మతుల కొత్త సర్వీస్ కనెక్షన్ల, నిర్వహణ పనుల కారణంగా.. నేడు ఉదయం 10.00 గం॥ నుంచి సాయంత్రం 5:00 గం॥ వరకు కిష్టాపూర్ గ్రామం, అర్చన కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీలు, క్వార్టర్స్, కిష్టాపూర్ అగ్రికల్చర్ సర్వీసెస్ పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఉంటుందని, ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజల సహకరించాలని మేడ్చల్ టౌన్ విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు.

దుండిగల్: డీపీ పల్లి ఎస్ఎస్ సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33/11 కె.వి బౌరంపేట్, గండిమైసమ్మ ఫీడర్‌లో మరమ్మతుల కొత్త సర్వీస్ కనెక్షన్ల, నిర్వహణ పనుల కారణంగా ఉదయం 11.00 గం॥ నుంచి 11.30 ని వరకు ఆంధ్రా బ్యాంక్, రాజారాజెశ్వరి కాలనీ, జి9 కాలనీ, డీపీ పల్లి గ్రామం, సారెగూడం ప్రాంతాలలో అలాగే డీపీపల్లి ఎస్ ఎస్ -2 నుంచి, కట్టమైసమ్మ ఫీడర్ బహదూర్‌పల్లి ఎస్ఎస్ ఫిడర్, 11కేవీ ఇండో ఫ్యాబ్ ఫీడర్ మరమతల కారణంగా ఉదయం 11.30 నుంచి 12.00 వరకు 60 గజాలు, సాయి పూజా కాలనీ, చంద్రశేఖర్ రెడ్డి కాలనీ,పోలీస్ స్టేషన్, సూరారం ప్రధాన రహదారి, సూరారం కాలనీ, సూరారం మార్కెట్. అలాగే డిపిపల్లి ఎస్ ఎస్ -2, సుందర్ ఆశ్రమం, గాగిల్లాపూర్, టెక్ మహీంద్రా ఫీడర్ లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 నిమిషాల వరకు టెక్ మహీంద్రా రోడ్, దుండిగల్ గ్రామం, నాగూర్ ప్రాంతాల్లో అలాగే డీపీపల్లి ఎస్ఎస్ 1 నుంచి 11 కేవీ ఏజీఎల్ గాగిల్లాపూర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 01.00 గంట నుంచి 01.30 నిమిషాల వరకు ఎంఎల్ఆర్ కళాశాల, నాగ్లూర్ గ్రామం, దుండిగల్ గ్రామం అలాగే గాగిల్లాపూర్ ఎస్ఎస్ నుంచి వెలువడే 11 కేవీ ఏఫ్ 2 ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 01.30 నిమిషాల నుంచి 02.00 గంటల వరకు గాగిల్లాపూర్ క్రాస్ రోడ్డు, చర్చి గాగిల్లాపూర్, చైతన్య కాలనీ 214 ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజల సహకరించాలని డీపీపల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

సెమీ-హ్యూమనోయిడ్ రోబోట్‌ను అందుకున్న 'ఎంఎల్ఆర్ఐటీ'



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ లోని టీ-హబ్‌లో ఏఐఆర్ఏ ద్వారా పయనీరింగ్ రోబోటిక్స్ స్కిల్ లాంచ్ ఈవెంట్‌లో సెమీ-హ్యూమనోయిడ్ రోబోట్‌ను అందుకుంది. ఆలిండియా రోబోటిక్స్ అసోసియేషన్, తెలంగాణ అకాడెమియా ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో రోబోటిక్స్ స్కిల్ లాంచ్ ఈవెంట్‌ను శుక్రవారం టీ-హబ్‌లో ఘనంగా ప్రారంభించింది. దేశంలో రోబోటిక్స్ విద్యా రంగానికి ఒక మైలురాయి కావడంతో పాటు ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏఐఆర్ఏ నుంచి సెమీ హ్యూమనాయిడ్ రోబోట్ కోసం రూ.6.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీని అందుకున్న దేశంలోనే మొదటి సంస్థగా అవతరించింది. త్వరలో ఎంఎల్ఆర్ఐటీకి డెలివరీ చేయబడే రోబోట్, కళాశాలలో రోబోటిక్స్ శిక్షణ, పరిశోధనను అభివృద్ధి చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయి కావడం గమనార్హం. ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి సంస్థ తరపున రోబోట్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఎల్ హెచ్ఓడీ డాక్టర్ కాశీ సాయి ప్రసాద్, రోబోటిక్స్ ఇన్‌చార్జి జె.విజయ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందనలు..

మల్కాజిగిరి ఎమ్మెల్యే, ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజికి చెందిన ఏఐఎంఎల్ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషిన్ లెర్నింగ్) విభాగాన్ని అభినందించారు. 2030 నాటికి మిలియన్ రోబోట్‌లను నిర్మించాలనే ఏఐఆర్ఏ ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ప్రశంసించారు. దేశంలో ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధిని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కాలేజీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల మరో మైలు రాయిని చేరుకుండం ఆనందంగా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్ కిట్ల పంపిణీ..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో గత సంవత్సరం పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్ కిట్లను అందించారు. ఈ సంవత్సరం కూడా అదే విధంగా బ్యాగు కిట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థులకు బ్యాగ్ కిట్లు అందించారు. ఈ కార్య క్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, చైతనయ, సంతోష్ యాదవ్, స్కూల్ హెడ్ మాస్టర్ తదితరులు పాల్గున్నారు.

డెంగ్యూ వ్యాధి పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సర్కిల్ కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ, గణేష్ నగర్‌లో గవర్నమెంట్ పాఠశాలలో డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో.. వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణలో భాగంగా, శుక్రవారం ఎంటమాలాజీ సూపర్ వైజర్ నరసింహులు, గవర్నమెంట్ పాఠశాలలో, విద్యార్థినీ, విద్యార్థులకు దోమ కాటు ద్వారా వచ్చే డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. అదే విధంగా విద్యార్థులు కూడా గణేష్ నగర్ కాలనీలోని తమ ఇండ్ల సమీపంలో ఉన్నటువంటి, కొంతమంది ఇంటి యజమానులకు దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించారు. అదేవిధంగా కాలనీలో దోమల గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఓ ముస్తఫా, ఎస్ఆర్పి నాయక్, ఆర్పీలు, సానిటేషన్ సిబ్బంది, ఎంటమాలజీ సిబ్బంది, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రజా క్లినిక్ సీజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రామంతపూర్‌లోని శ్రీ ప్రజా క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ క్లినిక్‌లో అల్లోపతి మందులను ప్రాక్టీస్ చేసి రాస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేసిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి క్లినిక్‌ని తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ మాట్లాడుతూ ఈ క్లినిక్‌పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లినిక్ నిర్వహకులు ఎల్.అశోక్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు యునాని మెడిసిన్‌లో గ్రాడ్యుయేట్ చదివిన అశోక్ రోగులకు హైఎండ్ యాంటీ బయాటిక్స్, క్రీమ్ ఇన్ఫ్యూషన్‌లతో సహా అల్లోపతి మందులను సూచిస్తున్నారని పేర్కొన్నారు. ఇది అతని చదువుకు మించినది అనీ, నిబంధనలకు విరుద్ధం అని తెలిపారు. డాక్టర్ ఎల్.అశోక్ ప్రభుత్వ యునానీ ఉద్యోగి కూడా అని తెలిపారు. ఈ క్లినిక్‌ని ఎనిమిదేండ్లుగా డాక్టర్. ఎల్.అశోక్ నడుపుతున్నారనీ, అతను 1994 నుంచి బీహెచ్ఎంఎస్ డిగ్రీని కలిగి ఉన్నాడని తెలిపారు. రూల్ 14(3) ప్రకారం తెలంగాణ ప్రభుత్వ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్‌లో నమోదు చేసుకోలేదనీ, అదనంగా అతను ప్రిస్క్రిప్షన్ నిర్వహిస్తారని తెలిపారు. రెజి నెం 492, కుటుంబ వైద్యుడిగా గుర్తించే స్లిప్పులు, క్లినిక్‌లో వాల్ పెయింటింగ్‌ను కలిగి ఉన్నట్టు తెలిపారు. అతను కుటుంబ వైద్యుడు, ప్రభుత్వ వైద్య అధికారి అని పేర్కొంటూ, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9:30 గంటల వరకు వరకు క్లినిక్‌ను నడిపిస్తున్నారని తెలిపారు. తన తనిఖీల్లో అధిక యాంటీబయాటిక్స్, హై-ఎండ్ స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, సరైన రిజిస్ట్రేషన్, అర్హత గల వైద్యుల్లేకుండా చట్టవిరుద్ధంగా చికిత్సలు అందిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. సరైన ల్యాబ్ అనుమతుల్లేకుండా నమూనాలను సేకరిస్తున్నారనీ, అల్లోపతి చట్టం 2010ని ఉల్లంఘిస్తూ వైద్య నిపుణుడిగా మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్నారనీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పిట్లం, నిజామాబాద్ నుంచి ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ స్టాంప్‌ను ఉపయోగిస్తున్నారనీ, గెజిటెడ్‌గా నటిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. అధికారి, సంతకాలు చేయడం, డబ్బు వసూలు చేయడం, అర్హత లేని సిబ్బందిని నియమించడం, ధృవీకరించినప్పుడు, అతని సహాయకుడికి తెలంగాణ పారామెడికల్ బోర్డు నుంచి రిజిస్ట్రేషన్ లేదని తేలినట్టు చెప్పారు.

కార్మికురాలికి గ్రాట్యుటీ ఇప్పించిన రవిసింగ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ ఐడిఏ జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియాలోని 'శ్రీ సత్య సాయి ఫాలీ ప్యాక్ ' డీ-35, ఫేస్ - 4 కంపెనీలో సురేఖ అనే కార్మికురాలు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు. అనువార్య కారణాలవల్ల, కంపెనీ యజమాన్యం కార్మికరాలు సురేఖని తీసివేయడం జరిగింది. సురేఖ అనే కార్మికురాలికి గ్రాట్యుటీ రూపాయలు రావాల్సి ఉండగా.. అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగి అడిగి విసుగు చెందింది. కార్మికురాలు తమకు తెలిసిన కార్మిక మిత్రుల ద్వారా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని, తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో చర్చించారు. "పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ యాక్ట్ ,1972 " ప్రకారం కార్మికురాలు సురేఖకి రావలసిన గ్రాట్యుటీ అమౌంట్ ఇప్పించారు. తనకు న్యాయం చేసిన రవి సింగ్‌కు సురేఖ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తాం

- ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్



నవతెలంగాణ- మేడ్చల్

రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతే కేసులు నమోదు చేస్తామని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ హనుమాన్ గౌడ్ అన్నారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినప్పటికీ వాహనదారులు బాధ్యత లేకుండా నడపడం సరికాదన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ పట్టుబడితే బీఎన్ఎస్ యు/ఎస్ 125, మోటార్ వాహనాల చట్టం 184,119 ల ప్రకారం కేసు నమోదు చేస్తామని తెలిపారు. వాహనదారులు రోడ్డు ఎక్కే ముందు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

బస్తీ దవాఖానాలో రక్త పరీక్షల కేంద్రం ప్రారంభించాలి

- సీపీఐ(ఎం) నాయకులు ఎం.చంద్రశేఖర్, బాల పీరు



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో సుమారు10,000 మంది పైన జనాభా నివాసం ఉంటున్నారని సీపీఐ(ఎం) నాయకులు ఎం.చంద్రశేఖర్, బాలపీరు అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎక్కువమంది చేతివృత్తులు కష్టపడి పనిచేసే కార్మిక వర్గం పేద ప్రజల నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. 31వ డివిజన్ ప్రాతిపదికగా బస్తీ దవాఖాన ప్రారంభించి, నిర్వహిస్తున్నప్పటికీ రక్త పరీక్షల కేంద్రం అందుబాటులో లేక పోవడంఇక్కడ నివసించే పేద మధ్య తరగతి ప్రజలుఅనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు బస్తీ దవాఖానాలో రక్త పరీక్షలు నిర్వహించే విధంగా నమూనాలా కేంద్రం ఏర్పాటు చేయాలనీ తెలిపారు. ఈ మేరకు జిల్లా మెడికల్ అధికారికి వినతి పత్రం అందచేశారు. అనేక మందికి మధుమేహ వ్యాధి గ్రస్తులు, ప్రజలు సీజనల్ వచ్చే డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ చికెన్ గున్యా లాంటి జ్వరాల, బారిన పడినప్పుడు బ్లడ్ టెస్ట్‌లకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి వస్తుందన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయం ఏవో పద్మావతితో ప్రస్తావించగా మేడం రక్త పరీక్షలు ప్రారంభించే ఏర్పాటు చేసినప్పటికీ సిబ్బంది నర్సు సెలవులో ఉన్నారని సమాధానం చెప్పటం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. సామాన్య ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించడానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రగతి నగర్ నాలుగో డివిజన్ బస్తీ దవాఖానాలో కూడా మందులు సకాలంలో సరఫరా చేయాలని రక్త పరీక్షలు కేంద్రం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నిజాంపేట రాజీవ్ గృహకల్ప సీపీఐ (ఎం)నాయకులు ఎం.చంద్రశేఖర్, బాల పీరు అధికారులకు విన్నవించారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిపై ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిన శుభ తరుణంలో కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మెన్ మదన్ మోహన్, కూకట్‌పల్లి ఎ బ్లాక్ ఎస్సీ సెల్ వైస్ చైర్మెన్ జల్లా శివలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లకు పైగా జరుగుతున్న సుప్రీం తీర్పు ఎంతో ఉపశమనం కల్పిం చిందన్నారు. వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం ఉందని, సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు విలువరించిన నేపథ్యంలో తెలంగాణలో మాదిగ ఉపకులాల ప్రజలకు ఆకాంక్షలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకుని పనిచేస్తుందన్నారు. విద్యా ఉద్యోగ రంగాలలో సమాన అవకాశాలు కల్పించేలా వ్యవస్థలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ ముకేందర్, కన్వీనర్ ప్రకాష్, పులి శ్రీకాంత్ పటేల్, చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ నాయకుడు భరత్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 9న తీజ్ ఉత్సవాలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఆగస్టు 9 న ప్రపంచ ట్రైబల్ డే ను పురస్కరించుకొని బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టీయూ హెచ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధరావత్ వినోద్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకాశ నాయక్, రాహుల్, అనుష, హర్షిని, శశి కుమార్, మిస్కిల్ రాహుల్, సురేష్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-నేరేడ్ మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని శివానగర్ ఫేస్ టూ లోని కాలనీవాసులు రోడ్డు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగ, కార్పొరేటర్ కృషితో రోడ్డును శాంక్షన్ చేయించి, రోడ్డును వేయించారు. కాలనీలో మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని కోరాగా, శుక్రవారం కార్పొరేటర్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను వీలైన త్వరలో పనులను పూర్తి చేస్తామని కాలనీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మి, కాలనీ వాసులు కృష్ణ స్వామి, మల్లేష్, ఓం ప్రకాష్, సాయి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి ..

వినాయక నగర్ డివిజన్ పరిధిలోని అన్ని ఏరియాలలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం జరుగుతున్న నూతన రోడ్డు పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి క్యానం రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలోని రోడ్లు, డ్రయినేజీ, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మి, కాలనీవాసులు శ్రీధర్, శ్రీధర్ బాబు, మహేశ్వరి, ఓం ప్రకాష్, సాయి సురేష్, పాల్గొన్నారు.



పేదలకు అండగా సార



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సార పేద విద్యార్థులకు అండగా నిలుసున్నారు. కాప్రా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 9.2 మార్కులు సాధించిన సౌమ్య అనే పేద విద్యార్థినికి అండగా నిలిచారు. ఈసీఐఎల్‌లోని గీతం జూనియర్ కాలేజీలో సౌమ్యను ఇంటర్ ఫస్టియర్‌లో జాయిన్ చేశారు.

అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హైదర్ నగర్‌లో చేపట్టినటువంటి సీసీ రోడ్లు, డ్రయినేజీ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ు మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com

ప్రజావాణిలో 472 ఫిర్యాదులు

నవతెలంగాణ-బంజారా హిల్స్

ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 472 దరఖాస్తులు అందాయి.రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 107, పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 64 , విద్యుత్ శాఖ కు సంబంధించి 59,సోషల్ వెల్ఫేర్ కు సంబంధించి 31, మైనారిటీ వెల్ఫేర్ కు సంబందించి 26 ఇతర శాఖలకు సంబంధించి 165 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు.

క్యాబినెట్ సబ్ కమిటీ కాలయాపన చేయడంతోపాటు కోర్టు కి అడ్వకేట్ జనరల్ 20 సార్లు డుమ్మ కొట్టడంతో తీవ్ర మనస్తాపం చెంది ఇప్పటికి 14 మంది మరణించడం జరిగిందనీ తమకున్యాయం జరిగేంతవరకు ప్రజా భవన్ నుంచి కదిలేదే లేదంటున్న జీవో నెంబర్ 46 మెరిట్ బాధిత నిరుద్యోగుల బైటాయించారు. న్యాయస్థానం తీర్పునకు అందరం కట్టుబడి ఉండాలని అధికారులు, పోలీసులు వారికి నచ్చజెప్పారు.



జూబ్లీహిల్స్ లోని కేబీఆర్ పార్క్‌లో గేట్ నంబర్ 5 వద్ద ఫౌంటెన్‌కు, భారీ రాళ్ళకూ (రాక్),లైటింగ్ నూ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ వెల్దాండ వెంకటేష్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 ఎలక్ట్రికల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - బంజారాహిల్స్

నగరంలో బస్సుల సంఖ్యను పెంచాలి



- బస్సులు సరైన సమయంలో రావాలి
- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు

నవతెలంగాణ-బంజారాహిల్స్

నగరంలో బస్సులు అధిక సంఖ్యాలో పెంచాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీ బస్సులు పెంచాలని కోరుతూ పార్టీ ఖైరతాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్ బస్ స్టాప్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ బస్సు పేరుతో బస్సులు అధిక సంఖ్యలో రహదారులపై తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్సులు సరైన సమయంలో రాకపోవడంతో గంటల తరబడి ప్రయాణికులు బస్టాపుల్లో వేచి ఉండే పరిస్థితి నెలకొందని అన్నారు. ఎక్కువగా ప్రయాణించే దినసరి కూలీలు, కార్మికులు ఈ సమస్యను తమ దృష్టికి తీసుకరావడంతో పార్టీలో చర్చించి ఈ సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, ఖైరతాబాద్ జోన్ కార్యదర్శి గోపాస్ కిరణ్, జోన్ నాయకులు పి శ్రీనివాస్, బి.శ్రీనివాస్, కె రాధిక , బి మాధవి , ఎస్ కొండల్ రావు, కె రాము ప్రయాణికులు పాల్గొన్నారు.618

సనత్ నగర్ జోన్‌లో

బేగంపేట్ : హైదరాబాద్ నగరంలో బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ సనత్ నగర్ జోన్‌లో గాంధీ హాస్పిటల్ ఎదురుగా బస్ స్టాప్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యురాలు నాగలక్ష్మి, మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలిపంచడం మంచిదే కానీ నగర జనాభా కు అనుగుణంగా బస్సుల సంఖ్య లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో హైదరాబాద్‌లో 3800 బస్సులు ఉండేని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేండ్లలో 1000 బస్సులు తగ్గించడంతో ప్రస్తుతం 2800కు తగ్గిపోయా యన్నారు. రవాణా నిపుణుల అంచనా ప్రకారం నగర అవసరాలకు కనీసం 7000 బస్సులు అవసరమైతాయని అంచనా అని.. ప్రభుత్వం వీలైనంత త్వరగా బస్సుల సంఖ్యను పెంచి ప్రజల ఇబ్బందులు తొలగించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు పి.మల్లేష్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు

బోరబండ బస్ స్టాప్‌లో..

జూబ్లీహిల్స్ : 80 శాతం పేద ప్రజలు నివసించే బోరబండ కు బస్సులు పెంచాలని ,ప్రజా రవాణా వ్యవస్థ లో భాగమైన టీఎస్ ఆర్టీసీ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, లాభ పేక్ష లేకుండా తన సేవలు ప్రజలకు ముఖ్యంగా విద్యార్థిని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా బస్సులు పెంచాలని బోరబండ బస్ స్టాప్ లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు సాయి శేషగిరిరావు మాట్లాడుతూ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య వెంటనే పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. బోరబండకు అన్ని డిపోల నుంచి ప్రతిరోజు 88 బస్సులకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయని ,ప్రతి ఒక్క బస్సు ఆరు ట్రిప్పులు కనీసం తిరుగుతుందని, ఈ లెక్కన బోరబండ బస్ స్టాప్ కి రోజుకి 700 కి పైగా బస్సులు వస్తాయని, ఇక్కడ ఉన్న ప్రజలకు ఏమాత్రం సరిపోవన్నారు. 45 ఎఫ్ నెంబర్ బస్సును కరోనా తర్వాత నడపటం లేదని ,చాలా రూట్లలో బస్సులు సంఖ్య తగ్గించారని, ఇందిరాపార్క్ కెళ్లే 113 వై ఎఫ్ బస్సులు సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని, వెంటనే బోరబండకు బస్సులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. బోరబండ నుంచి ఎస్‌పీ ఆర్ హిల్స్ కు బస్సులు నడపాలని, బోరబండ రహమత్ నగర్ విద్యార్థులకు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే బస్ భవన్ ఎదుట పెద్ద ఎత్తున ఈనెల 8న ధర్నా చేపడతామని, ఈ లోపల అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ ,జె స్వామి, ఏ ఆర్ నరసింహ, బాలు సోమేశ్, దాదిమల్ల కృష్ణ, సోమల నాయక్ తదితరులు సంతకాల సేకరణలో పాల్గొన్నారు.





అవయవదానంతో పునర్జన్మ...



- జీవన్‌దాన్ చైర్ పర్సన్, డీఎంఈ డాక్టర్ ఎన్. వాణి

నవతెలంగాణ-బేగంపేట

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరికొందరికి పునర్జన్మ ఇవ్వవచ్చని, అలాంటి దాతల ఔదార్యాన్ని వారి కుటుంబ సభ్యుల సామాజిక స్పృహను, పెద్ద మనస్సును అభినందిస్తున్నామని జీవన్‌దాన్ చైర్ పర్సన్, డీఎంఈ డాక్టర్ ఎన్. వాణి అన్నారు. జాతీయ అవయవ దాన దినం పురస్కరించుకుని శనివారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల ఆడిటోరియంలో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో కాడవర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా 143 మంది దాతల కుటుంబాలను సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. జీవన్‌దాన్ కో-చైర్మెన్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఇందిర, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.ఎన్. రాజకుమారి, గాంధీ నెఫ్రాలాజీ హెచ్వడి డాక్టర్ మంజూషలు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010 నుంచి బ్రెయిన్ డెడ్ కారణంగా మెదడు చనిపోయిన వ్యక్తుల అవయవాలను జీవన్‌దాన్‌లో ధరఖాస్తు చేసుకున్న వారికి డొనేషన్‌లో ఇవ్వడం జరుగుతున్నదని అన్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ దవాఖానాలలో జీవన్‌దాన్ ద్వారా 2022 జూలై నుండి 2023 మార్చి వరకు బ్రెయిన్ డెడ్ అయిన 1465 దాతల నుండి సేకరించిన 5541 అవయవాలను ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి అనేక మందికి పునర్జన్మను అందిం చగలిగామని అన్నారు. అలాగే, 2024లో ఇప్పటివరకు 103 బ్రెయిన్ డెడ్ దాతల నుంచి అవయవాలను సేకరించామని, రిజిస్టర్ చేసుకున్న వారికి వరుసక్రమంలో అవయవమార్పిడి చేయడం కొనసాగుతున్నదని తెలిపారు. ఈ ఉత్తమ సేవలకు గాను తెలంగాణ జీవన్ దాన్ నాలుగు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక కావ దం సంతోషకరమన్నారు. దాతల కుటుం బ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. తమవారి సామాజిక సేవను గుర్తించి ఇక్కడకు పిలిచి సత్కరించడం కొంత సంతృప్తి కలిగించిందని దాతల కుటుంబ సభ్యులు అన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు
మెకానికల్ థ్రోంబెక్టమీ ప్రొసీజర్ ద్వారా చికిత్స



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అపోలో హాస్పిటల్స్ మరో మైలురాయిని సొంతం చేసుకుంది, నలుగురు బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు విజయవంతంగా మెకానికల్ థ్రోంబెక్టమీ ప్రొసీజర్ నిర్వహించింది , నలుగురిలో ముగ్గురు 74 ఏండ్లకు పైగా వయసుగలవారు ఉండడం గమనార్హం. ఇది తెలంగాణ అపోలో వైద్యుల నిబద్ధతకు నిదర్శనం అని యజమాన్యం పేర్కొంది

ప్రపంచవ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్ వైకల్యం, మరణాలకు ప్రధాన కారణం సకాలంలో. ఈ లక్షణాలను గుర్తించుటకు, ఆకస్మిక తిమ్మిరి లేదా బలహీనత, గందరగోళం, మాట్లాడటంలో ఇబ్బంది, తీవ్రమైన తలనొప్పి వంటివి గుర్తించి చికిత్స తీసుకున్నట్లైతే ప్రమాదం బారి నుండి కాపాడుకోవచ్చు.

తమ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సురేష్ గిరగాని న్యూరాలజిస్టులు డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ సందీప్ నాయని, డాక్టర్ యశ్వంత్తో పాటు ఎమర్జెన్సీ ఫిజిషియన్లు, న్యూరో అనస్థీషియన్లు , స్పెషలైజ్డ్ నర్సింగ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం, 24 గంటలు నిర్విరామంగా శ్రమించి నలుగురు రోగులకు విజయవంతగా ప్రొసీజర్ లను నిర్వహించారని యజమాన్యం తెలిపింది. గతంలో బ్రెయిన్ స్ట్రోక్ కు చికిత్స 4.5 గంటలలోపు tPAని ఉపయోగించటానికి పరిమితం అయి ఉండేది. పెద్ద నాళాల మూసివేత ఉన్న రోగులలో కేవలం 30-40 శాతం మంది లో మాత్రమే సత్ఫలితాలు కనిపించేవి. ప్రస్తుతం మెకానికల్ థ్రోంబెక్టమీ అనేది నిర్దిష్ట రోగులలో బ్రెయిన్ స్ట్రోక్ ప్రారంభమైన 24 గంటల వరకు నిర్వహిస్తారు. పెద్ద గడ్డలను యాంత్రికంగా తొలగించడంలో ఉత్తమమైనది , రక్త ప్రసరణను పునరుద్ధరణను గణనీయంగా మెరుగుపరుస్తుంది.

మెకానికల్ థ్రోంబెక్టమీ బ్రెయిన్ స్ట్రోక్ పేషెంట్లలో లైఫ్ సేవింగ్ ప్రొసీజర్ గా పరిగణిస్తారు. దీని ద్వారా మెదడు లో గడ్డ కట్టిన రక్తం గడ్డలను తొలగిస్తారు .ఇది 24 గంటల లోపు చేసినట్టయితే రోగి తిరిగి పూర్తిగా కోలుకునే అవకాశాలు చాలా అధికంగా ఉంటాయని డాక్టర్ సురేష్ గిర్గాని తెలిపారు. గతంలో ఇస్కీమిక్ బ్రెయిన్ స్ట్రోక్లకు (రక్తం గడ్డకట్టడం వల్ల కలిగే) ప్రధాన చికిత్స కణజాల ప్లాస్మినోజెన్ యాక్టివేటర్ (tPA), క్లాట్-బస్టింగ్ మందు. ప్రభావవంతంగా ఉన్నప్పటికీ, ఇది నిర్దిష్ట సమయ విండోలో (సాధారణంగా 4.5 గంటలలోపు) నిర్వహించాల్సి ఉండేది.

మెకానికల్ థ్రోంబెక్టమీ ప్రొసీజర్ లో కాథెటర్ను మెదడులోని నిరోధించబడిన ధమని వరకు ప్రవేశపెట్టి ,స్టెంట్ రిట్రీవర్స్ లేదా ఆస్పిరేషన్ డివైజ్ల వంటి ప్రత్యేక పరికరాలు క్లాట్ను క్యాప్చర్ చేయడానికి, తొలగిం చడానికి ఉపయోగించబడతాయి. ఈ ప్రక్రియ సాధారణంగా ఇంటర్వెన్షనల్ న్యూరోరేడియాలజిస్ట్ లు మాత్రమే నిర్వహించగలుగుతారు అని డాక్టర్ సురేష్ గిరగాని వివరించారు.



సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

- కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఒకటో వార్డ్ జయనగర్ నల్ల పోచమ్మ దేవాలయంలో బోయిన పల్లి యాదవ సంఘం ప్రతినిధి, కాంగ్రెస్ నేత అరుణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ శుక్రవారం ప్రారంభించారు. హుండీలలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయాలలో అలాంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉండాలంటే సీసీ కెమెరా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వీటిని అందించిన అరుణ్ యాదవ్‌కు జంపన కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభు గౌడ్, టీంకు గౌడ్, అనిల్, శశి,జ్ఞన్ ప్రకాష్, అశోక్, సులేమాన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు..

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



- ప్రొఫెసర్ కాసిం

నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం అని ప్రొఫెసర్ కాశిం, అన్నారు. ఇది 30 ఏండ్ల పోరాటాల త్యాగాలకు దక్కిన ఫలితం అని కొనియాడారు. శుక్రవారం సాయంత్రం ఓయూ ఆర్ట్స్ కళాశాల 121వ రూమ్ లో ఏర్పాటు చేసిన మాదిగ ప్రొఫెసర్ల విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాష్ట్రంలో కూడా వర్గీకరణ చేస్తామని, నోటిఫికేషన్ లో వర్గీకరణ తీర్పు అమలు చేస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వెంటనే సుప్రీంకోర్టు తీర్పును అమలు పరచాలని విజ్ఞప్తి చేశారు. 1994 జులై 7న ఈదుముడి గ్రామంలో 20 మందితో ప్రారంభమైన ఈ ఎమ్మార్పీఎస్ 30 ఏండ్ల నీతి , నిజాయితీ , నిబద్ధత , పోరాటంతో విజయం సాధించవచ్చు అనే అంశానికి సాంకేతిమిచ్చిందని కొనియాడారు.ఈ పోరాటంలో ప్రత్యక్షంగా , పరోక్షంగా , పాల్గొని మద్దతు ఇచ్చిన వారందరికీ వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రో.గడ్డం మల్లేశంమాట్లాడుతూ రానున్న పీజీ ప్రవేశాల్లో , ఎంసెట్ , గ్రూప్ వన్ , ఇతర పోటీ పరీక్షల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలనికోరారు. అవసరమైతే గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తెచ్చి అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాట మీద నిలబడి ఉండాలన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన వారెవరూ ఎలాంటి వైరుధ్యం సృష్టించవద్దని కోరారు. ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో. చింత సాయిలు మాట్లాడుతూ. ఇది ఒక సర్ప్రైజ్ అని శ్రమకు తగ్గ గౌరవం అని మందకృష్ణ మాదిగ చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ. మందకృష్ణ మాదిగకు కతజ్ఞతలు తెలియజేశారు. ప్రొఫెసర్ డైసీ మాట్లాడుతూ ఇది రానున్న తరాల వారికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఓయూ చీఫ్ బాటిల్ ప్రో. కొరెముల. శ్రీనివాస్ , డాక్టర్ మేడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జాబ్ క్యాలెండర్

- బీఆర్ఎస్వీ నేత అవినాష్ బాలెంల



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగ ఖాళీల గురించి లేకపోవడం గమనార్హమని, కేవలం ఆ క్యాలెండర్ ఏ పరీక్ష ఎప్పుడు పెడుతామో, అర్హత అనేది తప్ప మరేమీ లేదని బీఆర్ఎస్వీ నేత అవినాష్ బాలెంల అన్నారు. వాటితో నిరుద్యోగులకు ఒరిగేది ఎంటో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ యావత్ తెలంగాణ నిరుద్యోగులను వారి అధికార దాహం కోసం వాడుకొని నేడు కుర్చీలో కూర్చున్న తరువాత వారి సమస్యలు అసలు పట్టించుకునే పరిస్థితులు లేవని వాపోయారు. రానున్న రోజుల్లో అదే నిరుద్యోగులు ప్రతి ఎన్నికల్లో మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

నసీరుద్దీన్ షా దర్గాలో ప్రారంభమైన ఉర్సు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి నసిరుద్దీన్ షా దర్గాలో శుక్రవారం ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఉండే కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్ద నరసింహ యాదవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గాలోని మత పెద్దలు వారిని ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రే జంగయ్య, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇజాజ్, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ భాయ్, ప్రధాన కార్యదర్శి హరినాథ్, ఇలియాజ్, మిరాజ్, బుర్రి యాదగిరి, పెంటయ్య, బబ్లు, షకీల్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మణికేశ్వరీ నగర్ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోయా కుమార్ ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు తీర్పు స్వాగతిస్తు శుక్రవారం రాత్రి మాణికేశ్వరి నగర్ లో విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ ఇది 30 సంవత్సరాల సామాజిక పోరాటం అని మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం సంబురాలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి జి. రవి , గిరిబాబు , మహేష్ , కళ్యాణ్ , కృష్ణ ,రాం చందర్ ,సైదులు , జయంతి, పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సీఎంకు పులాభిషేకం



నవతెలంగాణ-ఓయూ

జాబ్ క్యాలెండర్ విడుదల సందర్భంగా ఓయూలో నిరుద్యోగ విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంపాల రాజేష్, ఓయూ జేఏసీ నాయకులు నోముల శేషు, సైదులు యాదవ్,వలిగొండ నరసింహ లు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్ ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తామనడం సంతోషమని హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల కోరిక జాబ్ క్యాలెండర్‌తో పాటు 25 లక్షల మంది ఉపాధి అవకాశాలు కల్పించేలా యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచన గొప్ప నిర్ణయం అని సీఎంను కొనియాడారు. విద్యార్థులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

దయాకర్ ఆధ్వర్యంలో...

జాబ్ క్యాలండర్‌తో నిరుద్యోగుల పాలిటీ వరం అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట దయాకర్ ఆధ్వర్యంలో స్వీట్స్ పంపిణి చేశారు. 32 ఏండ్ల లో ఎక్కడా లేని విధంగా జాబ్ క్యాలండర్ విడుదల చేయడం, నిరుద్యోగులకు తెలంగాణలో ఉద్యోగ అవకాశాలు యూపీఎస్సీ తరహాలో రాష్ట ప్రభుత్వం ఆలోచన చేయడం శుభ పరిణామం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతి అన్నారు. 10 ఏండ్లు పాలించిన బీఆర్ఎస్ పాలకులు డీఎస్సీని భర్తీ చేయలేదన్నారు. కేటీఆర్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతికత లేదు అన్నారు. కార్యకమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మెడ శ్రీను, వినయ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, సతీష్ యాదవ్, శేఖర్ చికుళ్ల, గణేష్, భార్గవ్ విద్యార్థులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచారం లేకుండా వర్గీకరణ ఎలా చేస్తావు..?

- మాల పొలిటికల్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ మంచాల లింగస్వామి



నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీం కోర్టు రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ తీర్పును వెలువరించిన వెంటనే తెలంగాణ అసెంబ్లీలో ఆర్డినెన్సు తీసుకొస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు మాల పొలిటికల్ జేఏసీ చైర్మెన్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు."సామాజిక వివక్షత పునాదులుగా ఎస్సీలకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారు. ఈ ఎస్సీ రిజర్వేషన్ల ప్రాథమిక సిద్ధాంతాన్ని విస్మరించి సుప్రీంకోర్టు ఆర్థిక వ్యత్యాసం బట్టి వర్గీకరించుకోవచ్చు అని రాష్ట్రాలకు అధికారాన్ని అప్పజెప్పడం రాజ్యాంగ విరుద్ధం. సుప్రీం కోర్టు తీర్పు రాగానే ఆఘమేఘాల మీద అసెంబ్లీలో అవసరమైతే ఆర్డినెన్సు తీసుకొచ్చి తక్షణమే అమలు చేస్తామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆర్డినెన్సు తీసుకొచ్చే ముందు తెలంగాణలో మాల, మాదిగ, ఉపకులాల జనాభా లెక్కలు తీయండి. రాష్ట్రంలో మాల మాదిగల్లో భూములు ఎవరికి ఎక్కువ ఉన్నాయి, గ్రూపు 1 నుంచి మొదలుకొని పారిశుధ్య కార్మికుల వరకు ఉద్యోగాలు ఏ కులం నుండి ఎక్కువ మంది ఉన్నారు, గత పదేండ్లలో ఎస్సీ కార్పొరేషన్ లోన్లు, దళిత బంధు పథకం, దళితులకు మూడెకరాల భూమి పథకాల్లో ఎవరు ఎక్కువ ఆర్థికంగా బలపడ్డారు, లిడ్ క్యాపు లోన్లు ఎవరు పొందారు అనే లెక్కలు తీయండి. ఇవి అన్నీ తేల్చిన తర్వాత సీఎం వర్గీకరణ గురించి మాట్లాడాలి. మాదిగల ఓట్ల కోసం మాలలను విస్మరించేలా వ్యాఖ్యలు చేస్తే రేవంత్ రెడ్డి మాలల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది" అని అన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఓయూ

ఏబీవీపీ ఓయూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీల పదవి కాలం ముగిసి దాదాపు 3 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటు అన్నారు.ఇన్‌చార్జ్ వీసీలతో కాలయాపన చేస్తూ యూనివర్సిటీల మనగడకే ముప్పు తీసుకువస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడితే యూనివర్సిటీలకు మహర్దశ తీసుకొస్తాం , పునర్జీవం పోస్తామని డబ్బా కొట్టారు కానీ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 7 నెలల సమయం కావస్తున్న ఇప్పటివరకు యూనివర్సిటీల సంక్షేమం గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. యూనివర్సిటీలలో 82 శాతం ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్యక్రాంతమవుతున్న యూనివర్సిటీ భూములను కాపాడాలని, అశాస్త్రీయంగా పెంచిన పీజీ, ఇంజినీరింగ్, పీహెచ్‌డీ ట్యూషన్, ఎగ్జామ్ ఫీజులను తగ్గించాలని, తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థుల మీద పోలీసులు జులుం ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ పథ్వి తేజ ,స్టేట్ అల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్స్ శ్రీహరి ,కమల్ సురేష్, సుమన్ శంకర్, రాజు మరియు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

రైలులో గంజాయి తరలింపు.. పట్టివేత

నవతెలంగాణ-బేగంపేట్



రైలులో గంజాయి తరలిస్తున్న నిందితులను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో కొందరు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నారని సమాచారం వచ్చిందని, దీంతో అప్రమత్తమైన సిబ్బంది రైలులో తనిఖీలు నిర్వహించారని చెప్పారు. అనుమానాస్పదంగా ఉన్న నాలుగు బ్యాగులను పరిశీలించగా 10కిలోల గంజాయి దొరికిందన్నారు. కాగా గంజాయి తరలిస్తున్న నిందితులు తప్పించుకున్నారని , వారి కోసం గాలిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇదే క్రమంలో సంగారెడ్డి ఎన్టీఆర్‌నగర్ గోపన్‌పల్లిలో నాటుసారా పట్టుకున్నామని తెలిపారు. మంచిర్యాలలో నాలుగు కేసులు నమోదు చేసి 540 కేజీల బెల్లాని, 20 లీటర్ల నాటుసారాను, పట్టుకున్నామని ఆయన వెల్లడించారు.

13

నవతెలంగాణ

హైదరాబాద్

HMDA

శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com



కాచిగూడ బస్ స్టేషన్‌లో సిటీ బస్సుల సంఖ్య పెంచాలని సంతకాల సేకరణ కరపత్రాల పంపిణీ చేసిన సీపీఐ(ఎం) నగర నాయకులు మహేందర్, రాములు,, షబానా బేగం వరలక్ష్మి తదితరులు.

నవతెలంగాణ-అంబర్‌పేట

IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT: AT IBRAHIMPATNAM: O.S.NO.50 OF 2022

Sapavath Balu & others ... Plaintiffs

AND

Sapavath Balu & others ... Defendants

To

D.Reddi Kumar Reddy S/o D. Narayana Reddy, Aged about 52 year Occ: Advocate, R/o. 6-3-008/120/103, Anand Nagar Colony, Khairatabad, Hyderabad - 500004, (DI3)

.....Defendant No.13

Please take notice that the Plaintiff herein has filed a suit for Partition and separate Possession in respect of land bearing Sy.No. 1452, measuring Ac.4-08 gts., situated at Yellamma Thanda, Arutla revenue village, Manchal Mandal, R.R.District, vide O.S.No. 50/2022, on the file of the Hon'ble Addl.Junior Civil Judge, at Ibrahim patnam and the same ts posted on 09-08-2024 for your appearance and counter In the matter. As such, any person or persons have any sort of objection in respect of said claim of the Plaintiff may approach the Hon'ble Court at 10-30 A.M., on the above said date, otherwise the Hon'ble Court will pass appropriate orders based on the materials available on record.

SCHEDULE OF PROPERTY

All part and parcel of the land bearing Sy.No.1452, measuring Ac.4-08 gts., situated at Yellamma Thanda, Arutla revenue village, Manchal Mandal, R.R.District, bounded by:

North: Land of Bheekya.
South:Land of Ghansi S/o Hanma.
East : Land of Rediya.
West : Land of Banoth Mothilal.

//BY ORDER OF COURT//
A.SRINIVAS KUMAR, Advocate,
#Near MRO Office, Opp: Library, Ibrahimpatnam, R.R.Dist.
PH.No.9948772999, 9348007999

IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD O.S.No.6045 of 2023

Between:-

Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law)&Authorized Officer, ...Plaintiff

And

Sri.Jetharam Kumawat ...Defendant

To

Sri.Jetharam Kumawat, S/o.Fooli Devi, Aged about 32yrs, Occ: Business, R/o.10-1-88/B Main Road Vardhan Complex, Karmanghat, Hyderabad, Telangana-500079.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs 6,51,688-27ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 21-08-2024. In case of your failure to attend before the Court **on 21-08-2024 at 10-30 A.M.** either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYD-50.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD O.S.No.1519 of 2024

Between:-

Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law) &Authorized Officer, ...Plaintiff

And

Sri.Abid Mohammed ...Defendant

To

Sri.Abid Mohammed W/o.Late Mohd Ismail, Aged 58yrs, Occ: Business, R/o.H.No.1-9-337/A, Vidyanagar, Adikmet, Hyderabad-500020.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs. 2.86,436-89 ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 08-08-2024.

In case of your failure to attend before the Court **on 08-08-2024 at 10-30 A.M.** either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYD-50.

CHANGE OF NAME

I, Thumu Haridhar Reddy son of Thumu Chandra Shekhar Reddy R/O flat no G2 plot number 484 Sai Rakshita Residency Narsingi heights Narsingi RR district 500075 hearby state that my name was recorded as **T Haridhar S/o T Chandra shekar** in my academic certificates. My actual and correct name is **Thumu Haridhar Reddy S/o Thumu Chandra shekhar Reddy** which is as per Aadhar and PAN card

IN THE COURT OF THE HON' BLE ADDL JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT : AT IBRAHIMPATNAM : O.S.NO. 50 OF 2022

Sapavath Balu & others ... Plamtiffs

AND

Sapavath Balu & others ... Defendants

C.L.S. Properties, a Regd. Partner Ship Firm, rep.by its Partner R.V. Narasimha Raju, S/o RL.Raju, havingits regd. office at 702-A, Kushal Towers, Khairatabad, Hyderabad.(D14)

... Defendant No. 14

రాష్ట్రంలో 30 లక్షల మంది ఇల్లూ, వాకిలి లేకుండా ఉన్నారని, కానీ ప్రధాని మోడీ మాత్రం రూ.465 కోట్లతో ఇల్లు నిర్మించుకున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో రెండు బొగ్గు బ్లాకులను ప్రయివేటుకు అప్పగించగా.. తాజాగా కాంగ్రెస్ హయాంలో శ్రావణపల్లి బొగ్గుబ్లాకుకు వేలం పాట వేయడాన్ని కార్మికవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా తప్పుబడుతుందని తెలిపారు. సింగరేణి యూనిట్ విద్యుత్‌ను రూ.4కు అందిస్తే, ప్రయివేటు చేతుల్లోకి వెళ్తే యూనిట్‌కు రూ.18వసూలు చేస్తుందని అన్నారు. కేంద్రంలో మోడీ వచ్చిన తర్వాత కోల్ ఇండియా, సింగరేణిలోనూ ప్రయివేటు వాళ్లకు హక్కులు కల్పిస్తూ చట్టం తీసుకొచ్చారని అన్నారు. విదేశీయులు కూడా బొగ్గును తవ్వుకోవచ్చనే చట్టాలు చేస్తే వీటిని కాంగ్రెస్ కూడా సమర్థించిందని విమర్శించారు. వేలం పాట పెడితే కోల్ ఇండియా, సింగరేణి సంస్థలు ప్రయివేటుతో పోటీపడి దక్కించుకోవాలని చెబుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే.. ఇక్కడ గెలిచిన ఎంపీ కిషన్‌రెడ్డి.. కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి అయి రాష్ట్రాన్ని నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కూర్చొని వేలం పెట్టారని, దానికి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హాజరై రిబ్బన్ కట్ చేశారని తెలిపారు. అడ్డుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి వినతిపత్రం ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. సింగరేణిని ప్రయివేటుపరం చేస్తే ఆరు జిల్లాల్లోని కార్మికులతో పాటు దానిపై ఆధారపడి జీవిస్తున్న వారంతా ఉపాధి కోల్పోయి రోడ్డునపడే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి సింగరేణిని రక్షించుకునేందుకు తెలంగాణ ఉద్యమం వలే మరో ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. యాత్ర సభ్యులు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో, నిరుద్యోగ సమస్య పరిష్కారంలో సింగరేణి తనవంతు పాత్రను పోషిస్తోందని చెప్పారు. సింగరేణి వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్లు, పన్నుల రూపంలో ప్రతేడాది వేల కోట్ల రూపాయలు వస్తున్నాయని తెలిపారు. లాభాల్లో ఉన్న సింగరేణిని కేంద్ర ప్రభుత్వం.. అదానీ, అంబానీలకు అందించే దిశగా చర్యలు చేపట్టిందని, దాన్ని అడ్డుకొని పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ.. సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని, గతంలో ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన రెండు బ్లాకులను తక్షణమే సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, జె. వెంకటేష్, జగదీశ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, వెజ్ బోర్డ్ మెంబర్ మంద నరసింహారావు, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి కె. రాజయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాజయ్య, పోలం రాజేందర్, గుర్రం దేవేందర్, ఆత్కూరు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, సంఘం ప్రీతి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బహిరంగ సభ అనంతరం యాత్ర మణుగూరు వెళ్తున్న క్రమంలో పస్రాలో సీపీఐ(ఎం) కార్యకర్తలు యాత్రకు స్వాగతం పలికారు.

నాపై దాడులకు ఈడీ కుట్ర



న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్(గతంలో ట్విట్టర్)లో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తనపై త్వరలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు జరగొచ్చని అందులో రాసుకొచ్చారు. ఈడీ సోదాలపై తనకు విశ్వసనీయ వ్యక్తుల ద్వారా సమాచారమందిందని ట్వీట్ చేశారు. లోక్‌సభలో తాను చేసిన చక్రవ్యూహం ప్రసంగం కొంతమందికి నచ్చలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో తనపై ఈడీ దాడులు జరగొచ్చని ఆయన ఆరోపించటం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. " ఈడీ నాపై సోదాలకు సిద్ధమవుతున్నది. ఈడీలో పనిచేస్తున్న కొందరు విశ్వసనీయ అధికారులు నాకు ఈ సమాచారాన్ని తెలియజేశారు. గత నెల 29న తాను చేసిన చక్రవ్యూహం ప్రసంగం సాధారణంగానే ఇద్దరిలో ఒకరికి నచ్చలేదు. ఈడీ అధికారులను సోదాలకు ఆహ్వానించేందుకు చాయ్, బిస్కెట్లతో సిద్ధంగా ఉన్నాను" అని రాహుల్ గాంధీ ట్విటర్‌లో రాసుకొచ్చారు.

కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా పార్లమెంట్‌లో చర్చ జరిగింది. ఈ క్రమంలోనే లోక్‌సభలో రాహుల్ గాంధీ బడ్జెట్‌పై ప్రసంగిస్తూ.. కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని పద్మవ్యూహంలోకి నెట్టివేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగానే ప్రధాని మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా సహా పలువురిపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ సంపద మొత్తాన్ని కబళించాలని చూస్తున్న ఇద్దరు వ్యక్తులు మొదటి శక్తి కాగా.. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలు రెండో శక్తి అని తెలిపారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గాన్ని మూడో శక్తిగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఈ శక్తులన్నీ దేశాన్ని విధ్వంసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మహాభారతంలోని కురుక్షేత్ర సంగ్రామంలో కీలక ఘట్టమైన పద్మవ్యూహాన్ని.. అందులో వీరమరణం పొందిన అభిమన్యుడిని కూడా రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. అభిమన్యుడిని చక్రవ్యూహంలో ఎలా హత్య చేశారో.. ఇప్పుడు దేశాన్ని కూడా ఆ ఆరుగురు అదే చేయబోతున్నారని.. రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సుప్రీం ఆదేశాల అమలుకు కార్యాచరణ చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

కులాలు (ఎంబీసీ) కడు పేదరికం అనుభవిస్తున్నాయని తెలిపారు. రిజర్వేషన్ల ఫలితాలు అన్ని తరగతులకూ దక్కాలంటే బీసీల్లో వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఈ వర్గీకరణను స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లకు వర్తింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా చైతన్య దీపిక

(మొదటిపేజీ తరువాయి)

సంచలనాలకు దర్పణం "దర్వాజ". నవకవుల నుంచి ప్రఖ్యాత రచయితల ప్రతి స్పందనలకు దర్వాజ తోరణం కడుతున్నది. సృజనకు, సాహిత్య విశ్లేషణలకు ప్రేరణ కలిగించే పేజీ దర్వాజ. 'మానవి' మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిస్తే, 'జోష్' యువతరానికి మార్గ దర్శనంప్రఖ్యాత రచయితల ప్రతి స్పందనలకు దర్వాజ తోరణం కడుతున్నది. సజనకు, సాహిత్య విశ్లేషణలకు ప్రేరణ కలిగించే పేజీ దర్వాజ. 'మానవి' మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిస్తే, 'జోష్' యువ తరానికి మార్గదర్శనం చేసే విజయగాథలతో ఉత్సాహపరుస్తున్నది. వివిధ శీర్షికల కదంబం ఆదివారం సోపతి– సగటు పాఠకుల అభిరుచులకు స్థానం కల్పిస్తూనే సమాజ చింతనం వైపు కదిలిస్తున్నది. బాలల ఆలోచనలను తీర్చిదిద్దే శీర్షిక 'నెమలీక' వినోదంతో సమానంగా వికాసం పంచుతున్నది.

సంపాదకపేజీ సామాజిక భావధార. పాఠకుల్ని ప్రయోజకులుగా తీర్చే రచనలు, సగటు ఆలోచనలను శాస్త్రీయంగా మలిచే సంపాదకీయాలు. దేశ, విదేశీ ఆర్థిక రాజకీయ పరిణామాలను లోతుగా విశ్లేషించే వ్యాసాలు ప్రచురిస్తున్నది. సాంకేతిక మాధ్యమాలు సగటు పౌరుని ఆలోచనలను ఛిన్నాభిన్నం చేస్తుంటే సరైన ఆలోచనను, స్పష్టమైన అవగాహనను, సామాజిక దక్పథాన్ని, సమగ్రజ్ఞానాన్ని సంపాదకీయాలు కలిగిస్తున్నాయి. ఒక్కమాటలో ప్రగతి దిశా నిర్దేశం చేసే పేజీ ఎడిట్ పేజీ. సమాజసేవలో నిరంతర ప్రయాణం చేస్తున్న నవతెలంగాణకు నవ వార్షికోత్సవ శుభానందనలు.

చిన్నారులపై దారుణాలు

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం మరో రెండు ఘటనలు వెలుగుజూశాయి. ఉప్పల్‌లోని ఓ ప్రయివేటు పాఠశాలలో రెండో తరగతి చిన్నారిపై విద్యార్థి అసభ్యకరంగా ప్రవర్తించగా, నిజామాబాద్ కేంద్రంలో ఐదేండ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడికి చేశాడు.

నిజామాబాద్ రెండో పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. బడాబజార్‌కు సమీపంలో గల కాలనీలో ఐదున్నర ఏండ్ల చిన్నారిపై అదే కాలనీలో నివాసం ఉంటున్న ఓ మేకల కాపరి లైంగిక దాడి చేశాడు. వీధిలో ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్ ఆశ చూపించి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. గురువారం చిన్నారి కడుపునొప్పి ఉందని చెప్పగా.. తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం లైంగికదాడి జరిగినట్టు నిర్ధారించారు. వెంటనే కుటుంబ సభ్యులు రెండో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫోక్సో చట్టం కింద కేసును నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

బాలికతో బాలుడి అసభ్య ప్రవర్తన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని ఓ పాఠశాలలో బాలికతో 15 ఏండ్ల బాలుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న బాలికపై తొమ్మిదో తరగతి బాలుడు గురువారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో చిన్నారి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో శుక్రవారం వారు పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దాంతో ప్రిన్సిపాల్ జోసెఫ్.. బాలిక తల్లిదండ్రులు, బాలుని తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. అనంతరం ఆ విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఫోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఐద్వా నాయకులు పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాలల్లో పిల్లలకు రక్షణ లేదని, ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్కూల్ ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

(మొదటిపేజీ తరువాయి)

బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.56 లక్షల కోట్లు ఆవిరై.. రూ.457.06 లక్షల కోట్లుగా నమోదయ్యింది. దీంతో ఆ మొత్తం మదుపర్లు నష్టపోయినట్లయ్యింది.

పశ్చిమాసియాలో ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపాయి. ముడి చమురు ధరల పెరుగుదల, కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు అంచనాలు చేరకపోవడం, అమెరికా, ఆసియా మార్కెట్లలో ప్రతికూలాంశాలు భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. నిఫ్టీ50లోని 42 స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. సెన్సెక్స్–30లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్ ఫార్మా, నెస్లే మినహా మిగితా స్టాక్స్ అన్నీ నేల చూపులు చూశాయి. నిఫ్టీలో రియాల్టీ, ఆటో, ఐటి, లోహ సూచీలు అధికంగా 2–3 శాతం వరకు విలువ కోల్పోయాయి. ఫార్మా, వైద్య స్టాక్స్ మాత్రమే సానుకూలంగా నమోదయ్యాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు 1.2 శాతం వరకూ పతనం అయ్యాయి.

నవచిత్రం


రవితేజ భాగ్యశ్రీ బోర్సే

రొమాంటిక్ మెలోడీ జిక్కీ..

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న మూవీ 'మిస్టర్ బచ్చన్'. శుక్రవారం మేకర్స్ థర్డ్ సింగిల్- 'జిక్కీ..' సాంగ్‌ని రిలీజ్ చేశారు. మిక్కీ జె మేయర్ మెస్మరైజింగ్ నెంబర్‌ని కంపోజ్ చేశారు. గీత రచయిత వనమాలి రాసిన ఈ పాటను కార్తీక్, రమ్య బెహరా అద్భుతంగా పాడారు. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాట రొమాంటిక్ మెలోడీగా అందర్నీ అలరిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానుంది.

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్


నాని

హీరో నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. తాజాగా మేకర్స్ ఓ బ్రాండ్ న్యూ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో నాని పవర్ ప్యాక్డ్ లుక్ లో అదరగొట్టారు. రగ్డ్ లుక్‌లో చేతిలో వెపన్ పట్టుకుని పవర్ ఫుల్ ఇంటెన్స్ యాక్షన్ మోడ్‌లో కనిపించారు. మూవీలో హైఆక్టేవ్ యాక్షన్ ఉండబోతోందని ఈ పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్తాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా అడ్రినలిన్ ఫిల్డ్ యాక్షన్-అడ్వెంచర్‌కు కార్తీక శ్రీనివాస్ ఎడిటర్. ఈనెల 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రియాంక అరుల్ మోహన్, ఎస్‌జె సూర్య, సాయి కుమార్, అజయ్, అదితిబాలన్, మురళీ శర్మ, అజయ్ ఘోష్, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి.

సర్దార్ 2 నాయిక..


మాళవిక మోహన్


హీరో కార్తి నటించిన 'సర్దార్' సినిమా తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా ఇటివలే 'సర్దార్ 2' రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో భారీ సెట్స్‌లో ప్రారంభమైంది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ దీనికీ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మించనుంది. తాజాగా మేకర్స్ ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో మాళవిక మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. ఓ పవర్ ఫుల్ పాత్రలో ఎస్ జె సూర్య నటిస్తున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మాత ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. దీనికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

విజయ్ దేవరకొండ విశ్వరూపం


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా 'మళ్ళీరావా', 'జెర్సీ' చిత్రాల దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో ఓ ఇంటెన్స్ యాక్షన్ డ్రామా చేస్తున్నారు. ఈ చిత్రంతో ఈ కాంబో అందరినీ థ్రిల్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'విడి12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ శ్రీలంకలోని సుందరమైన ప్రదేశాల్లో జరిగింది. ఇప్పటిదాకా 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ క్రమంలో చిత్ర విడుదల తేదీని ప్రకటించారు నిర్మాతలు. వచ్చే ఏడాది మార్చి 28వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ ఆగస్టులో ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.

వైజాగ్‌లో ట్రైలర్ లాంచ్


రామ్

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరీ జగన్నాథ్ మోస్ట్ ఎవెయిటింగ్ హై-బడ్జెట్ పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్'. దీని థియేట్రికల్ ట్రైలర్ ఈవెంట్‌ను ఈనెల 4న వైజాగ్‌లోని గురజాడ కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్, కావ్యా థాపర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న తెలుగు, తమిళం, కన్నడ, మల యాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. 'ఇస్మార్ట్ శంకర్' బ్లాక్‌బస్టర్ కావడంతో దీనికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. వాటిని మించేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

ఆటలు

బాణం గుచ్చుకుంది! ఆర్చరీలో తృటిలో చేజారిన కాంస్యం



ఆర్చరీలో భారత్‌కు బాణం గుచ్చుకుని గాయమైంది. ఒలింపిక్స్‌లో ఇప్పటివరకు మెడల్ పోటీకి చేరుకోని టీమ్ ఇండియా పారిస్‌లో ఆ దశకు చేరుకుంది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో బొమ్మదేవర ధీరజ్, అంకిత జోడీ కాంస్య పతక పోరులో తడబడింది. తృటిలో చారిత్రక ఒలింపిక్స్ కాంస్య పతకం చేజార్చుకుంది. కాంస్య పతక పోరులో యుఎస్ఏ (అమెరికా) భారత్‌పై 6-2తో విజయం సాధించింది. అంకిత తొలి రెండు సెట్లలో తడబడింది. 7, 10, 7, 9 స్కోర్లతో నిరాశపరిచింది. మూడో సెట్లో 10, 9 తో మెరిసినా చివర్లో మళ్లీ 8, 8తో తడబాటుకు గురైంది. ధీరజ్ 10, 10, 10, 9, 9, 10, 9, 9తో కండ్లుచెదిరే స్కోరు సాధించాడు. కానీ భాగస్వామ్య ఆర్చర్ అంకిత అంచనాలను అందుకోలేదు. దీంతో భారత్ నాలుగు సెట్లలో ఒక్క సెట్లోనే పైచేయి సాధించింది. 6-2తో విజయం సాధించిన అమెరికా ఆర్చర్లు కాంస్య పతకం ఎగరేసుకుపోయారు. షూటింగ్‌లో అర్జున్ బబుత ఇప్పటికే నాల్గో స్థానంతో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ విభాగంలో దక్షిణ కొరియా స్వర్ణం, జర్మనీ రజతం దక్కించుకున్నాయి. అంతకుముందు కీలక సెమీఫైనల్లో దక్షిణ కొరియా 6-2తో భారత్‌పై విజయం సాధించింది.

హ్యాట్రిక్ ఊరిస్తోంది!

- మరో మెడల్ ముంగిట మను బాకర్
- 25మీ పిస్టల్ విభాగం ఫైనల్లో అడుగు
- అర్హత రౌండ్‌లో నిరాశపరిచిన ఇషా సింగ్

పారిస్ 2024 ఒలింపిక్స్



పారిస్ ఒలింపిక్స్‌లో మను బాకర్ మేనియా నడుస్తోంది. టోక్యో ఒలింపిక్స్‌లో ఆశలు ఆవిరి చేసుకున్న మను బాకర్.. పారిస్‌లో పిస్టల్‌ను లక్ష్యంపై గురి పెట్టింది. ఇప్పటికే రెండు పతకాలు సాధించి రికార్డు నెలకొల్పిన మను బాకర్.. షూటింగ్ రేంజ్‌లో మరో మెడల్‌పై కన్నేసింది. 25మీ పిస్టల్ విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న మను బాకర్ నేడు చారిత్రక (ఆల్‌టైమ్ రికార్డు) హ్యాట్రిక్ మెడల్‌పై గన్ ఎక్కుపెట్టనుంది.

నవతెలంగాణ-పారిస్

ఒలింపిక్ షూటింగ్‌లో టీమ్ ఇండియా జోరు కొనసాగుతుంది. యువ షూటర్లపై నమ్మకం ఉంచిన జాతీయ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) పారిస్‌లో ఫలితాలు ఆస్వాదిస్తోంది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మూడు పతకాలు సాధించగా.. ఆ మూడు మెడల్స్ షూటింగ్ రేంజ్‌లో లభించినవే. అందులో రెండు 22 ఏండ్ల యువ షూటర్ మను బాకర్ సాధించింది. ఇప్పుడు భారత్ ఖాతాలో నాల్గో మెడల్ చేర్చేందుకు మను బాకర్ సిద్ధమవుతోంది. ఒలింపిక్స్‌లో తన మూడో విభాగంలో పిస్టల్ పట్టుకున్న మను బాకర్ అర్హత రౌండ్‌లో అదరగొట్టి సగం పూర్తి చేసింది. నేడు మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో మెడల్ కోసం మను బాకర్ పోటీపడనుంది. ఇదే విభాగంలో పోటీపడిన తెలంగాణ యువ షూటర్ ఇషా సింగ్ నిరాశపరిచింది.

అర్హతలో అదుర్స్

మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో మను బాకర్ మెప్పించింది. రెండు పతకాలతో ఒలింపిక్ విజయాన్ని, రెండు విభాగాల్లో తీవ్ర పోటీతో విశ్వ క్రీడల ఒత్తిడిని దాటేసి వచ్చిన మను బాకర్ తన చివరి ఈవెంట్‌లో ప్రశాంతంగా కనిపించింది. ఈ విభాగంలో 40 మంది షూటర్లు ప్రిసిజన్, ర్యాపిడ్ రౌండ్లలో షూటింగ్ నైపుణ్యం



ప్రదర్శించారు. మను బాకర్ 590 స్కోరుతో అర్హత రౌండ్‌లో రెండో స్థానంలో నిలిచింది. నేడు జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ప్రిసిజన్, ర్యాపిడ్‌లలో మూడేసి రౌండ్లలో.. ప్రతి సిరీస్‌లో పది సార్లు షూట్ చేయాలి. ఇందులో మను బాకర్ ప్రిసిజన్‌లో 97, 98, 99 (294).. ర్యాపిడ్‌లో100, 98, 98 (296)తో గురి తప్పలేదు. హంగరీ షూటర్ మేజర్ వెరోనిక 592 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ యువ షూటర్ ఇషా సింగ్ 581 పాయింట్లతో 18వ స్థానానికి పరిమితమైంది. వరుసగా 95, 96, 100 (291).. 97, 96, 97 (289)తో ఇషా సింగ్ అంచనాలను అందుకోలేదు. ఈ విభాగంలో మను బాకర్‌తో పాటు ఇషా సింగ్‌పై సైతం భారత్ పతక ఆశలు పెట్టుకుంది. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న ఇషా సింగ్ తొలి రౌండ్లోనే ఒత్తిడికి లోనైనట్టు కనిపించింది. 9, 8 సిరీస్ స్కోర్లతో దారుణంగా నిరాశపరిచింది. అర్హత రౌండ్‌లో టాప్-8 షూటర్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు.

పతకాల ఈవెంట్!

ఒలింపిక్స్‌లో 12 ఏండ్లుగా పతకం లేదు. టోక్యో ఒలింపిక్స్ ముందు నుంచే యువ షూటర్లపైనే ఆశలన్నీ. పారిస్‌లో ఏం చేస్తారో అనే ఉత్కంఠ. అంచనాలకు మించిన ప్రదర్శనతో పారిస్‌లో టీమ్ ఇండియాకు పతకాల పంట పండిస్తోంది షూటింగ్. ఇప్పటివరకు షూటింగ్ ఈవెంట్లలో భారత షూటర్లు ఆరు సార్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు. 10మీ ఎయిర్ పిస్టల్, 10మీ ఎయిర్ పిస్టల్ (టీమ్), 25మీ పిస్టల్ విభాగంలో మను బాకర్ ఫైనల్‌కు చేరుకుంది. మను బాకర్‌తో కలిసి సరబ్జోత్ సింగ్ టీమ్ విభాగంలో మెడల్ సాధించాడు. మను బాకర్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెల్చుకుంది. స్వప్నిల్ కుశాలె 50 మీ రైఫిల్ 3పీ విభాగంలో ఫైనల్స్‌కు చేరుకుని కాంస్యం సాధించాడు. అర్జున్ బబుత 10మీ ఎయిర్ రైఫిల్ విభాగంలో ఫైనల్‌కు చేరినా.. నాల్గో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 10మీ ఎయిర్ రైఫిల్ రమిత జిందాల్ ఫైనల్‌కు చేరింది, కానీ ఏడో స్థానానికి పరిమితమైంది. నేడు 25మీ పిస్టల్ విభాగంలో మను బాకర్ మరోసారి బరిలోకి దిగనుండటంతో భారత పతక ఆశలు తారాస్థాయికి చేరుకున్నాయి.

భారత్‌కు షాక్

భారత్, శ్రీలంక తొలి వన్డే టై

కొలంబో : మహిళల ఆసియా కప్‌లో ఆటపట్టు సేన.. హర్మన్‌సేనకు ఇచ్చిన ఝలక్ మరువక ముందే.. లంకేయులు టీమ్ ఇండియాకు గట్టి షాక్ ఇచ్చారు. భారత్, శ్రీలంక తొలి వన్డేలో విజయం దిశగా దూసుకెళ్తోన్న రోహిత్ సేనకు స్పిన్నర్లు బ్రేక్ వేశారు. ఆఖర్లో వరుస వికెట్లతో మ్యాచ్‌ను టై చేయగలిగారు. వానిందు హసరంగ (3/58), చరిత్ అసలంక (3/30), సహా దునిత్ వెల్లలాగె (2/39) రాణించటంతో ఆతిథ్య శ్రీలంక తొలి వన్డేలో నిలిచింది. 231 పరుగుల ఛేదనలో భారత్ 47.5 ఓవర్లలో 230 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (58, 47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు) అర్థ సెంచరీతో మెరువగా.. కెఎల్ రాహుల్ (31, 43 బంతుల్లో 2 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (23, 23 బంతుల్లో 4 ఫోర్లు), శివం దూబె (25, 24 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), అక్షర్ పటేల్ (33, 57 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అసలంక ఓవర్లో బౌండరీతో స్కోరు సమం చేసిన శివం దూబె.. లాంఛనం ముగిస్తాడని అనుకుంటే.. వరుస బంతుల్లో దూబె, అర్షదీప్ (0)ను అవుట్ చేసిన అసలంక పర్యాటకను జట్టుకు షాక్ ఇచ్చాడు. విరాట్ కోహ్లి (24), శుభమన్ గిల్ (16), వాషింగ్టన్ సుందర్ (5) నిరాశపరిచారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిశాంక (56), దునిత్ వెల్లలాగె (67) అర్థ సెంచరీలతో 50 ఓవర్లలో 230/8 పరుగులు చేసింది. భారత్, శ్రీలంక రెండో వన్డే ఆదివారం జరుగనుంది.





కంగారూను కొట్టేశారు

3-2తో ఆసీస్‌పై హాకీ ఇండియా గెలుపు

క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న భారత్

నవతెలంగాణ-పారిస్

పారిస్‌లో హాకీ ఇండియా నవ చరిత్ర లిఖించింది. పతకం ఖాయం అవకపోయినా.. అది ఎంతో దూరం లేదనే ధీమా కలిగించిన విజయం హాకీ ఇండియా సొంతమైంది. 52 ఏండ్లుగా హాకీ ఇండియాకు కొరకరాని కొయ్యగా మారిన ఆస్ట్రేలియాపై శుక్రవారం మనోళ్లు జయభేరి మోగించారు. గ్రూప్ దశలో ఆసీస్‌పై 3-2తో సంచలన విజయం సాధించారు. ఆస్ట్రేలియాపై టీమ్ ఇండియా సాధించిన విజయానికి విశేష ప్రాముఖ్యత ఉంది. వరల్డ్ నం.4పై భారత జట్టు టర్ఫ్ శకంలో సాధించిన తొలి ఒలింపిక్ విజయం ఇదే. ఆస్ట్రేలియాపై ఒలింపిక్స్‌లో భారత్ 52 ఏండ్ల తర్వాత ఓ గెలుపు రుచి చూసింది. చివరగా 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో ఆసీస్‌ను ఓడించిన భారత్.. ఇప్పుడు పారిస్‌లో ఆ ప్రదర్శన పునరావృతం చేశారు.

పారిస్ ఒలింపిక్స్ హాకీలో అగ్రజట్టు వరల్డ్ నం.4 ఆస్ట్రేలియాకు పంచ్ పడింది. పూల్-బి మ్యాచ్‌లో హాకీ ఇండియా చేతిలో ఆస్ట్రేలియా పరాజయం పాలైంది. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి డబుల్ ధమాకాతో రెచ్చిపోయాడు. ఆట ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన భారత ఆటగాళ్లు తొలి క్వార్టర్‌లోనే (15 నిమిషాలు) 2-0తో ముందంజ వేశారు. అభిషేక్ 12వ నిమిషంలో గోల్ కొట్టాడు. తొలి ప్రయత్నంలో గోల్‌ను ఆసీస్ గోల్ కీపర్ నిలువరించినా.. అభిషేక్ మరోసారి ప్రయత్నించి విజయవంతమయ్యాడు. భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. 13వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ సద్వినియోగం చేసుకున్నాడు. పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 2-0కు మెరుగుపర్చాడు. రెండో క్వార్టర్‌లో ఆసీస్ ఖాతా తెరిచింది. క్రెయిగ్ థామస్ 25వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. మూడో క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి మెరిశాడు. పెనాల్టీ స్ట్రోక్స్‌తో గోల్ కొట్టాడు. 3-1తో భారత్ ఆధిక్యం మరింత పెంచుకుంది. ఆట ఆఖరు ఐదు నిమిషాల్లో ఆసీస్ ఆటగాడు గోవర్స్ బ్లేక్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్ చేసి స్కోరు 2-3కు తీసుకొచ్చాడు. ఆఖరు క్షణాల్లో ఆసీస్ గోల్ కోసం చేసిన ప్రయత్నాలను భారత్ భగ్నం చేసింది. ఐదు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆస్ట్రేలియాపై ఒలింపిక్స్‌లో ఘన విజయం నమోదు చేసింది. ఆస్ట్రేలియాపై మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా రాణించింది. 12 సార్లు ఆసీస్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసింది. 54 శాతం బంతి ని నియంత్రణలో ఉంచుకున్న హాకీ ఇండియా.. ఆసీస్ ఆటగాళ్లను కంగారు పెట్టేసింది.

క్వార్టర్స్‌లో అడుగు : ఆస్ట్రేలియాపై విజయంతో పూల్-బిలో రెండో స్థానంలో నిలిచిన టీమ్ ఇండియా.. క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. కీలక నాకౌట్ దశలో భారత్ ప్రత్యర్థి ఎవరు అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. డ్రా ప్రకారం పూల్-బిలో రెండో స్థానంలో నిలిచిన జట్టు క్వార్టర్‌ఫైనల్లో పూల్-ఏలో మూడో స్థానంలో నిలిచిన జట్టుతో తలపడాల్సి ఉంటుంది. పూల్-ఏలో జర్మనీ, గ్రేట్ బ్రిటన్ ప్రస్తుతం 2, 3 స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ రెండు జట్లు గ్రూప్ దశలో ముఖాముఖి తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో పరాజయం పాలైన జట్టుతో భారత్ క్వార్టర్‌ఫైనల్లో తలపడనుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఉద్యోగులపై మళ్లీ కత్తి..!

- ఇంటెల్‌లో 10వేల మందికి ఉద్వాసన
- టాటా స్టీల్‌లోనూ 2800 మందికి ఎసరు

శాన్‌ఫ్రాన్సిస్కో/ లండన్ : పెట్టుబడిదారి అగ్రదేశాల్లో ఆర్థిక మందగమనం పెరుగుతోంది. టెక్, తయారీ కంపెనీల్లో కొత్త ఉద్యోగాల సృష్టి ఏమో కానీ ఉన్న ఉద్యోగాలు భారీగా ఊడుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో లక్షలాది ఉద్యోగాలకు ఎసరు పెట్టిన అమెజాన్, ట్విట్టర్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ చర్యలను మర్చిపోకముందే తాజాగా మరో విడత టెక్ కంపెనీలు ఉద్వాసనలపై దృష్టి పెట్టాయి. ఇటీవలే పరిస్థితులు మెరుగుపడ్డాయని అనుకునేలోపే కొత్త ఆర్థిక సంవత్సరంలోనూ మరోసారి వేటు పర్వం ఉద్యగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

తాజాగా అమెరికాకు చెందిన ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఇంటెల్



ఏకంగా 15,000 మందిని తొలగించడానికి సిద్ధం అయ్యింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 15 శాతానికి సమానం కావడం గమనార్హం. ఉద్యోగులను తొలగించడం ద్వారా 2025లో 10 బిలియన్ డాలర్లు (రూ.850 కోట్లు) ఆదా కానుందని ఇంటెల్ క్రాప్ సిఇఒ పాట్ గెల్సింగర్ గురువారం వెల్లడించారు. 2024 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఇంటెల్ 1.6 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవి చూసింది. రెవెన్యూ 1 శాతం తగ్గి 12.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2023 చివరి నాటికి 124,800 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో 15 శాతం మందిని తొలగించాలని తాజాగా కంపెనీ నిర్ణయించింది.

'రెండో త్రైమాసికం ఫలితాలు నిరాశపరిచాయి. చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. ఉత్పత్తులు, తయారీ ప్రక్రియలో ఎన్నో మైలురాళ్లను అధిగమించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు మాత్రం లేవు. దీంతో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఇంకా కఠిన సవాళ్లతో కూడిన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది' అని పాట్ గెల్సింగర్ తెలిపారు.

టాటా స్టీల్‌లో కోతలు

తమ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో కోత విధిస్తామన్న ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవడం లేదని టాటా స్టీల్ స్పష్టం చేసింది. బ్రిటన్ తయారీ యూనిట్‌లోని 'కార్బన్ ఇంటెన్సివ్ బ్లాస్ట్ ఫర్నేస్' మూసివేత ప్రక్రియ ప్రారంభించినట్లు టాటా స్టీల్ గ్లోబల్ సిఇఒ టివి నరేంద్రన్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇక్కడి ప్లాంట్‌లోని ఉద్యోగుల్లో తొలగింపులు ఉంటాయని తాము గతంలోనే చెప్పామన్నారు. ఆ ప్రతిపాదనల్లో ఎలాంటి మార్పులేదన్నారు. ఇప్పటికే ఒక కార్బన్ ఇంటెన్సివ్ బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేస్తున్నట్లు చెప్పామని.. ఆ మేరకు చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. బ్రిటన్ ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపించామన్నారు. తయారీ యూనిట్‌లోని మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను సెప్టెంబర్‌లో మూసివేసేలా చర్చలు జరుగుతున్నాయన్నారు. రెండు ఫర్నేస్‌లు మూతపడడంతో సౌత్ వేల్స్‌లోని పోర్ట్ టాల్బోట్ యూనిట్‌లో 2,800 వరకు ఉద్యోగాలు పోనున్నాయన్నారు. ఇటీవల భారత ఐటి కంపెనీల్లోనూ ఉద్యోగుల సంఖ్యలో భారీ తగ్గుదల చోటు చేసుకుంటుంది. దిగ్గజ ఐటి సంస్థ ఇన్ఫోసిస్‌లో 2024 జూన్ ముగింపు నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,15,332కు పరిమితమయ్యారు. మార్చి ముగింపు నాటికి ఈ సంఖ్య 3,17,240గా ఉండగా.. ఏడాదిలో నికరంగా 20,962 మంది ఉద్యోగులు తగ్గడం గమనార్హం.

సూర్యోదయ్ ఎస్ఎఫ్‌బి లాభాల్లో 47% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎస్ఎఫ్‌బి) నికర లాభాలు 47 శాతం పెరిగి రూ.70 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.48 కోట్ల లాభాలు ఆర్జించింది. గడిచిన క్యూ1లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం, వడ్డీయేతర ఆదాయాల్లో వృద్ధి మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయని ఆ బ్యాంక్ తెలిపింది. నికర వడ్డీ ఆదాయం 30.5 శాతం పెరిగి రూ.293 కోట్లుగా, వడ్డీయేతర ఆదాయం 37 శాతం పెరిగి 70 కోట్లుగా చోటు చేసుకుంది. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎలు 3.04 శాతం నుంచి 2.84 శాతానికి, నికర ఎన్‌పిఎలు 1.63 శాతం నుంచి 0.47 శాతానికి పరిమితమయ్యాయి.

ఇన్నోవా హైక్రాస్ జడ్ఎక్స్‌లకు తిరిగి బుకింగ్

బెంగళూరు : టొయోటా కిర్లోస్కర్ మోటార్ తన ఇన్నోవా హైక్రాస్ జడ్ఎక్స్, జడ్ఎక్స్ (0)లకు తిరిగి బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు శుక్రవారం ఆ సంస్థ ప్రకటించింది. 2022లో వీటిని విడుదల చేసినప్పటి నుండి అపూర్వ స్థాయిలో కస్టమర్ స్పందనను అందుకున్నట్లు తెలిపింది. సెల్ఫ్ ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వేరియంట్ షేప్, గ్యాసోలిన్ వేరియంట్ రెండింటిలోనూ ఇన్నోవా హైక్రాస్ లభ్యమవుతుందని పేర్కొంది.

హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌కు రూ.2 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ పలు నిబంధనలు ఉల్లగించడంతో ఆ సంస్థపై రూ.2 కోట్ల జరిమానా విధిస్తూ ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఆ కంపెనీ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. పాలసీదారుల ఆసక్తులను కాపడటంలో విఫలమయినందున రూ.1 కోటి, కంపెనీ అవుట్ సోర్సింగ్ విధానాల్లో లోపాలపై రూ.1 కోటి చొప్పున జరిమానా విధించింది. దీనికి సంబంధించి ఆగస్టు 1న ఐఆర్‌డిఎఐ నుంచి నోటీసులు అందుకుంది.

ఐటిఆర్ ఫైలింగ్‌లో 7.5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్న్‌లో కొత్త రికార్డ్ నమోదయ్యింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 7.28 కోట్ల ఐటిఆర్‌లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు ఇదే అత్యధికమని ఐటి వర్గాలు తెలిపాయి. ఇంతక్రితం 2022-23 నాటితో పోల్చితే 7.5 శాతం పెరుగుదల చోటు చేసుకుందని శుక్రవారం ఆదాయపు పన్ను విభాగం వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఐటిఆర్ దాఖలు చేయడానికి జులై 31తో గడువు ముగిసింది. ఉద్యోగులు, ఐటి ఫైలు చేస్తున్న వారి నుంచి వచ్చిన దాదాపు 10.64 లక్షల సందేహాలను ఇ-ఫైలింగ్ హెల్ప్‌డెస్క్ నివృత్తిఇ చేసినట్లు పేర్కొంది.

వెనిజులా అధ్యక్ష ఎన్నికలపై ఆడిట్ చేపట్టండి

- న్యాయస్థానాన్ని కోరిన అధ్యక్షుడు నికొలస్ మదురో

కారకస్ : వెనిజులా అధ్యక్ష ఎన్నికలపై ఆడిట్ నిర్వహించాల్సిందిగా అధ్యక్షుడు నికొలస్ మదురో వెనిజులా హైకోర్టును కోరారు. ఈ ఎన్నికల్లో తాను సాధించిన విజయంపై అమెరికా అనుకూల ప్రతిపక్ష నేతలు నానా యాగీ చేస్తుండడంతో యావత్ ఎన్నికల ప్రక్రియపై ఉన్నత న్యాస్థానంతో ఆడిట్ చేయించాలని కోరారు. వెనిజులా వ్యవహారాల్లో బయటివారి జోక్యం వుందంటూ క్యూబా నాయకులు విమర్శించారు.. ఆదివారం నాటి ఎన్నికలకు సంబంధించిన ఓట్ల ట్యాలీల షీట్లన్నింటినీ చూపించడానికి యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా కూడా సిద్ధంగా వుందని మదురో విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. 'న్యాయం కోసం నేనే న్యాయస్థానాన్ని ఆశ్రయించా'నని వ్యాఖ్యానించారు.

వెలవెలబోతున్న సూరత్ డైమండ్ బోర్స్

ప్రధాని ప్రారంభించి ఏడు నెలలైనా తొలగని సమస్యలు



సూరత్ : వజ్రాల వ్యాపారులను ప్రోత్సహించేందుకు గుజరాత్‌లోని సూరత్ నగర సమీపంలో గత సంవత్సరం డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభమైన సూరత్ డైమండ్ బోర్స్ (ఎస్డీబీ) ఇప్పుడు వెలవెలబోతోంది. కార్మికుల నుంచి వ్యాపారుల వరకూ...వజ్రాల పరిశ్రమలో పని చేసే ప్రతి ఒక్కరికీ ఇది కేంద్రంగా విలసిల్లుతుందని, లక్షన్నర మందికి ఉపాధి కల్పిస్తుందని అప్పుడు గొప్పగా చెప్పుకొచ్చారు. కానీ ఏడు నెలలు గడిచినప్పటికీ ఘనమైన ప్రణాళికలేవీ రూపుదిద్దుకోలేదు. అత్యంత విశాలమైన ఎస్డీబీలో కార్యాలయాలు కూడా ప్రారంభం కాలేదు. ఉపాధి కోసం ముంబై నుంచి సూరత్ వెళ్లిన వారిలో చాలా మంది తిరిగి వాణిజ్య రాజధానికి పయనమయ్యారు.

ఎస్డీబీ విస్తీర్ణం 64 లక్షల చదరపు అడుగులు. ఈ కాంప్లెక్స్‌లో తొమ్మిది టవర్లు ఉన్నాయి. ఒక్కో దానిలో పదిహేను అంతస్తులు. నాలుగు వేల కార్యాలయాలు పనిచేయవచ్చు. అయితే వాస్తవానికి ప్రస్తుతం పది సంస్థలు మాత్రమే ఇందులో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొన్ని కార్యాలయాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. కొనుగోలుదారులు ఎస్డీబీకి రావడం లేదని, అందుకే పెద్దగా స్పందన లేదని ఓ వ్యాపారి చెప్పారు. మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడం, అంతర్జాతీయ మార్కెట్‌లో మందగమనం, బులెట్ రైలు వ్యవస్థ నిర్మాణంలో జాప్యం కూడా వ్యాపారుల నిరాసక్తతకు కారణంగా కన్పిస్తోంది.



ఉదాహరణకు కిరణ్ జెమ్స్ సంస్థ యజమాని వల్లభ్ లఖానీ ఈ కాంప్లెక్స్‌లో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కొనుగోలు చేశారు. వ్యాపార కార్యాలయాన్ని, సిబ్బందిని ముంబయి నుంచి సూరత్‌కు మార్చారు. ఆ ప్రాంతంలోనే సిబ్బందికి వసతి కూడా కల్పించారు. అయితే వ్యాపారం మందకొడిగా సాగడంతో తట్టాబుట్టా సర్దుకొని తిరిగి ముంబయి బాట పట్టారు. ఆయన సూరత్‌లో ఉన్నది కేవలం రెండు నెలలు మాత్రమే. కాంప్లెక్స్‌ను నిర్మించిన ప్రదేశం సూరత్ శివారులో ఉంది. అక్కడికి రవాణా సౌకర్యాలు కూడా సరిగా లేవు. వ్యాపారం అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు కల్పించాలని, రవాణా, ఎగుమతి సౌకర్యాలు అందుబాటులో ఉండాలని ఓ వ్యాపారి చెప్పారు. కాంప్లెక్స్ యాజమాన్యం తొలుత బడా వ్యాపారులనే ప్రోత్సహించింది. మధ్యతరహా వ్యాపారులను పట్టించుకోలేదు. దీంతో వారంతా ఇక్కడ వ్యాపారం చేయడానికి విముఖత వ్యక్తం చేశారు.

మౌలిక వసతులు కల్పించకపోవడంతో తాము సూరత్ వెళ్లడం లేదని, విమానాశ్రయం కూడా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని ముంబయికి చెందిన ఓ వ్యాపారి తెలిపారు. సూరత్ ఎయిర్‌పోర్టు ను అంతర్జాతీయ విమానాశ్రయంగా పరిగణించినప్పటికీ ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉంది. ముంబయి నుంచి రోజుకు వెయ్యి విమానాలు రాకపోకలు సాగిస్తుంటే సూరత్ నుండి కేవలం 35 మాత్రమే తిరుగుతున్నాయి. వజ్రాలను ఎగుమతి చేయాలంటే మళ్లీ ముంబయి వెళ్లాల్సి వస్తోందని, అలాంటప్పుడు సూరత్‌లో వ్యాపారాలు నడిపి ప్రయోజనమేమిటని వ్యాపారులు ప్రశ్నించారు. ప్రతిష్టాత్మకమైన ముంబయి-అహ్మదాబాద్ బులెట్ రైలు ఇంకా ప్రారంభం కాలేదు. 2028 నాటికి బులెట్ రైలు నడుస్తుందని అంచనా.

అంతర్జాతీయంగా డైమండ్ మార్కెట్‌లో ఇప్పుడు మాంద్యం నెలకొని ఉంది. వ్యాపారం పడిపోయింది. మన దేశానికి అమెరికా, చైనాలు అతిపెద్ద వినియోగదారులు. ఈ నేపథ్యంలో సూరత్‌లో వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ముంబయి వ్యాపారులే సమస్యలు ఎదుర్కొంటున్నారని, కాబట్టి ఇక్కడ సమస్యలు ఉండడంలో ఆశ్చర్యం ఏమీ లేదని ఎస్డీబీ పెద్దలు చెబుతున్నారు. ముంబయి, సూరత్ నగరాలు వజ్రాలకు కేంద్రాలు. సూరత్‌లో వజ్రాలు తయారవుతుంటాయి. ముంబయి నుంచి ఎగుమతి అవుతుంటాయి. సూరత్ నగరంలో 4,500కు పైగా వజ్రాల కర్మాగారాలు ఉన్నాయి. వాటిలో ఆరు లక్షల మంది పనిచేస్తున్నారు. ఆసియా, రష్యా, బెల్జియం గనుల నుండి వచ్చే ముడి వజ్రాలను ఇక్కడ కత్తిరించి, పాలిష్ చేస్తారు.

దేశంలో 4.43 కోట్ల ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగింపు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్
- తెలంగాణలో 6,75,511.. ఏపీలో 35,54,1,93

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఐదున్నరేండ్లలో 4,43,04,661 ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగించినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2019-20లో 14,33,431, 2020-21లో 27,97,013, 2021-22లో 50,39,649, 2022-23లో 2,25,38,538, 2023-24లో 1,02,71,048, 2024-25 (ఇప్పటి వరకు)లో 22,24,982 ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగించారు. తెలంగాణ రాష్ట్రంలో 2019-20లో 4,084, 2020-21లో 5,282, 2021-22లో15,976, 2022-23లో 5,10,683, 2023-24లో 84,744, 2024-25 (ఇప్పటి వరకు)లో 54,742 ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగించారు. మొత్తం ఐదున్నరేండ్లలో కలిపి 6,75,511 జాబ్ కార్డులు తొలగించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదున్నరేండ్లలో 35,54,193 జాబ్ కార్డులు తొలగించారు.

తగ్గుతున్న రైతుల ఎరువుల సబ్సిడీ

రైతుల ఎరువుల సబ్సిడీ తగ్గుతోంది. లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం ఈ తగ్గుదలను స్పష్టం చేసింది. 2022-23లో రూ.2,54,798.9 కోట్ల ఎరువుల సబ్సిడీ ఇవ్వగా, 2023-24 నాటికి రూ.1,95,420.51 కోట్లకు తగ్గింది. అంటే రూ. 59,378.39 కోట్లు తగ్గింది. 2024-25 (జులై 22) రూ.36,993.39 కోట్లకు తగ్గింది.

హైకోర్టు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,597 జడ్జి పోస్టులు ఖాళీ

దేశంలోని హైకోర్టు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,597 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. లోక్‌సభలో ఒకప్రశ్నకు సమాధానం ఇచ్చారు. హైకోర్టుల్లో 359, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,238 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 2024 జులై 29 నాటికి ఏపీ హైకోర్టులో 9, తెలంగాణ హైకోర్టులో 14 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే తెలంగాణలో 115, ఏపీలో 74, జిల్లా, సబార్డినేట్ జడ్జిల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ఆయూష్ మంత్రిత్వ శాఖలో 2,696 పోస్టులు ఖాళీ

ఆయూష్ మంత్రిత్వ శాఖలో 2,696 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ఆయూష్ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ అన్నారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆయూష్ మంత్రిత్వ శాఖకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో 2,568 పోస్టులు ఖాళీగా ఉండగా, 128 బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 23, తెలంగాణలో 74 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయ రంగ ప్రభుత్వ సంస్థల్లో 2,104 పోస్టులు ఖాళీ

వ్యవసాయ రంగ ప్రభుత్వ సంస్థల్లో 2,104 పోస్టులు ఖాళీలు ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 జులై1 నాటికి మొత్తం 5,418 పోస్టులకు గాను, 2,140 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.

కోర్టుల్లో 5.06 కోట్ల కేసులు పెండింగ్

దేశంలో సుప్రీం కోర్టు, హైకోర్టులు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,06,20,772 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సుప్రీంకోర్టులో 83,589, హైకోర్టుల్లో 59,95,569, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 4,45,41,614 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ కోసం సింగపూర్‌తో చర్చలు

- సిఆర్‌డిఎ పరిధి పునరుద్ధరణ • 'అథారిటీ' సమావేశంలో కీలక నిర్ణయాలు
- యాన్యుటీ, పెన్షన్లు మరో ఐదేళ్లు పొడిగింపు

అమరావతి: రాజధాని అమరావతిలో అత్యంత కీలకమైన సీడ్ బిజినెస్ డిస్ట్రిక్(సిబిడి) అభివృద్ధి కోసం సింగపూర్‌తో మరోసారి చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా సిఆర్‌డిఎ పరిధిని గతంలో మాదిరి పునరుద్ధరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సిఆర్‌డిఎ) సమావేశంలో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. క్యాపిటల్ సిటీ పాత మాస్టర్‌ప్లానుకు అనుగుణంగా 217 చదరపు కిలోమీటర్ల పరిధికి, రీజియన్ పరిధిని 8352.69 చదరపు కిలోమీటర్లకు పునరుద్ధరించాలన్న ప్రతిపాదనను ఈ సమావేశం ఆమోదించింది. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశానికి మంత్రి నారాయణ, అథారిటీ సభ్యులు హాజరయ్యారు. మొత్తం 12 అంశాల ఎజెండాతో ఈ సమావేశం జరిగింది. రాజధాని అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్న సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ ఏర్పాటుపై గతంలో స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యాన కన్సార్టియం ముందుకు వచ్చింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేయడంతోపాటు సింగపూర్ వెళ్లి ఒప్పందంపై విచారణ కూడా జరిపింది. దీంతో సింగపూర్ ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీనిని పునరుద్ధరించేందుకు మరోసారి సింగపూర్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. గతంలో అమరావతి రాజధాని నగరం పరిధి నుండి 54 చదరపు కిలోమీటర్లను తొలగించి మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కలిపిన విషయం తెలిసిందే. తాజా సమావేశంలో ఆ విషయం కూడా చర్చకు వచ్చింది. ఆ ప్రాంతాన్ని తిరిగి రాజధాని నగర పరిధిలోకి తీసుకోవాలని నిర్ణయించారు. తొలగించిన పల్నాడు, బాపట్ల పట్టణాభివృద్ధి అథారిటీలను కూడా సిఆర్‌డిఎలో కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. రైతులకు ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన యాన్యుటీ, భూమిలేని పేదలకు ఇస్తున్న పెన్షన్ల గడువు ఈ ఏడాదితో తీరిపోయింది. దీన్ని కూడా మరో ఐదేళ్ల కొనసాగించనున్నారు. ఆగస్టు 1వ తేదీ నాటికి ఎంత మొత్తం యాన్యూటీ చెల్లిస్తున్నారో అంతే మొత్తాన్ని మరో ఐదేళ్లపాటు కొనసాగించనున్నారు. పెన్షన్లనూ అదే పద్ధతిలో కొనసాగిస్తారు.



సిఆర్‌డిఎ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

778 పోస్టుల భర్తీకి ఆమోదం

సిఆర్‌డిఎలో 778 పోస్టులకు అనుమతి ఉండగా ప్రస్తుతం 249 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన పోస్టులనూ భర్తీ చేయాలని నిర్ణయించారు. సిఆర్‌డిఎకు వేర్వేరు సేవలు అందించేందుకు 47 మంది కన్సల్టెంట్లు ఉండగా, వారిలో 15 మంది పని పూర్తయింది. దీంతో మరో 32 మందిని తీసుకోవాలని నిర్ణయించారు. కరకట్ట రోడ్డును నాలుగులైన్లుగా మార్చాలని నిర్ణయించారు. వాస్తవంగా 2019కు ముందే నాలుగులైన్లకు టెండర్లు వచ్చారు.

దాన్ని వైసిపి ప్రభుత్వం రెండు లైన్లకు కుదించింది. ప్రస్తుతం నాలుగులైన్లుగా మార్చి పాత జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోని రోడ్ గ్రిడ్‌కు సంబంధించి ఇ5, ఇ11, ఇ13, ఇ15 రోడ్లను పాత జాతీయ రహదారికి కలపాలని నిర్ణయించారు. కొండలు అడ్డున్నచోట పక్కగా మిగతా 2లో తీసుకెళ్లాలని నిర్ణయించారు. గతంలో ఎర్రబాలెం వద్ద కొండకు టన్నెల్ వేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం పక్కనుండి రోడ్లు వేయనున్నారు.

కృష్ణానదిపై ఏడు వంతెనలు

కృష్ణానదిపై ఏడుచోట్ల వంతెనాలు వస్తాయని, వాటిని ఐకానిక్ వంతెనలుగా మార్చాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధి, సూరాయపాలెం వద్ద పశ్చిమబైపాస్ వంతెన ఉన్నాయి. వీటికి అదనంగా అవుటర్, ఇన్నర్ రింగురోడ్లకు విజయవాడకు పశ్చిమ భాగంలో రెండు, తూర్పుభాగంలో రెండు నిర్మించనున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం వద్ద నిర్మించాలని ప్రతిపాదించిన వంతెన నిర్మాణంపై పునరాలోచించనున్నారు.

130 సంస్థలతో సంప్రదింపులు

గతంలో అమరావతి పరిధిలో 130 సంస్థలకు స్థలాలు ఇచ్చారు. వారితో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఇప్పటికే భూములు పొందిన వారికి ప్రభుత్వం వైపు నుండి లేఖలు పంపించారు. తొలి విడత సిఆర్‌డిఎ కమిషనర్ భాస్కర్ పలువురితో సంప్రదింపులూ జరిపారు. రెండో విడతలో మంత్రి నారాయణ చర్చలు జరపున్నారు. ఈమేరకు అథారిటీలో నిర్ణయం తీసుకున్నారు. బిట్స్ పిలానీ లాంటి సంస్థలనూ పిలిచి మాట్లాడనున్నారు. దీంతోపాటు హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుపైనా త్వరలో ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ఈమేరకు సిఎం అధికారులను ఆదేశించారు.

ఎంఐజి, ఎల్ఐజి ఇళ్లు

రాజధాని పరిధిలో ఎంఐజి, ఎల్ఐజి పద్ధతిలో ఇళ్లు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎం అథారిటీకి సూచించారు. ఇప్పటికే పేదలకు ఇళ్లు నిర్మించిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ద్వారా కొంత జన సామర్థ్యం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

కుక్కల దాడుల్ని కట్టడి చేయండి

- జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్ : .కుక్కల దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీధుల్లో పిల్లలను కరిచే కుక్కలు ఇప్పుడు ఇంట్లోకే వచ్చి ఒక వృద్ధురాలిపై దాడి చేయడంతో మరణించిందని గుర్తు చేసింది. కుక్కల సమస్యలపై దాఖలైన పిల్‌ను, ఇదే అంశంపై వచ్చిన వార్తలను సుమోటోగా విచారణ చేపట్టిన హైకోర్టు, కుక్కల దాడులను నివారణ చర్యలు చాలా అవసరమని చెప్పింది. జంతు సంక్షేమ సంఘాల వారితో చర్చించి నివారణ చర్యలు తీసుకోవాలంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఏబీసీ నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, ప్రభుత్వాన్ని ఆదేశించింది. వీటితోపాటు హైదరాబాద్ మున్సిపాలిటీ ఆవల జంతు పునరావాస కేంద్రాల ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని జీహెచ్ఎంసీకి ఆదేశించింది. అదేవిధంగా కుక్క కాటు, వీధి కుక్కల గురించి ప్రజలు సంప్రదించడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలంది.. ఫిర్యాదులు అందిన వెంటనే కుక్కలను పట్టుకోవడానికి 24 గంటలూ అందుబాటులో ఉండేలా వాహనాల ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కుక్కలకు ఆహారం అందించేందుకు ముందుకు వచ్చేవాళ్లకు అవకాశం ఇవ్వాలని సూచించింది. జంతు సంక్షేమ సంస్థలు నిర్వహిస్తున్నట్లయితే ఖర్చులను స్థానిక సంస్థలు చెల్లించాల్సి ఉంటుందంది. ఏబీసీ పర్యవేక్షక కమిటీ నెలకోసారి అయినా సమావేశం నిర్వహించాలంది. నిబంధనలను ఉల్లంఘించిన ఏబీసీ కమిటీలను స్థానిక సంస్థల సిఫారసుతో రద్దు చేయాలంది. స్థానిక సంస్థలు తమ సొంత సిబ్బందితో జంతు జనన నియంత్రణ కార్యక్రమం చేపట్టాలంది. స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసి ఇందుకోసం ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జిని నియమించాలంది. ఏబీసీ నిబంధనల్లోని 11 ప్రకారం కుక్కల్ని పట్టుకుని స్టెరిలైజ్, రోగ నిరోధక టీకాలు వేసి వదిలి పెట్టాల్సి ఉందని, వీధి కుక్కలను ఫిర్యాదుల ఆధారంగా పట్టుకోవాలంది.

తొలుత ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, ఏబీసీ (అనిమల్ బర్త్ కంట్రోల్) రూల్స్ మేరకు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు జీవో వెలువడిందన్నారు. వెటర్నరీ యూనివర్సిటీ నిపుణులు, ప్రజారోగ్యశాఖ ప్రతినిధులు, ఏబీసీ కేంద్రాల సబ్‌కమిటీలు, మాస్టర్ ట్రైనర్లు, ఐఈసీ సబ్‌కమిటీ సభ్యులతో జులై 22న జరిగిందన్నారు.

తమ ఆదేశాల అమలుపై కార్యాచరణ నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 2కు వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ గోరటిపై కేసులో హైకోర్టు స్టే

అసెంబ్లీ ఎలక్షన్ల రూల్స్ ఉల్లంఘించారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్నపై సైఫాబాద్ పోలీసులు పెట్టిన కేసు విచారణను హైకోర్టు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం అమరజ్యోతి వద్ద డ్రోన్ కెమెరాలు వినియోగించి ఇంటర్వ్యూ చేయడంపై కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సైఫాబాద్ పోలీసులు 2023లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇంటర్వ్యూ చేసిన గోరటి వెంకన్నలపై పెట్టిన కేసు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేస్తోంది. దీనిని కొట్టేయాలంటూ గోరటి వేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించి విచారణను ఈనెల 22కు వాయిదా వేశారు. ఇప్పటికే ఈ కేసులో హైకోర్టు నుంచి కేటీఆర్ స్టే ఆదేశాలు పొందారు. వీటిపై తదుపరి విచారణ ఈ నెల 22న చేస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

క్రిశాంక్‌పై కేసులో చట్ట నిబంధనలను అమలు చేయండి

సీఎం ఎ.రేవంత్‌రెడ్డి పరువును దెబ్బతీసేలా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారంటూ బీఆర్ఎస్‌కు చెందిన మన్నె క్రిశాంక్‌పై సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్‌కు పోలీసులు బీఎన్ఎస్ఎస్ 35 (సీఆర్‌పీసీ 41ఎ) కింద నోటీసులు ఇచ్చాక చట్ట ప్రకారం విచారణ చేయాలంది. ఈ మేరకు జస్టిస్ కె.సుజన శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చారు. శశిధర్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు పెట్టిన కేసును క్రిశాంక్ హైకోర్టులో సవాలు చేశారు. రాజకీయ కక్షతో కేసు పెట్టారని అడ్వొకేట్ టీవీ రమణరావు వాదించారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, పోలీసులకు, ఫిర్యాదుదారు డి.శశిధర్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చి విచారణ చేయాలని ఆదేశించారు. విచారణను వాయిదా వేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ అక్రమ తవ్వకాలపై తాజా నివేదికలతో ఏపీ ప్రభుత్వం, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అఫిడవిట్ దాఖలు చేసింది. మే 9న దాఖలు చేసిన అఫిడవిట్‌కి, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వేసిన అఫిడవిట్‌కి చాలా వ్యత్యాసం ఉందని దండా నాగేంద్ర కుమార్ తరపు న్యాయవాది తెలిపారు. ఇసుక అక్రమాల వ్యవహారం గతంలో జియాలజీ, మైనింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన అధికారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై షోకాజ్ నోటీసులు, ఎఫ్ఐఆర్‌ల నమోదుతోపాటు, తీసుకున్న చర్యలను అఫిడవిట్‌లో చెప్పినట్లు న్యాయవాదులు పేర్కొన్నారు. వర్షాల కారణంగా అక్రమ తవ్వకాల ఆనవాళ్లు తొలిగిపోయినందున, శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణకు ప్రయత్నిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణకు కనీసం మూడు వారాలు పడుతుందని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. తాము ఇప్పటికే 8 జిల్లాల్లో తనిఖీలు జరిపినట్లు సుప్రీంకోర్టుకు కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తమ తనిఖీల్లో తేలిన విషయాలన్నీ కోర్టు ముందుంచినట్లు అదనపు సోలిసిటర్ జనరల్ అన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇసుక తవ్వకాల్లో కీలక పాత్ర పోషించిన జేపీ వెంటర్స్ సంస్థను మాత్రం వదిలిపెట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తమపై విధించిన జరిమానా రూ. 18 కోట్లపై విచారణ జరపాలని జేపీ సంస్థ తరపు న్యాయవాదులు కోరారు. ఇప్పుడు కాదని, దానిపై నిర్ణయం తీసుకునే ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన అఫిడవిట్ల ను పరిశీలించాల్సి ఉందని జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా ధర్మాసనం పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 31కి వాయిదా వేసింది. ఆలోపు మిగిలిన వివరాలు కూడా కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సప్లిమెంటరీ అఫిడవిట్ దాఖలు చేసేందుకు ధర్మాసనం అనుమతించింది.

ఆర్ఎస్ఎస్‌పై ఇచ్చిన తీర్మానాన్ని సవరించాలి

రాజ్యసభ చైర్మెన్‌కు కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ లేఖ

ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన షూటర్ స్వప్నిల్‌కు లోక్‌సభ అభినందనలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్ఎస్ఎస్‌పై ఇచ్చిన తీర్మానాన్ని సవరించాలని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్‌కు లేఖ రాశారు. ఆర్ఎస్ఎస్ ఒక నమోదు కాని సంస్థ అని, ఈ అంశాన్ని సభలో లేవనెత్తడానికి అనుమతించాలని లేఖలో కోరారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో పాల్గొనేందుకు ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగపరమైన హక్కులు ఉన్నాయని గురువారం రాజ్యసభ చైర్మెన్ తీర్మానించారు. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. "ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన కొన్ని వాస్తవాలను మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నా. ఇది రిజిస్టర్ సంస్థ కాదు. సభ్యత్వం లేదు. బ్యాంకు ఖాతా లేదు. అన్ని స్థాయిలలో ప్రభుత్వ పనితీరులో నిస్సంకోచంగా జోక్యం చేసుకునేలా రిజిస్టర్ కాని సంస్థకు రాజ్యాంగ హక్కులు కల్పించడాన్ని మీ పరిశీలనలోకి తీసుకురావాలను కుంటున్నాను" అని దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. "రూల్ 238 (4) నిబంధన కింద ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తేందుకు అనుమతించాలి. అలాగే రాజ్యాంగంలోని ఏ చట్టం ప్రకారం ఆర్ఎస్ఎస్ రిజిస్టర్ కాలేదనే వాస్తవాన్ని అంగీకరించి, మీ తీర్మానాన్ని సవరించాలి" అని లేఖలో విజ్ఞప్తి చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను దెబ్బతీసిన సుదీర్ఘ చరిత్ర ఆర్ఎస్ఎస్‌కు ఉందని కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ (కమ్యూనికేషన్) జైరాం రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌ను బహిష్కరించారని గుర్తు చేశారు. ఇటీవల ఆర్ఎస్ఎస్‌కు ఇచ్చిన క్లీన్‌చిట్‌లు, ప్రశంసాపత్రాలను చూసి దేశ ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నివ్వెరపోతారని అన్నారు. హోం మంత్రిగా ఆయన పదవీకాలంలో జారీ చేసిన అనేక పత్రాలు ఆ సంస్థ హింసాత్మక, రాజ్యాంగ వ్యతిరేక, దేశ వ్యతిరేకతను వెల్లడిస్తాయని తెలిపారు.

కాంస్య పతాక విజేత షూటర్ స్వప్నిల్‌కు అభినందనలు

పారిస్ ఒలింపిక్స్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ (త్రీపి)లో కాంస్య పతాకం గెలుచుకున్న భారత యువ షూటర్ స్వప్నిల్ కుసాలెకు లోక్‌సభ అభినందనలు తెలిపింది. శుక్రవారం లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ఓంబిర్లా సభ తరపున యువ షూటర్‌కు అభినందనలు తెలిపారు. సభలో అడగాలనుకున్న విషయాలను నేరుగా అడగాలని, కథలు చెప్పొద్దని బీజేపీ ఎంపీ ప్రదీప్ పురోహిత్‌కు స్పీకర్ ఓం బిర్లా హితవు పలికారు.